సంపుటి : 74 సంచిక : 30 పుటలు : 52

# జాగృతి

కలి 5124 - శ్రీ శుభకృత్ వైశాఖ బహుళ అష్టమి
23-29 మే 2022
వెల : ₹15/-



'124 ఎ అమలు మీద స్టే విధించడం పెద్ద తప్పిదం!'



## రాజద్రోహం సెక్షన్

# రద్దు సరే, తరువాత!

ఒక చట్టం దుర్వినియోగం అవుతున్నదని భావిస్తే దానికి రద్దే పరిష్కారమా?

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

74 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

74

# జాగృతి

జాతీయ తెలుగు వారపత్రిక

## ఆసక్తి కలిగించే విశ్లేషణలు.. జాగృతపరిచే కథనాలు..
## చైతన్యం నింపే వాస్తవాలు.. స్ఫూర్తిని నింపే రచనలతో
## ఇపుడు జాగృతి వారపత్రిక మరింత కొత్తగా మీ ముందుకు వస్తున్నది.

రండి..
జాతీయభావాల వేదిక
జాగృతి వారపత్రికలో
చందాదారులుగా
చేరుదాం.. చేర్పిద్దాం!

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో పంపుటకు కిందనున్న క్యు.ఆర్. కోడ్‌లను
మీ మొబైల్‌తో స్కాన్ చేయండి.. లేదా లింక్ ద్వారా చందా చెల్లించండి!

ఒక సంవత్సర చందా రూ.650/-
http://payit.cc/S18970

**Jagriti Bank A/c details :**
Jagriti Prakasan Trust,
A/c No.920010061405325,
Axis, Kothapet Branch, Hyderabad.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

ఐదు సంవత్సరాల చందా రూ.3000/-
http://payit.cc/S18973

3-4-228/4/1, Kachiguda, Hyderabad-500027.
Ph : 040-27561453, 9959997013. email : jagritiweeklysub@gmail.com

# నవయుగభారతి 'అక్షయపాత్ర' పథకానికి పోషకులుగా ముందుకురండి
# తెలుగుపాఠకులకు ఉత్తమ సాహిత్యాన్ని అందించటంలో భాగస్వాములు కండి

కొన్ని పుస్తకాలు చిన్నవి కావచ్చు. కాని చదివిన వారిలో మంచి ఆలోచనలను ప్రవేశపెట్టి వారి జీవితాలను సక్రమపథంలో నడిపించగలవు. అటువంటి పుస్తకములు ఎక్కువ సంఖ్యలో ముద్రితమై, తక్కువధరకు నిరంతరంగా లభిస్తూ ఉండాలి. ఇది జరగాలంటే మార్కెట్ ఆర్థికసూత్రాలకు అతీతంగా ఆ పుస్తకాల ముద్రణకు ప్రత్యేక పోషణ ఉండాలి. ఎంపిక చేయబడిన పుస్తకములకు దాదాపుగా 50% శాతం వ్యయాన్ని తిరిగితీసుకొనని పెట్టుబడిగా సమకూర్చాలని, తద్వారా పుస్తకం వెలను 30 శాతంవరకు తగ్గించాలని నవయుగభారతి ఆలోచిస్తున్నది.

కొన్ని పుస్తకాలు బృహత్తరమైనవి. తగినంత సంఖ్యలో అమ్ముడుపోగలవని నమ్మకం కలిగితే వాటిని అనువదింపజేయటమూ, ముద్రించి మార్కెట్లోకి తీసికొనిరావటమూ సాధ్యమవుతుంది. ఆ నమ్మకం లేకపోతే ఆ పుస్తకాలను తెలుగులో ప్రచురింపజేయటం దుష్కరమవుతుంది. కాబట్టి ఎంత బరువైన పుస్తకమైనా, కొనేందుకు తగినంత సంఖ్యలో సిద్ధంగా ఉన్నవారిని సమకూర్చుకోవాలనీ ఆలోచిస్తున్నది. **ఈ రెండు ఆశయాల సమన్వయరూపం ఈ అక్షయపాత్ర పథకం.**

**ప్రతి తెలుగు కుటుంబం నుండి కనీసం ఒక్కరైనా ముందుకు రావాలని మా విన్నపం. మీరు చేయవలసింది. 10,116 రూ.లు పోషకసభ్యత్వంగా చెక్కు ద్వారాగానీ, బ్యాంకు (ఆన్‌లైన్) ద్వారాగానీ చెల్లించటం. మీ ఫోటోను, చిరునామా, ఫోను నెంబరు మొదలైన వివరాలను తెలియజేయటం. దీనికి నవయుగభారతినుండి రశీదు పంపబడుతుంది. పది సంవత్సరములలోగా 15 వేల రూపాయల వెలగల్గిన క్రొత్తగా ప్రచురింపబడే పుస్తకాలు అనేక విడతలుగా 3 లేదా 4 నెలల వ్యవధితో రిజిష్టరుపోస్టులో మీకు పంపబడుతాయి.**

అదనంగా ప్రతులు కావాలని మీరు కోరుకుంటే 25% తగ్గింపుతో మీకు అందజేయబడతాయి (రవాణావ్యయం మీరే భరించవలసి ఉంటుంది). ఒకవేళ 15వేల రూపాయల వెలగల కొత్త పుస్తకాల ప్రచురణ పదిసంవత్సరాలకంటే ముందుగానే పూర్తయి, అవి మీకు అందజేయటం జరిగినపుడు మీ పోషక సభ్యత్వాన్ని నవీకరించుకోవలసిందిగా కోరగలము.

ఈ ఆర్థిక సంవత్సరంలో కనీసంగా వేయిమందిని పోషక సభ్యులుగా చేర్చుకోగలమన్న విశ్వాసంతో ఈ విజ్ఞప్తి వెలువరిస్తున్నాం. మధ్యలో విరమించుకోవటం ఉండదని, మీకు ఏవిధమైన నష్టం కలగనిరీతిలో, మీ సంతృప్తిని చూరగొనేలా ఉత్తమగ్రంథాలను వెంటవెంటనే ప్రచురించి అందీయగలమని హామీ ఇస్తున్నాము.

**ఇప్పటివరకు పోషకసదస్యులుగా చేరనివారు ఇప్పుడైనా త్వరపడండి. ఎందుకంటే ఇది మీ విజ్ఞతకు గీటురాయి. మీరు సభ్యులు అయితేనే మరో పదిమందికి చెప్పగలరు.**

## రండి ! భారతిసేవలో కదలిరండి !!

| డా. వడ్డి విజయసారథి | బాలేంద్ర పొట్లూరి | నేతి క్షీరసాగర్ | కె. రామకృష్ణ |
|---|---|---|---|
| సమన్వయకర్త-సంపాదకుడు | అధ్యక్షుడు | కార్యదర్శి | కోశాధికారి |
| 9493173187 | 9885978090 | 9440543725 | 9246534799 |

చెక్కులు పంపడానికి, ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా :
నవయుగభారతి, జాగృతి భవనం,
3-4-288/4/1, లింగంపల్లి, కాచీగూడ, హైదరాబాద్ - 27
nksagar@ymail.com

సేవింగ్స్ బ్యాంకు అకౌంట్ నెం : 0418408438
IFSC Code : IDIB000B052,
Indian Bank, Barakathpura, Hyderabad
చెక్కులు/నగదుబదిలీ 'నవయుగభారతి' పేరున పంపాలి.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, 1-1-60/5, Musheerabad, RTC 'X' Road, Hyderabad-500 020. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

## జాగృతి చందా – సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

- అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- చెక్కు, డిడిపై **Jagriti Prakashan Trust** అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ | 9959310103 |
| కె. హరీష్ | సబ్ ఎడిటర్ | 9959991304 |


డిజైనర్లు : సిహెచ్. కుమార్, ఎం. అనిత

**భా**రతదేశంలో ముస్లింలని నల్లులను నలిపినట్టు నలిపేస్తున్నారని అంతర్జాతీయ ఉదారవాదులు ఊదరగొడుతూ ఉంటారు. ఇక్కడ ముస్లిం నేతలు మాత్రం నిరంతరం హిందువుల మనోభావాలను కించపరుస్తూ కయ్యానికి కాలు దువ్వుతూనే ఉంటారు. ఇందుకు తాజా ఉదాహరణ అపూర్వ ఒవైసి సోదరుల నిర్వాకమే. ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసి మే 12న ఖుల్దాబాద్ (ఔరంగాబాద్ జిల్లా, మహారాష్ట్ర)లో ఒక పాఠశాల భవన నిర్మాణానికి పునాది రాయి వేయడానికి వచ్చి, పనిలో పనిగా కొత్త వివాదానికి బీజం కూడా వేశారు.

ఖుల్దాబాద్‌లోనే ఉన్న ఔరంగజేబ్ సమాధిని అక్బరుద్దీన్ దర్శించుకోవడం, నమాజ్ చేయడం రగడ రేపుతోంది. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, ఇటీవలే ఈ పార్టీతో, కాంగ్రెస్‌తో కలసి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి నిలువెల్లా సెక్యులర్ రంగు పూసుకున్న శివసేన కూడా ముక్కున వేలేసుకున్నాయి. గ్రేట్ మొగలాయిలలో చివరివాడైన ఔరంగజేబ్‌ను 'భారతదర్శనం'లో నెహ్రూ నోరారా పొగుడుతూనే, కాలచక్రాన్ని వెనక్కి తిప్పే ప్రయత్నంలో భంగపడ్డాడనే చివరికి నిర్ధారించారు. భారతీయ ముస్లింలకు ఔరంగజేబ్ ఎప్పటికీ ఆరాధనీయుడు కాదని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు దేవేంద్ర ఫడ్నవీస్ విమర్శించడం అక్షరసత్యం. ఔరంగజేబ్‌ను ఆరాధించి అక్బరుద్దీన్ జాతీయవాద ముస్లింలను అవమానపరిచారని కూడా ఫడ్నవీస్ అన్నారు. మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీతో ఔరంగజేబ్ యుద్ధం చేశాడు. ఆయన మరణించాక కూడా పాతికేళ్లు మరాఠా ప్రజలతో యుద్ధం చేశాడని శివసేన అధికార ప్రతినిధి సంజయ్ రౌత్ గుర్తు చేశారు. అలాంటి వాడి సమాధి దగ్గర నమాజ్ చేసి అక్బరుద్దీన్ మహారాష్ట్రకే సవాలు విసిరారని, తాము ఆ సవాలును స్వీకరిస్తున్నామనీ అన్నారు. మరాఠాలు ఔరంగజేబ్‌ను ఇక్కడే పాతిపెట్టారు. ఆయన అనుచరులు ఎవరైనా ఇక్కడ రాజకీయాలు చేస్తే అతడికి పట్టిన గతే పడుతుందనీ గట్టిగానే హెచ్చరించారు. అక్బరుద్దీన్ చర్య నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధినేత శరద్ పవార్‌కి కూడా ఆగ్రహం

**శాలివాహన 1944 శ్రీ శుభకృత్ వైశాఖ బహుళ అష్టమి**

### లోపలి పేజీలలో...



ముఖపత్ర కథనం
రాజద్రోహం సెక్షన్
**రద్దు సరే, తరువాత..!** 6లో




జాతీయం
**రెచ్చిపోతున్న ఖలిస్తాన్‌వాదులు!** 12లో



ధారావాహిక నవల
**లంబసింగి రోడ్డు**
– డా॥ గోపరాజు నారాయణరావు 20లో

# జాగృతి

## సంపాదకీయం

# కాలు దువ్వుతూనే ఉంటారా?

తెప్పించడం విశేషమే. వీళ్లందరికి మహారాష్ట్ర చరిత్ర తెలుసు, ఆ చరిత్ర ఔరంగజేబ్ గురించి ఏం చెప్పిందో కూడా తెలుసు, అందుకే మహారాష్ట్ర అవతల నుంచి వచ్చి ఇక్కడ వివాదాలు సృష్టించాలనుకోవడం మంచిది కాదని శరద్ పవార్ శషభిషలు లేకుండా చెప్పడం విశేషం కాదా!

తిట్టే నోరు తిరిగే కాలు ఊరుకోవు. అక్కడ కూడా అక్బరుద్దీన్ తన సహజ శైలిలో నోటివాటం ప్రదర్శించారు. హిందూ దేవతలను తూలనాడినా కూడా కేసు నుంచి బయటపడడంతో అక్బరుద్దీన్‌లో మళ్లీ ఉత్సాహం ఉరకలేయడానికి సిద్ధమవుతున్నట్టే ఉంది. పేరు ప్రస్తావించకుండా, మసీదుల నుంచి లౌడ్ స్పీకర్లు తొలగించిన కుక్క అని మొరిగారు. అది మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన అధినేత రాజ్ ఠాక్రే గురించేనని వేరే చెప్పక్కర్లేదు. ఇక, ‘అక్బరుద్దీన్ మీద ప్రభుత్వం చర్య తీసుకోవాలి, లేకుంటే మేమే చట్టాన్ని మా చేతుల్లోకి తీసుకుంటాం’ అని ఆ పార్టీ నాయకుడు గజానన్ కాలే హెచ్చరించకుండా ఎలా ఉంటారు? ఆ సమాధి దగ్గరకి అక్బరుద్దీన్ వెళ్లడం గురించి వేరే అర్థాలు తీయనక్కరలేదని మజ్లిస్ ఎంపి ఇంతియాజ్ జలీల్ సుద్దులు చెబుతున్నారు. కానీ, ఆ చర్యలో రెచ్చగొట్టే ధోరణి తప్ప ఇంకేముంది? కాంగ్రెస్ అధికార ప్రతినిధి సచిన్ సావంత్ మాత్రం తమ పార్టీకి మైనారిటీల పట్ల ఉండే అవ్యాజమైన అనురాగాన్ని దాచుకోకుండా బీజేపీనే విమర్శించారు.

అతని కంటే ఘనుడు ఆచంట మల్లన్న అన్నట్టు, తమ్ముడికి మించిన అన్న అసదుద్దీన్. ఆయన అహమ్మదాబాద్ నుంచి భారతీయ న్యాయ వ్యవస్థకూ, హిందూ సమాజానికీ సవాలు విసిరారు. జ్ఞాన్‌వాపి మసీదులో సర్వే జరుగుతుంటే కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ ఎందుకు మౌనంగా ఉన్నాయంటే, ముస్లింలు వారి ఓట్ బ్యాంక్ కాదు కాబట్టేనని కొంగ్రొత్త సత్యాన్ని జాతి మీదకి వదిలారు అసదుద్దీన్. అహమ్మదాబాద్‌లో మే 14వ తేదీన మాట్లాడుతూ, బీజేపీ, కాంగ్రెస్, ఆప్, ఎస్పీ , బీఎస్పీ అన్నీ మత పార్టీలేనని, ముస్లింలు ముస్లిములుగానే ఉండిపోవాలనే అవి కోరుకుంటున్నాయని పెద్ద ఒవైసి అన్నారు. అయినా ముస్లింలు ముస్లింలుగా ఉండిపోవాలని గట్టిగా కోరుకుంటున్న వారే ఈ ఆరోపణ చేస్తున్నారు. అదే వింత. అక్కడితో ఆగితేనా! మేం బాబ్రీ మసీదును కోల్పోయాం. కపటత్వంతో, న్యాయాన్ని చంపేసి మరీ దానిని లాక్కున్నారు. గుర్తుంచుకోండి! ఇంకొక మసీదును కోల్పోలేం అని నొక్కి చెప్పారాయన. 1991 చట్టం ప్రకారం కట్టడాల విషయంలో ఆగస్ట్ 15, 1947 నాటి యథాతథ స్థితి ఉండాలని చెప్పినా అతిక్రమిస్తున్నారని భాష్యం వెలగబెట్టారు. చట్టాన్నీ, కోర్టు ఆదేశాలనూ గౌరవించాలన్న కనీస జ్ఞానం లేని వాళ్లు కూడా కోర్టులకి పాఠాలు చెబుతున్నారు.

యాభయ్ ఏళ్ల పాలనలో హిందువులను రాచి రంపాన పెట్టిన ఔరంగజేబ్ సమాధికి మొక్కి రావడం వెనుక, బీజేపీ సహా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు (హిందూ) మతోన్మాద పార్టీలేనని ముద్ర వేయడం వెనుక వేరే ఉద్దేశాలు లేవంటే ఎవరు నమ్ముతారు? భారతీయ ముస్లింలకు తామే నాయకులమని చెప్పుకోవడం, వారిని ఒక శిబిరంలోకి తీసుకురావడం అసదుద్దీన్ వాంఛ. కాని ఇదెంత ప్రమాదకర ఎత్తుగడో గుర్తించవలసినది యావద్భారతమే. ఏమైనా ఔరంగజేబ్ సమాధి సాక్షిగా ఇంతకాలానికి ఒక గొప్ప చారిత్రక సత్యానికి ప్రాణప్రతిష్ఠ జరిగింది. ఔరంగజేబ్ పచ్చి హిందూ వ్యతిరేకి. కరుడగట్టిన మతోన్మాది. భారతీయ ముస్లింలకు ఏనాటికీ ఆదర్శనీయుడు కాదు. ఇది కాదా ఆయా పార్టీల నేతలందరి మాటలలోని అంతరార్థం! ★

**23 మే 2022, సోమవారం** | **అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్**


26లో

ప్రత్యేక వ్యాసం

**వ్యక్తిత్వ వికాస ఖని హనుమ**


32లో

వేదిక

**పరిపూర్ణత దిశగా సంఘ్ కార్యక్రమం**

కథ

**పరోక్షంగా..**


– వి. రాజారామ మోహనరావు


28లో

కథ

**ఓదార్పు**

– బి.నర్సన్


40లో


| | | | | | |
|---|---|---|---|---|---|
| అప్పులు, గ్యారెంటీల లెక్కలేవీ? (ఆంధ్రప్రదేశ్) | – | 14 | తాంబూలం-9 (ఆరోగ్యం:ఆనందం) | – | 38 |
| ‘ప్రభావతీ’యం (మహిళ) | – | 15 | భారత బ్యాడ్మింటన్ కల నిజమాయెగా! (క్రీడ) | – | 43 |
| భాజపాలో సరికొత్త ఉత్సాహం (తెలంగాణ) | – | 17 | వార్తా విశేషాలు | – | 44 |
| ఆధ్యాత్మికం | – | 18 | బాలజాగృతి | – | 46 |
| వార్తాహరులు కాదు, పత్రికా రచయితలు కావాలి! (వేదిక) | – | 24 | వారఫలాలు | – | 48 |
| అది సంకుచిత ‘హిందూరాష్ట్ర దర్శనం’ కాదు (ప్రత్యేక వ్యాసం-1) | – | 30 | పదరసం | – | 49 |
| శ్రీలంక.. ఎందుకిలా? (అంతర్జాతీయం) | – | 35 | నేల విడిచి సాము: ‘సర్కారు వారి పాట’ (సినిమా) | – | 50 |

ప్రపంచ పరిస్థితులు మారిపోతున్న ఈ తరుణంలో భారత న్యాయశాస్త్ర చరిత్రలో కొత్త పుట చేరబోతున్నది. గడచిన నాలుగు దశాబ్దాలుగా ప్రపంచ ప్రజానీకం దృష్టిలో వస్తున్న మార్పు ఫలితమిది. ప్రధానంగా భావ ప్రకటనా స్వేచ్ఛ, మానవ హక్కులు, పాలకులు-పాలితుల మధ్య; ప్రభుత్వాలు, వ్యవస్థల మధ్య సంబంధాలు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. ప్రభుత్వాలూ, రాజ్యాంగం, హక్కులూ; వాటి పరిధులు కూడా ఇప్పుడు లోతైన చర్చనీయాంశాలుగా మారాయి. ఇలాంటి నేపథ్యంలో మన దేశాన్ని ఒక్కసారిగా ఒక అంశం కుదిపింది. అదే భారత శిక్షా స్మృతిలోని '124 ఎ' పరిచ్ఛేదం. రాజద్రోహం ఆరోపణతో ఒక పౌరుడిని నిర్బంధించడానికీ, శిక్షించడానికీ అవకాశం కల్పించే పరిచ్ఛేదమిది. దీనిని పునస్సమీక్షించాలని కొందరు, కాదు పూర్తిగా రద్దు చేయాలని కొందరు బలంగా అభిప్రాయపడుతున్నారు. దీనిని రద్దు చేయడమే ప్రజాస్వామ్యానికి గీటురాయని కొందరు భాష్యం చెబుతున్నారు. సంస్కరించడం కాదు, భారత శిక్షా స్మృతి నుంచి దానిని కూకటివేళ్లతో పెకలించాలని ఇంకొందరు వాదిస్తున్నారు. వలసపాలకులు తెచ్చిన ఈ చట్టం అవసరం ఇంకా ఏమిటి? అన్నది అసలు వాదన. ఈ పరిచ్ఛేద దుర్వినియోగం హద్దులు మీరిందన్నది రెండో వాదన. ఈ నేపథ్యంలోనే మే 11, 2022న భారత అత్యున్నత న్యాయస్థానం '124 ఎ' ప్రయోగం మీద స్టే విధించింది. 150 ఏళ్లుగా ఉన్న రాజద్రోహ నేరం, అందుకు సంబంధించిన పరిచ్ఛేదం ఇక కనిపించవు. ఇక్కడే దేశంలో చాలామంది ప్రశ్న- రద్దు చేస్తారు సరే, ఆ తరువాత? ఈ ప్రశ్న నిరర్థకమైనది కాదు. అలా అని వలస ప్రభువులు తెచ్చిన చట్టాన్ని ఇంకా మోయాలని చెప్పడమూ కాదు. రాజద్రోహ చట్టం తెచ్చిన బ్రిటిష్ వలస ప్రభుత్వం పోయింది. కానీ స్వతంత్ర భారతంలో రాజద్రోహ చింతన పోయిందా? ఇదే ఇప్పుడు చాలామందికి వస్తున్న సందేహం.

మార్పును స్వాగతించవలసిందే. అందుకు ఇప్పుడు ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వం సదా సంసిద్ధంగానే ఉంది. 2014-2015 మధ్య నరేంద్ర మోదీ ప్రభుత్వం కాలదోషం పట్టిన 1500 వరకు చట్టాలను రద్దు చేసింది. తాజాగా 124 ఎ పరిచ్ఛేదం గురించి పునరాలోచించడానికి సిద్ధంగా ఉందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం దానికి కొనసాగింపే. భారత లా కమిషన్ కూడా ఆగస్ట్ 30, 2018న 124 ఎ వివాదం మీద కీలక ప్రకటనే చేసింది. ప్రజాస్వామ్యం సజీవంగా, శక్తిమంతంగా ఉండడానికి ప్రభుత్వం మీద చేసే విమర్శ, ప్రకటించే అసమ్మతి గురించిన చర్చలు చాలా అవసరమని లా కమిషన్ చెప్పింది. ఇది కేంద్ర ప్రభుత్వ న్యాయ సలహా వ్యవస్థ కూడా. నాటి కమిషన్ అధిపతి జస్టిస్ బీఎస్ చౌహాన్ అందించిన ఒక పత్రంలో రాజద్రోహ నేరం ఆరోపించడానికి ప్రయోగించే సెక్షన్ 124 ఎ గురించి పునరాలోచించడానికీ, లేదంటే పూర్తిగా రద్దు చేయడానికీ ఇదే సరైన సమయమని పేర్కొన్నారు. కాబట్టి 124 ఎ ఉనికి గురించి పునరాలోచన లేదా



# '124 ఎ అమలు మీద

ఒక చట్టం లేదా ఐపీసీలో ఒక సెక్షన్ దుర్వినియోగమవుతున్నాయన్న ఆరోపణతో వాటిని తొలగించలేం. ఒక చట్టాన్ని ఎవరైనా సవాలు చేస్తే, దానిని న్యాయస్థానాలు కొట్టివేసే వరకు అవి అమలులో ఉన్నట్టే అంటున్నారు పట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి. నిజానికి 124ఎ ను రద్దు చేయడం లేదా సమీక్షించడం అనే ప్రక్రియలు పూర్తి కాకుండానే, ఈ వ్యవహారం ముగింపు సమీప భవిష్యత్తులో కనిపించకపోయినా దాని అమలు మీద సుప్రీం కోర్టు స్టే విధించడం సరికాదని జస్టిస్ నరసింహారెడ్డి నిష్కర్షగా చెప్పారు. ఆ చర్య పెద్ద తప్పిదమని, తీవ్ర పరిణామాలకు దారి తీసేదేనని కూడా స్పష్టం చేశారు. ఈ స్టేతో సుప్రీంకోర్టు గతంలో తాను ఇచ్చిన తీర్పులను తానే ఉల్లంఘించినట్టయిందని కూడా అభిప్రాయపడ్డారు. రద్దు లేదా పునస్సమీక్ష అనివార్యం కాబట్టి, ఆ స్థానంలో వచ్చే కొత్త సెక్షన్ దుర్వినియోగం కాకుండా ఉండేలా రూపొందించడమే ప్రధానమని ఆయన సూచించారు. భారత శిక్షా స్మృతిలోని 124ఎ గురించి దేశమంతా చర్చ జరుగుతున్న తరుణంలో జాగృతి ఆ న్యాయ నిపుణునితో మాటా మంతి జరిపింది. ముఖ్యాంశాలు:

**ఇవాళ యావద్భారత దేశం దృష్టిని తన వైపు తిప్పుకున్న ఒక అంశం- భారత శిక్షా స్మృతిలోని రాజద్రోహం విభాగం. దాని మీద జరిగే పునరాలోచన. లేదా పూర్తి రద్దు. అసలు ఈ విభాగం ఏమిటి? ఎందుకొచ్చింది? బ్రిటిష్ వాళ్ల ప్రమేయం ఎంత? కొనసాగింపునకు ఉన్న పరిస్థితులు ఏమిటి?**

రాజద్రోహం అనే దానిని ఎలాంటి దేశంలోనైనా, ఏ రకమైన వ్యవస్థలో అయినా కూడా నేరంగానే పరిగణిస్తారు. అది రాచరికం కావచ్చు. ప్రజాస్వామిక వ్యవస్థ కావచ్చు. లేదా వెనుకబడిన దేశాలలోనూ కావచ్చు. రాజద్రోహం నేరమే. అంతేకాదు, దేశం పరాయివాళ్ల అధీనంలో ఉన్నప్పుడు, విముక్తం చేయడానికి, ఆ పరాయి ప్రభుత్వాన్ని పడగొట్టే కార్యక్రమాలు ఏం జరిగినా కూడా వాటిని సైతం రాజద్రోహంగానే పరిగణిస్తారు. ఈ నేరానికి శిక్ష తీవ్రంగానే ఉంటుంది. ఎందుకంటే రాచరిక వ్యవస్థను కాపాడుకోవాలన్నా, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూలదోసే ప్రయత్నం జరిగినప్పుడు వాటిని ఎదుర్కోవాలన్నా రాజద్రోహాన్ని తీవ్ర నేరంగా



# రాజద్రోహం సెక్షన్

# రద్దు సరే, తరువాత..!

రద్దు అనే రెండు ప్రధాన కోణాలు కనిపిస్తున్నాయి.

భారత శిక్షా స్మృతిలోని 124ఎ ప్రకారం రాజద్రోహం అంటే ప్రభుత్వాన్ని ధిక్కరించేవీ, ప్రభుత్వం మీద ద్వేషం పుట్టించే తీరులో ఉన్న చర్యలు, ఇందుకు ప్రోత్సహించే రచనలు, ఉపన్యాసాలు వెలువరిస్తే ఈ కేసుతో నిర్బంధించ వచ్చు. ఇందుకు నేరం తీవ్రతను బట్టి శిక్ష ఉంటుంది. కారాగారం, జరిమానా కూడా ఉండవచ్చు. ఇది వలస పాలకుల సృష్టి అని ముందే చెప్పుకున్నాం. థామస్ బాబింగ్టన్ మెకాలే రాసిన 1837 నాటి భారత శిక్షా స్మృతిలో రాజద్రోహం చట్టాన్ని 113 క్లాజ్‌లో చేర్చారు. కానీ ఇది 20 ఏళ్లు ఆలస్యంగా 1860లో అమలులోకి వచ్చింది. అయితే అప్పుడు అనూహ్యంగా రాజద్రోహానికి సంబంధించిన చట్టం అందులో చోటు చేసుకోలేదని ఒక అధ్యయనం చెబుతోంది. ఆ అధ్యయనం ప్రకారం 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ ఘట్టం తరువాత ఈస్టిండియా కంపెనీ ఇలాంటి రాజద్రోహ చట్టం అవసరమని భావించింది. అందుకు కారణం ఆ తరువాత పెరిగిన వహాబీ కార్యకలాపాలు. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం ప్రేరణతో ఈస్టిండియా కంపెనీ పాలన మీద 1870 వరకు అడపా దడపా తిరుగుబాట్లు జరుగుతూనే ఉన్నాయి. అప్పుడు నవంబర్ 25,1870న భారత శిక్షా స్మృతిలో 124ఎ ను చేర్చారు. ప్రభుత్వాల మీద ద్వేషం పెంచే ప్రయత్నాలు చేస్తే శిక్షార్హులను చేస్తూ 1898లో ఈ చట్టానికి సవరణ చేశారు. అప్పటి నుంచి దాదాపు అదే రూపంలో ఇది కొనసాగుతున్నది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1948లో రాజ్యాంగం నుంచి 'రాజద్రోహం' అన్న పదం తొలగించారు. అలా 19 (1)ఎ అధికరణతో పూర్తి స్థాయి భావ ప్రకటనా స్వేచ్ఛ వచ్చింది.

124ఎ దుర్వినియోగమవుతున్నదని చెప్పడానికి

# స్టే విధించడం పెద్ద తప్పిదం!'


పరిగణించడం, అంతే తీవ్రంగా శిక్షించడం తప్పనిసరి. ఇది బ్రిటిష్ పాలనా కాలంలో ఏర్పడిన చట్టం. ఇవాళ్టికీ కొనసాగుతున్నది.

రాజద్రోహం సెక్షన్ కేవలం పరాయి పాలన సమయంలోనే ఉంటుందనుకోవడం పొరపాటు. ఇప్పటికీ చాలా ప్రజాస్వామికదేశాల్లోను, స్వాతంత్ర్యం తెచ్చుకున్న దేశాల్లోను రాజద్రోహం/సెక్షన్ కనిపిస్తూనే ఉన్నాయి. అమెరికాలో కూడా ఉంది. పాత చట్టాన్ని కొద్దిగా మార్చినా గాని రాజద్రోహం సెక్షన్ బ్రిటన్‌లో కూడా ఉంది. రాజద్రోహానికి పాల్పడితే అంత సులభంగా ఎక్కడా వదిలిపెట్టరు. ఇక రాజద్రోహం, ప్రజల యాటిట్యూడ్ గురించి మాట్లాడుకోవాలంటే– ఒక్కొక్కసారి అది ఆ దేశ ప్రజల చారిత్రక అవసరం కూడా అవుతుంది. అలాగే ఇలాంటి చట్టం చేయడం కూడా ప్రభుత్వాలకు అనివార్యమవుతుంది. ఎందుకంటే ప్రభుత్వాలను ప్రజలు ఎన్నుకుంటారు. దాని విధానాలు, పాలన ఇష్టం లేకుంటే వాటిని ఓటుతో ఓడిస్తారు. ఓటును విశ్వసించని వాళ్లు– తీవ్రవాదులే కావచ్చు, లేక తీవ్రమైన అభిప్రాయాలున్న వాళ్లే కావచ్చు. కొద్దిమంది మేము వ్యవస్థనే మార్చేస్తాం, మొత్తం దేశాన్ని అతలాకుతలం చేస్తాం, వ్యవస్థలన్నింటిని నాశనం చేస్తామంటే ఏ వ్యవస్థా చూస్తూ ఊరుకోదు. అది మెజారిటీ ప్రజాభిప్రాయాన్ని తిరగతోడడమే. ప్రజాభిప్రాయాన్ని ధిక్కరించి, మీ ప్రజాభిప్రాయం, ప్రజాస్వామ్యం మాకు అవసరం లేదు, మా మాటే నెగ్గాలని శాసిస్తే నడవదు కదా! కొన్ని కోట్ల మంది ప్రజలున్న దేశంలో భిన్నత్వంలో ఏకత్వమున్న దేశంలో వంద లేకుంటే వెయ్యి మంది ఓ అభిప్రాయానికి వచ్చి ఈ తరహా ప్రభుత్వం మనకు వద్దు. ఈ వ్యవస్థ వద్దు అంటే, ఈ పార్టీ మాత్రం వద్దు, ఇలాంటి వ్యక్తులు అసలే వద్దు అంటే నడవదు.

**124ఎ ను రద్దు చేయాలనీ, పునస్సమీక్షించాలనీ గతంలోను చాలా మంది చాలా సందర్భాలలో కోరారు. ఇప్పుడు ఇంత తీవ్రంగా ఎందుకు ఈ డిమాండ్ ముందుకు వచ్చింది?**

రాజద్రోహ నేరం ఇప్పుడు అవసరమా? వలస పాలన నాటి అవశేషం అని ప్రశ్నించడం, విమర్శించడం, దానిని సమీక్షించమంటూ కోర్టుకు వెళ్లడం ఇవన్నీ చట్టబద్ధమే. కాదనలేం. కొంచెం లోతుగా వెళ్లినట్లయితే కొన్ని వాస్తవాలు బోధపడతాయి. మనకు స్వాతంత్ర్యం వచ్చింది. కానీ ఒక బలిష్టమైన దేశీయ వ్యవస్థను మనం ఏర్పరచుకోలేదు. కొందరి దయాదాక్షిణ్యాల మీద ఉండిపోయాం. ఈశాన్య భారతాన్ని ఒకరికి వదిలిపెట్టేశాం. గిరిజన జాతుల అభివృద్ధి పేరుతో ఇతరులెవ్వరిని అటు పోనియ్య కుండా కేవలం క్రిస్టియన్ మైనారిటీస్‌కి స్వేచ్ఛగా ఈశాన్య భారత రాష్ట్రాలను అప్పగించాం. వాళ్లు అక్కడి వారందరిని మార్చేసారు. ఇంకో వ్యవస్థను ఇంకో సిద్ధాంతం వారికి వదిలిపెట్టాం. స్వాతంత్ర్య పోరాటంలో ఖిలాఫత్ ఉద్యమాన్ని కలపడం మరొకటి. మనమే మన స్వాతంత్ర్యం కోసం కొట్టుమిట్టాడుతూ, మధ్యలో ఖలీఫా పునరుద్ధరణ అని పెట్టుకున్నాం. దేశంలో మతపరమైన విభజన వచ్చింది. ఎవరు తమకంటూ ప్రత్యేక భాగాన్ని పొందగలిగారో వాళ్లు అది పొంది, మిగతా దాంట్లో కూడా భాగం ఉండాలనుకున్నారు. అంటే ఇది మాది.. మనది అనడమే. ఇంకా చెప్పాలంటే,

సుప్రీంకోర్టు స్టే విధించిన ఐదు రోజుల ముందు, అంటే మే 6న బెయిల్ పొందిన ఇద్దరు వ్యక్తుల ఉదంతం చాలు. అమరావతి (మహారాష్ట్ర) స్వతంత్ర లోక్‌సభ సభ్యురాలు నవనీత్ కౌర్, స్వతంత్ర ఎమ్మెల్యే రవి రాణాలను ఏప్రిల్ 23న అరెస్టు చేసి, రాజద్రోహం కేసు నమోదు చేశారు. ఇంతకీ వారు చేసినది, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే నివాసం మాతోశ్రీ ఎదురుగా హనుమాన్ చాలీసా పఠిస్తామని ప్రకటించడమే. మసీదుల మీద లౌడ్ స్పీకర్ల తొలగింపునకు ఎంఎన్ఎస్ నాయకుడు రాజ్ ఠాక్రే గడువు విధించడం, ఆ గడువులోగా వాటిని తొలగించకుంటే రెట్టింపు శబ్దంతో హనుమాన్ చాలీసా పఠిస్తామంటూ చేసిన హెచ్చరిక రాష్ట్రమంతా వేడి పుట్టించిన నేపథ్యంలో ఇది జరిగింది. ఆ ఇద్దరి మీద రాజద్రోహం కేసు పెట్టవలసిన అవసరం ఏముందని కోర్టు కూడా ఆ రాష్ట్ర ప్రభుత్వానికి మొట్టికాయలు వేసింది. సాధారణ ప్రజానీకం కూడా హనుమాన్ చాలీసా చదివితేనే రాజద్రోహమా? అని ప్రశ్నించుకోవలసి వచ్చింది. కానీ ఇది రాజద్రోహం ఆరోపణకు ఒక పార్శ్వం మాత్రమే. మరొక పార్శ్వం కూడా ఉంది.



జస్టిస్ సూర్యకాంత్ జస్టిస్ ఎన్వీ రమణ జస్టిస్ హిమా కొహ్లి

నిజానికి రాజద్రోహం నేరం ఆరోపిస్తున్న కేసులు మిగతా కేసులతో పోల్చుకుంటే దేశంలో చాలా తక్కువ. భారత శిక్షా స్మృతి ప్రకారం ఈ చట్టం కిందకు వస్తున్న వారు 0.01 శాతం కంటే తక్కువే. ఖలిస్తాన్ జిందాబాద్, ఖాల్సా రాజ్యం వస్తుంది వంటి నినాదాలు చేయడం రాజద్రోహం కిందకు రావని 1995లో సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చింది. రజత్ శర్మ, వినోద్ దువా, కిశోర్ చంద్ర వాంఘ్ కేమ్చా వంటి జర్నలిస్టులు కూడా ఈ కేసును ఎదుర్కొన్నారు. వినోద్ దువా తన టీవీ కార్యక్రమంలో ఉగ్రవాద చర్యలలో చనిపోయిన వారి ద్వారా మోదీ ఓట్లు సంపాదిస్తున్నారని ఆరోపించడంతో కేసు పెట్టారు. ఇక్కడ నుంచి విదేశాలకు పంపిన వెంటిలేటర్లను సరిగా స్టెరిలైజ్ చేయలేదని కూడా ఆరోపించారు. అవి అబద్ధాలని తేలింది. అయినా కూడా ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు పౌరులకు ఉంటుందని సుప్రీంకోర్టు చెప్పింది. కానీ అబద్ధాలతో విదేశాలలో దేశం పరువు పోగొట్టడం మాటేమిటి? 370 అధికరణకు చైనా మద్దతు ఉందంటూ జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేసిన కార్యక్రమానికి సంబంధించి రజత్‌శర్మ మీద ఈ కేసు నమోదైంది. రైతుల ఆందోళన సమయంలో టూల్ కిట్ వ్యవహారానికి సంబంధించి దిశా రవి అనే ఆమె మీద ఈ కేసు నమోదు చేశారు. ఎర్రకోట ముట్టడి వంటివన్నీ ఆ టూల్‌కిట్ మేరకే జరిగాయన్న ఆరోపణ ఉంది. లద్దాఖ్‌కు చెందిన జకీర్‌హుసేన్, నిసార్ అహ్మద్‌ల మీద ఇదే కేసు నమోదు చేశారు. భారతీయ సైన్యాన్ని కించపరుస్తూ ఈ ఇద్దరు జరిపిన సంభాషణ గురించి ఈ కేసు నమోదైంది. అస్సాంకు చెందిన రజీనా పర్వీన్ సుల్తానా అనే ఆమె ఈద్ రోజున కొందరికి విందు ఇచ్చింది. ఆ సమయంలో ఆ భోజనాల టేబుల్ మీద భారత పతాకం పరిచింది. ఇందుకు కేసు నమోదైంది. ఇటీవల ఎక్కువ కేసులు నమోదు చేసిన రాష్ట్రాలు అస్సాం, జార్ఖండ్. పౌరసత్వ సవరణ చట్టం గొడవలలో 3000 మంది మీద, ఢిల్లీలో రైతులు ఆందోళన చేసిన సమయంలో 3,300 మంది ఇదే కేసు నమోదైంది. 2015–2020 మధ్య దేశంలో 124ఎ కింద 356 కేసులు నమోదైనాయి. 548 మందిని అరెస్టు చేశారు. 12 మందికి మాత్రమే శిక్షలు పడినాయి. అసలు ఈ కేసులో శిక్షలు పడినవారు తక్కువ. ఈ దేశాన్ని ముక్కలు చేస్తాం అంటూ 2016లో జేఎన్‌యూ విద్యార్థులు నినాదాలు చేయడం వాస్తవం. దాని గురించి ఆనాటి విద్యార్థి నాయకుడు కన్హయ్యకుమార్ రాజద్రోహం కేసును ఎదుర్కొంటున్నారు.

కాబట్టి ఈ చట్టం దుర్వినియోగం కొంత నిజం.

పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లు మావి. భారతదేశం మనది. విద్యారంగాన్ని మొదటి ఆ 30, 40 సంవత్సరాలు పెద్ద లోపంతో నిర్వహించారు. మనకు వక్రీకరించిన చరిత్రే చెప్పారు. భారతదేశానికి ఒక అస్తిత్వం లేదు అనేదే ఆ చరిత్ర సారాంశం. కేవలం మొగలుల నుంచి, బ్రిటిష్ జాతీయుల నుంచే మనం నేర్చుకున్నామన్న అభిప్రాయాన్ని మన పిల్లలకి నూరి పోసే ప్రక్రియ ప్రబలింది. ఈ మధ్యకాలంలో మన చరిత్ర ఏదో తెలుసుకునే అవకాశం కలుగుతున్నది. మన పూర్వ చరిత్ర గురించి గొప్ప అభిప్రాయం ఏర్పరిచే వాతావరణం వచ్చింది. ప్రశ్నించడం మొదలయింది. ఈ దేశాన్ని ఎందుకు బలహీనపరచాలని అనుకుంటున్నావు అని నిలదీసేసరికి వాళ్లకి బాధ.

**124ఎ రద్దుతో వ్యవస్థ ముందడుగు వేస్తుందా?**

124ఎ బ్రిటిష్ హయాంలో వచ్చింది. తరువాత వచ్చిన స్వతంత్ర ప్రభుత్వాలు ఏం చేశాయి? ఈ నిబంధనను కొనసాగించాయి. మనది ప్రజాస్వామ్యం కదా, ఇక్కడ అందరికి ఒకే రకమైన స్వేచ్ఛ ఉండాలి అంటూ ప్రత్యేకంగా ఆలోచించలేదు. ఇంకా, రాజద్రోహ చట్టం ఉండగానే టాడా అని, మీసా అని, ఉపా అని వచ్చాయి. ఎమర్జెన్సీ (1975)లో ప్రభుత్వం ఎంతదూరం పోయింది? సుప్రీంకోర్టులో అడిగారు. ఎమర్జెన్సీ అమలులో ఉన్నది కాబట్టి, 'ఏ' అనే వ్యక్తిని అరెస్టు చేయవలసి ఉంది అనుకుందాం. 'ఏ' బదులు 'బి'ని పట్టుకొస్తారు. ఆయనకు రక్షణేది? కోర్టుకు పోయే సదుపాయాన్ని సస్పెండ్ చేసి పడేశారు. అప్పుడు అటార్నీ జనరల్ నిరున్‌డే జవాబు చెప్పారు కోర్టులో. రాజ్యాంగం సస్పెండ్ అయ్యింది కాబట్టి, ఒక వ్యక్తిని పొరపాటుగా చంపినా అడిగే వ్యవస్థ లేదు, అని. అప్పుడు ఈ 124ఎ మీద గొంతెత్తిన వాళ్లెవ్వరూ లేరు. ఎంతో కొంత భారత దేశం కోసం పోరాడుతున్న, స్వతంత్రంగా ఆలోచించ గలిగే శక్తి ఉన్న అటల్ బిహారి వాజ్‌పేయి వంటి వాళ్లందరిని లోపల వేశారు. అంతేతప్ప భారతదేశ సమగ్రతను దెబ్బ తీసేవాళ్లను శిక్షించాలి, లేకుంటే వాళ్ల చర్యలను అరికట్టాలన్న తపన ఆనాటి ప్రభుత్వాలకు ఏనాడూ కలగలేదు. ఇప్పుడు భారత భద్రత, మనుగడకు సంబంధించిన పట్టింపు సాధారణ పౌరులలో వచ్చింది.

**భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో ప్రజాస్వామ్యం ముసుగులో ఇదంతా ముందుకు తీసుకువచ్చారు. నిజానికి వీటిలో ఏది కీలకం? దేశం సమగ్రత? భద్రతా? ఎవరి ఇష్టం వచ్చినట్టు వారు భాష్యాలు చెప్పే భావ ప్రకటన స్వేచ్ఛా? భావ ప్రకటనా స్వేచ్ఛకీ, దేశ భద్రతకీ నడుమ ఎలాంటి సమతౌల్యం ఉండాలి?**

ఈ మధ్య భారతదేశాన్ని ముక్కలు చేస్తానని షర్జిల్ ఇమామ్ అనేవాడు బాహాటంగానే ప్రకటించాడు. అలాంటి ప్రకటన చేసినవాడు కాకపోతే ఆ చట్టం కిందకు ఇంకెవడు వస్తాడు? భారతదేశం సంగతి ఒక్కసారి పక్కన పెడదాం. చైనా లాంటి కమ్యూనిస్టు దేశాలైనా, బ్రిటన్ లాంటి ప్రజాస్వామిక దేశాలైనా, అమెరికా వంటి స్వేచ్ఛా సమాజమైనా అలాంటి భాష మాట్లాడితే ఊరుకుంటాయా? ప్రభుత్వం పట్ల, దేశం పట్ల ఇంత వ్యతిరేకతతో వచ్చే ప్రకటనలు దేశ ఉనికికే

కానీ ఆ చట్టం కింద తీవ్రమైన కేసులు నమోదవుతున్న సంగతి ఇంకా బలమైన నిజం. 124ఎ ను పునఃపరిశీలించే క్రమంలో దేశ భద్రతను ఫణంగా పెట్టబోమని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పడం చాలామందికి సంతృప్తిని ఇచ్చింది. అలాగే ఇప్పటికే అరెస్టయిన వారి మీద 124ఎ మినహా మిగిలిన చట్టాల మేరకు కేసులు నమోదై ఉంటే కోర్టులు విచారణను కొనసాగించ వచ్చునంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశం కూడా సాంత్వనను ఇస్తుంది. చిత్రంగా 124ఎ గురించి పునరాలోచించాలన్న ప్రతిపాదన వచ్చిన మరుక్షణమే అన్ లా ఫుల్ యాక్టివిటీస్ చట్టాన్ని (యూఏపీఏ)ను కూడా సమీక్షించాలంటూ ప్రతిపాదనలు వస్తున్నాయి. అందుకే దేశ రక్షణ, పౌర హక్కులకు మధ్య సమతౌల్యం అనివార్యమని కూడా అత్యున్నత న్యాయస్థానం 124ఎ మీద స్టే విధిస్తూ చెప్పింది. ప్రస్తుతం అమలులో ఉన్న ఒక చట్టం మీద న్యాయ వ్యవస్థలు వెనక్కి తగ్గాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించడం ఇదే మొదటిసారి అన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతున్నది. ఒక చట్టం దుర్వినియోగం అవుతున్నదంటూ వచ్చిన వ్యాజ్యాన్ని విచారిస్తూ అత్యున్నత న్యాయస్థానం న్యాయ వ్యవస్థను నిలువరించడం విశేషం. ఈ సందర్భంలో కర్తార్‌సింగ్ కేసును గుర్తు చేసుకోవాలి. ఉగ్రవాద వ్యతిరేక చట్టం టాడాకు ఉన్న రాజ్యాంగబద్ధత గురించి 1994లో వివాదం వచ్చినప్పుడు, అలాంటి ఒక వివాదం వచ్చింది కాబట్టి ఆ చట్టాన్ని నిలిపివేయాలని ఆదేశాలు ఇవ్వలేదు. తరువాత ఆ చట్టం వినియోగం సబబేనని కూడా సుప్రీంకోర్టు చెప్పవలసి వచ్చింది. ఒక చట్టం దుర్వినియోగం అవుతున్నది కాబట్టి దానికి రాజ్యాంగబద్ధత లేదని చెప్పడం సాధ్యం కాదని 2003లో పీయూసీఎల్ వర్సెస్ కేంద్రం కేసులో సుప్రీంకోర్టు తీర్పును ఇచ్చింది.

కాబట్టి ఉగ్రవాదం, నక్సలిజం, ఇతర తీవ్ర నేరాలతో జాతీయ దర్యాప్తు సంస్థ (నియా) ద్వారా అరెస్టయిన వారిని ఈ పేరుతో ఇప్పుడు వదిలిపెట్టే అవకాశం దాదాపు లేదు. నిజానికి వీళ్ల మీద రాజద్రోహం కేసు కాకుండా యూఏపీఏ, ఆయుధాలు, పేలుడు సామగ్రి కలిగి ఉండడం వల్ల కేసులు నమోదు చేశారు.

ఒక పార్టీ తరఫునో, ఒక దేశం తరఫునో, కేంద్రంలో ఉన్న ప్రభుత్వాన్ని కూల్చడమే ధ్యేయంగానో ప్రభుత్వం మీద, దేశం మీద అవాంఛనీయ వ్యాఖ్యలు చేస్తే పరిష్కారం ఏమిటి? కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత చాలామంది మతం ప్రాతిపదికగా చేసుకుని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. ఇక్కడ మైనారిటీలకు రక్షణ లేదన్నది అందులో ఒకటి. రామజన్మ భూమి వివాదంలో తీర్పు రామునికి అనుకూలంగా వస్తే, దానిని అంగీకరించడం లేదని చెప్పిన ముస్లిం మతోన్మాదులు ఎందరో ఉన్నారు. ఈ దేశాన్ని మళ్లీ చీలుస్తామంటూ మాట్లాడినవారు ఉన్నారు. మోదీనీ, యోగినీ, అమిత్‌షాను చంపుతామని చెబుతున్న వాళ్లు ఉన్నారు. పంజాబ్‌లో ఖలిస్తాన్ నినాదాలు వినిపిస్తున్నాయి.

1980ల నాటి ఖలిస్తాన్ ఆందోళనల చరిత్ర తెలిసిన వారికి అవి ఆందోళన కలిస్తాయి. ప్రజాస్వామ్యాన్ని అడ్డం పెట్టుకుని, భావ ప్రకటనా స్వేచ్ఛను అడ్డం పెట్టుకుని పార్లమెంటు చేసిన ప్రతి చట్టాన్ని వ్యతిరేకించడమే పనిగా పెట్టుకున్న వారిని ఏ చట్టంతో అదుపు చేయాలి? రైతు చట్టాలు కొంతమందికి నచ్చలేదు. అందుకు ఎర్రకోట మీద దాడి చేశారు. ప్రధాని కాన్వాయ్‌ని దేశ సరిహద్దులలో అత్యంత ప్రమాదకర ప్రాంతంలో నిలిపి వేశారు. వీళ్లని ఏమనాలి?

ఒక చట్టం దుర్వినియోగమైనంత మాత్రాన దాని రాజ్యాంగబద్ధతను ప్రశ్నించలేమని సుప్రీంకోర్టు చెప్పింది. ఈ నేపథ్యంలో 124ఎ వినియోగాన్ని కోర్టులు పరిశీలించకపోవడం దురదృష్టకరం. అంటే తాము ఇచ్చిన తీర్పును తామే నిర్లక్ష్యం చేసినట్టే కదా! అయితే 124ఎ చాలా సందర్భాలలో దుర్వినియోగమైన సంగతి వాస్తవమే. కానీ ఈ చట్టం ప్రయోగించేందుకు ప్రత్యేకంగా ఒక ఉన్నతస్థాయి ఉద్యోగిని నియమించాలని ఉత్తరప్రదేశ్ మాజీ డీజీపీ ఓపీ సింగ్ అంటున్నారు. ఏమైనా 124ఎ స్థానంలో కొత్త చట్టం రావడం ఖాయమైంది. అది ఎలా ఉండాలి? ఈ దేశభద్రత దాని మొదటి లక్ష్యమై ఉండాలి. సైలెంట్ మెజారిటీని ఆసరా చేసుకుని భారతీయ వ్యవస్థను శాసించాలని చూసేవారిని అది అదుపు చేయాలి. దేశ విభజన కుట్రలను తక్షణం ఛేదించి శిక్షించేదిగా ఉండాలి. ఈ దేశ సమైక్యతకు చేటు చేసేవారిని ఆలస్యం లేకుండా శిక్షించే విధంగా ఉండాలి. మానవహక్కులకు పరిధులు ఉండాలి. దేశాన్ని నాశనం చేసేటంత వాక్ స్వాతంత్ర్యం ఎవరి కోసం? ఎందుకోసం? ఇకనైనా హక్కులకూ, దేశ రక్షణకూ మధ్య సమతౌల్యం సాధించే పని ఆరంభం కావాలి. ★

---

ప్రమాదమని ఎవరైనా భావిస్తారు.

ఇక భావ ప్రకటన స్వేచ్ఛ అనేది ఎప్పుడూ కొన్ని కట్టుబాట్లకూ, షరతులకూ లోబడే ఉంటుంది. నీ స్వేచ్ఛ ఎంతవరకు? దేశ సమగ్రతకు భంగం తేనంత వరకు. కానీ స్వేచ్ఛ పేరుతో మిగిలిన వారిని అల్లరి పాలు చేయడం, వ్యవస్థలను నాశనం చేయడం కొత్తకాదు. స్వేచ్ఛ అనేది ఎప్పుడు ఎక్కడా హద్దులు లేకుండా ఉండదు. నువ్వు రోడ్ మీద వెళ్తుంటావు. స్వేచ్ఛ ఉందని రైట్, లెఫ్ట్ పాటించనంటే ఎన్ని ఆక్సిడెంట్లు కావాలి? ఒక పద్ధతి పాటిస్తేనే సాఫీగా జరిగిపోతుంది. అదే స్వేచ్ఛకి భంగమని భాష్యం చెబితే, ఎవరూ సమర్థించరు. అది స్వేచ్ఛ కాదు.

**సుప్రీంకోర్టు లాయర్ కె.టి.ఎస్. తులసి ఓసారి అన్నారు. దేశాన్ని తిట్టడం, దేశం విడిపోవాలనడం రాజద్రోహం కాదన్నారు. హింసాత్మక చర్య ఉంటేనే అది రాజద్రోహం అన్నారు. దేశాన్ని తిట్టడం, ప్రభుత్వం మీద ద్వేషం పుట్టించడం హింసకు బీజం వేసేవే కదా!**

అలాంటివి బాధ్యతరాహిత్యమైన ప్రకటనలే అనాలి. ఒక వ్యవస్థని విమర్శించవచ్చు. ఆ హక్కు ఉంది. విమర్శ లేకపోతే అసలు వ్యవస్థే నడవదు, ప్రజాస్వామ్యంలో. కానీ వ్యవస్థలో కొన్ని అవాంఛ



నీయ పర్యవసనాలు జరుగుతుంటాయి. వాటి గురించి గళమెత్తే బాధ్యత అందరిది. ఉదాహరణకి– ఫలానా సుంకం విధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వపరంగా అది సమంజసమే కావచ్చు. కాని దానివల్ల ప్రజలకు కలిగే ఇబ్బంది మాటేమిటి? దాని పర్యవసనాలు ఏమిటి? వీటిని ఎత్తి చూపే బాధ్యత, హక్కు ప్రజలకి ఉంది.

విచిత్రమేమిటంటే ఇవాళ 124ఎకు వ్యతిరేకంగా వాదిస్తున్నవారంతా ఆనాటి ప్రభుత్వాలు దీనికంటే కఠినమైన చట్టాలు వచ్చినప్పుడు ఏం చేశారు? అన్‌లా ఫుల్ ఆక్టివిటిస్ అండ్ ప్రివెన్షన్ యాక్ట్ (యూఏపీఏ) ఉన్నది. తరువాత ఇందాక చెప్పిన టాడా (టెర్రరిస్టు అండ్ డిజరెప్టివ్ యాక్టివిటీస్ (ప్రివెన్షన్) యాక్ట్) తీసుకొచ్చారు. ఎమర్జెన్సీలో మీసా (మెయింటినెన్స్ ఇంటర్నల్ సెక్యూరిటీ యాక్ట్) ప్రయోగించారు. ఇవన్నీ 124ఎ కన్నా కఠినమైనవి. 124ఎలో అయినా ట్రయల్ కండక్ట్ చెయ్యాలి. తర్వాత సాక్ష్యాలు అన్నింటిని పెట్టి, చేసిన నేరం

రాజద్రోహం కింద వస్తే శిక్ష పడుతుంది. మిగిలిన వాటిలో ట్రయల్ అక్కర్లేదు. మీరు ఇంట్లో ఉన్నా పట్టుకుపోవచ్చు. ఈ చట్టాలని కొందరు సవాలు చేశారు. కొన్ని కొన్ని కాలగర్భంలో కలిసిపోయాయి. కొన్నిటిని గవర్నమెంట్ రద్దు చేసింది. కొన్నింటి మీద కోర్టులే ప్రతికూల వ్యాఖ్యలు చేశాయి. 498 ఏ అని భారత శిక్షాస్మృతిలో ఉంది. వరకట్న వేధింపులకు సంబంధించింది. దీనిని దుర్వినియోగం చేస్తున్నారని సుప్రీంకోర్టే చెప్పింది. ఏదో సంస్థ ఒక చట్టం దుర్వినియోగమవుతున్నదని అభిప్రాయపడినంత మాత్రాన దానిని రద్దు చేయరు. దుర్వినియోగం పేరుతోనే ఒక చట్టాన్ని రద్దు చేయలేం. చట్టమే కాదు, ఒక వస్తువు, ఒక వ్యవస్థ దుర్వినియోగం అయినంత మాత్రాన రద్దు చేయలేరు. అది దుర్వినియోగం కాకుండా చూడాలి.

### కేదార్‌నాథ్ కేసు ఏమిటి?

1961లో 124ఎను సవాలు చేశారు. కేదార్ నాథ్ కేసు అదే. 124ఎతో భావ ప్రకటనా స్వేచ్ఛకు ఇది భంగమని వాదించారు. అయినా సుప్రీంకోర్టు దానిని రాజ్యాంగబద్ధ సెక్షన్‌గానే పరిగణించింది. 19(2) భావ ప్రకటనా స్వేచ్ఛకు పూచీ, హామీ ఇస్తున్నదని చెప్పింది. టాడాను 1993లో పి.యు.సి.ఎల్. (పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్) సవాలు చేసింది. ఆ చట్టం దుర్వినియోగమవుతున్నదనే ఆ సంస్థ ఆరోపణ. రాజ్యాంగ విరుద్ధం



కానంతవరకు అది చట్టబద్ధమేనని సుప్రీంకోర్టు చెప్పింది. దేశ రక్షణకు అవసరమైన చట్టాలు చేయాలని పార్లమెంటు భావిస్తుంది. అది రాజ్యాంగం ఇచ్చిన హక్కు. ఆ చట్టం రాజ్యాంగంలోని ఫలానా పరిచ్ఛేదానికి వ్యతిరేకంగా ఉన్నది అని భావిస్తేనే తొలగిస్తారు. అంతే తప్ప మా అభిప్రాయం మేరకు రద్దు చేయాలని కొందరు వత్తిడి చేస్తే సాగదు. చట్టాలు కూడా ప్రజలకు, దేశానికి రక్షణ కోసం ఉండాలి. దేశాన్ని ఇష్టం వచ్చినట్లు తిట్టు, దాన్ని ముక్కలు చేయి, నాశనం చేయి, కించపరుచూ, అవమానించు అన్నది ఏ చట్టం ఒప్పుకోదు.

### ఇప్పుడున్న పరిస్థితుల్లో 124ఎ సెక్షన్ మీద స్టే విధిస్తే ఎలాంటి పరిణామాలు జరుగుతాయని మనం ఊహించవచ్చు?

నిజమే స్టే ఇచ్చారు. ఒక విషయం చెబుతాను. టాడా రాజ్యాంగబద్ధతను సవాలు చేసినప్పుడు కూడా ఇదే ప్రశ్న వచ్చింది. సుప్రీంకోర్టు తుది తీర్పు వెలువరించే వరకు ఆ చట్టం వినియోగం మీద స్టే విధించమని వాళ్లు అడిగారు. అసలు సెటిల్డ్ ప్రిన్సిపుల్ ఆఫ్ లా ఏమిటి? పార్లమెంట్ చేసినదే అయినా, ఒక ప్రొవిజన్ ఆఫ్ లాను సవాలు చేసినప్పుడు, సుప్రీంకోర్టు గానీ, హైకోర్టు గానీ దానిని కొట్టేసేవరకు అది (ప్రొవిజన్) చట్టబద్ధమే. ఈ క్రమాన్ని నిరోధించే వ్యవస్థ ఉండదు. దీనిని నిరాకరించడం సాధ్యం కాదు. కాబట్టి ఇప్పుడు సుప్రీంకోర్టు 124ఎ మీద ఇచ్చిన స్టే గతంలో తానే ఇచ్చిన తీర్పులకు వ్యతిరేకం. సుప్రీంకోర్టులో ఒక అలజడి వంటిది. ఇంతవరకు ఈ విషయంలో పాటిస్తూ వస్తున్న నిబంధనలను ఒక్క దెబ్బతో కొట్టిపారేశారు. మొన్ననే చూశాం కదా! యాసిన్ మాలిక్ అనేవాడి ఒప్పుకోలు. తన మీద చేసిన నేరారోపణలను అతడు తిరస్కరించలేదు. అంటే ఒప్పుకున్నాడు. కానీ ఈ దశలో ఏ అర్బన్ నక్సలైటో వెళ్లి అతడికి శిక్ష విధించగలిగే చట్టాలు దుర్వినియోగమవుతున్నాయనో, సరైనవి కాదనో వాదిస్తే ఎలా ఉంటుంది? ఏమైనా ఈ స్టే వ్యవహారం భవిష్యత్తులో




తీవ్ర చర్చకు దారితీసేదే.

**న్యాయవ్యవస్థ లక్ష్మణరేఖ దాటరాదని కేంద్రం అభిప్రాయపడుతున్నా కూడా 124ఎ విధింపు మీద స్టే ఇచ్చారు. విచారణ ఎదుర్కొంటున్నవాళ్లు కోర్టులను ఆశ్రయించవచ్చునని కూడా అత్యున్నత న్యాయస్థానం అవకాశం ఇచ్చింది.**

ఇది సుప్రీంకోర్టు తన తీర్పును తానే గౌరవించుకోని వింత పరిస్థితి. స్టే వరకు వారు చేసింది తప్పు. అసలు దేశంలో రాజద్రోహ కార్యకలాపాలు కొనసాగాలని కోరుకుంటున్నవాడే స్టే కోరతాడని అంటాన్నేను. ఇది చరిత్రాత్మకం అంటూ, ఇంకా ఘనమైన పరిణామమంటూ కొందరు ఉద్విగ్నంగా మాట్లాడుతూ ఉండవచ్చు. కానీ గతంలో ఇదే సుప్రీంకోర్టు ఏమన్నదో కూలంకషంగా చూడమనండి! అక్కడి దాకా అక్కరలేదు. ఒక జీవోను తీసుకోండి. దాన్ని సవాలు చేస్తే, కోర్టు కొట్టేసే వరకు అది చట్టబద్ధమే. అంటే కోర్టు అది చెల్లుబాటు కాదు అని చెప్పేవరకు ఆ చట్టం ఉనికిలోనే ఉంటుంది. దాని శక్తి దానికి ఉంటుంది. ఈ స్టేతో తీవ్ర పరిణామాలు ఉండవని చెప్పలేం. రేపు ఒక కేసు కింది కోర్టులో విచారణకు వస్తుంది. దాని సంగతి ఏమిటి? ఈ దేశాన్ని సర్వనాశనం చేస్తాం, తుపాకులతో దండెత్తి వస్తాం అంటూ విధ్వంసం సృష్టించినవాడి కేసు అనుకుందాం. మొత్తం రికార్డు ఉంది. మొత్తం సాక్ష్యాలు కూడా ఉన్నాయి. అప్పుడు వాడికి ఏ చట్టం కింద శిక్ష విధిస్తారు? కాబట్టి ఇది చాలా ప్రమాదకర ధోరణి. పర్యవసానాలు, పరిణామాలు అనూహ్యంగా ఉంటాయి. ఇప్పుడు 124ఎ రద్దు ప్రయత్నాలను స్వాగతిస్తున్నవారిలో ఎవరైనా ఈ సెక్షన్ కింద విచారణలో ఉన్నవారిలో అంతా నిర్దోషులేనని చెప్పగలరా? ఇది జనరల్ లిటిగేషన్. దేశం మొత్తానికి వర్తిస్తుంది. కాబట్టి బెయిల్ కావాలనుకున్నవాడు బెయిల్ కోసం దరఖాస్తు చేస్తే, అతడికి ఇస్తారు.

**రాజద్రోహం కింద కేసులు సహజంగా ఉంటాయి అనుకున్నప్పుడు, ఏదో రూపంలో కొందరు దానికి పాల్పడే అవకాశమే ఎక్కువ కాబట్టి, 124ఎ రద్దు/పునఃపరిశీలన అనంతరం రాబోయే చట్టం ఎలా ఉండాలి?**


దుర్వినియోగం కాకుండా ఉండడమే ప్రధానం. ఆ విధంగా కొత్త సెక్షన్ ఉండాలి. ఇప్పుడు ఎలా ఉంది? దుర్వినియోగం చేసేదీ వాళ్లే. దుర్వినియోగ మవుతున్నదంటూ ఫిర్యాదు చేసేదీ వాళ్లే. ఇది మరీ ప్రమాదం. నిన్న కాక మొన్న మహారాష్ట్రలో హనుమాన్ చాలీసా చదువుతాం అన్నందుకే 124ఎ కింద కేసు పెట్టారు. ఆ సెక్షన్ పెట్టిన వాడినే నిజానికి శిక్షించాలి. మందలించాలి. ఇలా ఎందుకు చేశావని నిలదీయాలి. అది చేయకుండా చాలీసా చదువు తామన్న వాళ్ల మీద కేసు పెట్టి లోపల వేయడం ఏమిటి? కాబట్టి ఇప్పటికే కొందరు సూచించారు. పోలీసు సూపరింటెండెంట్ స్థాయి కలిగిన అధికారి పరిశీలన తరువాతే రాజద్రోహం కేసు నమోదు చేయాలి. అలాగే ఒక స్వతంత్ర వ్యవస్థతో ఈ కేసుల నమోదును పర్యవేక్షించే ఏర్పాటు చేయవచ్చు. ఎలాగంటే ప్రివెంటివ్ డిటెన్షన్ చేసినప్పుడు ఆ కేసు మొదట ఒక కమిటీ పరిశీలిస్తుంది. ఆ కమిటీ ఆమోదించాలి. లేదా ఒక నిపుణుల సంఘం ద్వారా నిర్వహించాలి. దుర్వినియోగం కాకుండా ఉండడానికి ఎన్ని జాగ్రత్తలు అవసరమో అన్నీ తీసుకోవాలి.



నిన్న కాక మొన్న మహారాష్ట్రలో హనుమాన్ చాలీసా చదువుతాం అన్నందుకే 124ఎ కింద కేసు పెట్టారు. ఆ సెక్షన్ పెట్టిన వాడినే నిజానికి శిక్షించాలి. మందలించాలి. ఇలా ఎందుకు చేశావని నిలదీయాలి. అది చేయకుండా చాలీసా చదువు తామన్న వాళ్ల మీద కేసు పెట్టి లోపల వేయడం ఏమిటి? కాబట్టి ఇప్పటికే కొందరు సూచించారు. పోలీసు సూపరింటెండెంట్ స్థాయి కలిగిన అధికారి పరిశీలన తరువాతే రాజద్రోహం కేసు నమోదు చేయాలి.

**రాజద్రోహం కేసు, దేశభద్రతల మధ్య సమతౌల్యం చూడాలని సుప్రీంకోర్టు అభిప్రాయ పడుతున్నట్టు వార్తలలో వచ్చింది. రాజద్రోహం సెక్షన్ తొలగిస్తారు అనగానే చాలామందికి వచ్చిన ప్రశ్న- మరి ఈ దేశభద్రత మాటేమిటి? తొమ్మిది దశాబ్దాల పాటు ఎన్నో త్యాగాలు చేస్తే వచ్చిన స్వాతంత్ర్యానికి, సాధించుకున్న రాజకీయ ఏకత్వానికి రక్షణ ఏది అన్నదే. పరిస్థితులు అలాగే ఉన్నాయి. ఈ దేశాన్ని విభజిస్తాం అనేవాళ్లు కొందరు. మత రాజ్యం నినాదాలు మరొకవైపు. పరిష్కారం ఏమిటి?**

ఒక జాతి స్వేచ్ఛ, ఒక దేశ ఐక్యత, సమగ్రత కేవలం చట్టాలతోనే సాధ్యమవుతుందని అనుకో కూడదు. లర్నెడ్‌హ్యాండ్ అని న్యూయార్క్ హైకోర్టు న్యాయమూర్తి. న్యాయశాస్త్ర తత్త్వవేత్తగా పేరుంది. గొప్ప రచయిత కూడా. ఆయన స్పిరిట్ ఆఫ్ లిబర్టీ అని ఒక పుస్తకం రాశాడు. ఈ విషయం గురించి ప్రస్తావించారాయన. ఆ భావన వ్యక్తులలోను, వ్యవస్థలోను కూడా ఉండాలి అన్నారాయన. అప్పుడు మాత్రమే స్వేచ్ఛ అనండి, స్వాతంత్ర్యం అనండి భద్రంగా ఉంటాయి. వీటి గురించి న్యాయ స్థానాలో, చట్టాలో శాసిస్తూ ఉన్నంత మాత్రాన అవి నిలబడవు. దేశ భద్రత అనేది ప్రభుత్వంతో పాటు, ప్రతి పౌరుడు కూడా తన బాధ్యతగా భావించు కోవాలి. ఈ భావనే చట్టాల కంటే దేశానికి ఎక్కువ రక్షణ కల్పిస్తుందం టాడు లర్నెడ్‌హ్యాండ్. చట్టాలు చేసే పని చట్టాలు చేస్తాయి. ప్రజలలో ఈ భావన, ప్రభుత్వానికి ఉండ వలసిన నిబద్ధత కూడా అంతే అవసరం. ★






# రెచ్చిపోతు

**పంజాబ్‌లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధికార మార్పిడి అనంతరం వేర్పాటువాదశక్తులకు ఊతమొచ్చిందా? ఖలిస్తాన్‌వాదులకు కొత్త బలం వచ్చిందా? తమ అనుకూల పార్టీ అధికారంలోకి వచ్చిందన్న భావనతో వేర్పాటువాదులు రెచ్చిపోతున్నారా? తమ ఆగడాలపై కొత్త సర్కారు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుందన్న ధీమా వారిలో కలిగిందా? అన్న ప్రశ్నలకు అవుననే సమాధానం లభిస్తుంది.**

ఇటీవల పంజాబ్‌లో, పొరుగునున్న హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన ఘటనలు చూసిన తరవాత ఈ అభిప్రాయం కలగక మానదు. వేర్పాటువాదశక్తులకు పరోక్షంగా సర్కారు ప్రోత్సాహం లభిస్తుందన్న వాదనకు బలం చేకూరుతుంది. తాజా ఉదంతాలను చూసిన తరవాత ఖలిస్తాన్ శక్తులు తమ కుట్రలను, కుతంత్రాలను మరింత దూకుడుగా అమలు చేస్తున్నారన్న అభిప్రాయం కలుగుతుంది. దేశ విచ్ఛిత్తికి కంకణం కట్టుకున్న అసాంఘిక శక్తులను ఆదిలోనే అంతం చేయకపోతే దేశ సమగ్రతకు, సమైక్యతకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. ఇటువంటి శక్తుల వ్యూహాలు, ఆలోచనలపై అటు సర్కారు, ఇటు జాతీయవాదులు ఒక కన్నేసి ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటీవల జరిగిన మూడు అవాంఛనీయ ఘటనలను పరిశీలిస్తే ఈ అవసరం మరింత ఉందనిపిస్తోంది. మొహాలిలో గ్రనేడ్ దాడి, ధర్మశాలలోని హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ భవనంపై ఖలిస్తాన్ పతకాల ప్రదర్శన, పాటియాలలో రెండు వర్గాల మధ్య ఘర్షణలు వేర్పాటువాదశక్తుల ఆగడాలకు అద్దం పడుతున్నాయి.

మొహాలి.. పంజాబ్–హర్యానా ఉమ్మడి రాజధాని చండీగఢ్‌లోని కీలక ప్రాంతం. మొహాలీ క్రికెట్ స్టేడియం క్రికెట్ అభిమానులకు అత్యంత సుపరిచితం. ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు కొన్ని పని చేస్తున్నాయి. కీలకమైన ఇంటెలిజెన్స్ వింగ్ ప్రధాన కార్యాలయం ఇక్కడే ఉంది. అత్యంత పటిష్టమైన భద్రత మధ్య ఈ కార్యాలయం పనిచేస్తోంది. ఇంతటి కీలక కార్యాలయంపై ఈ నెల రెండోవారంలో అనూహ్యంగా దాడి జరిగింది. భవనంలోని మూడో అంతస్తులోకి చొచ్చుకు వచ్చిన గ్రనేడ్ గోడను తాకింది. కిటికీ రెక్కలు విరిచింది. భవనం పైకప్పు దెబ్బతిన్నది. కార్యాలయం చిందరవందరైంది. ఈ ఘటనతో అందరూ ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. కార్యాలయంపై రాకెట్ చోదక గ్రనేడ్ దాడికి పాల్పడిన ఘటనలో లాంచర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి అనుమానితులను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు చిచ్చు పెట్టేవారిని విడిచిపెట్టబోమని ముఖ్యమంత్రి భగవత్ మాన్‌సింగ్ ప్రకటించారు. నిందితుల పట్ల ఎంతమాత్రం ఉదాసీనంగా వ్యవహరించబోమని, కఠినంగా వ్యవహరిస్తామని ఆయన వెల్లడించారు. ఘటనకు సంబంధించిన కొన్ని ఆధారాలు లభించాయని, త్వరలోనే కేసును ఛేదిస్తామని రాష్ట్ర డీజీపీ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్) వి.కె.భద్రా తెలిపారు. నిందితులపై ఉపా, పేలుడు పదార్థాల చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు డీజీపీ తెలిపారు.

ఏప్రిల్ 29న రాష్ట్రంలో జరిగిన మరో అవాంఛనీయ ఘటన శాంతిభద్రతల పరిస్థితికి దర్పణం పట్టింది. పటియాలలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘటన పోలీసులు కాల్పులు జరిపేవరకూ, కర్ఫ్యూ విధించేంత వరకు వెళ్లింది. రెండు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగడంతో పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. శివసేన (బాల్ ఠాక్రే) వర్గంగా ప్రకటించుకున్న ఓ బృందం ఖలిస్తాన్ వ్యతిరేక మార్చ్ నిర్వహించింది. దీనికి అభ్యంతరం చెబుతూ కొందరు సిక్కులు పోటీగా ర్యాలీ జరిపారు. ఈ క్రమంలో కాళీమాత ఆలయం వద్ద ఎదురుపడిన రెండు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. ఈ ఘటనలో ఓ పోలీసు, మరో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. దీంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపారు. ఏప్రిల్ 29వ తేదీని



హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ గోడలకి ఖలిస్తాన్ జెండాలు

# న్న ఖలిస్తాన్‌వాదులు!

గోపరాజు విశ్వేశ్వరప్రసాద్

ఖలిస్తాన్ వ్యవస్థాపక దినోత్సవంగా గుర్తించాలని కొందరు సిక్కులు పిలుపునివ్వడంతో తామూ పోటీగా ర్యాలీ నిర్వహించినట్లు శివసేన నాయకుడు ఒకరు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు శివసేన (బాల్ ఠాక్రే) పంజాబ్ వర్కింగ్ ప్రెసిడెంట్ హరీశ్ సింగ్లాను అరెస్టు చేశారు. సిక్కుల వైపు నుంచి ఒక్క నాయకుడిని కూడా అదుపులోకి తీసుకోకపోవడం ఇక్కడ గమనించదగ్గ విషయం. ప్రభుత్వ పక్షపాత వైఖరికి ఇంతకు మించి మరో నిదర్శనం అక్కరలేదు. ఇక ప్రభుత్వపరంగా చూసినట్లయితే ఈ ఘటనపై ఆమ్ ఆద్మీ పార్టీ పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సింగ్ స్పందన అత్యంత పేలవంగా ఉంది. ఆయన ఎక్కడా దీనిని ఖండించలేదు. ఘటన దురదృష్ట కరమని. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు ట్వీట్ చేయడం తప్ప ఖండించడానికి ఆయన నోట మాట రాలేదు. ఆప్ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ స్పందన పొడిపొడిగా ఉంది. ఘర్షణకు సంబంధించి ఇతర విషయాలను పక్కన పెడితే ఖలిస్తాన్ శక్తుల ఆగడాలను, బీభత్సాన్ని పదునైన మాటలతో ఖండించ లేకపోయారు.


హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన మరో ఘటన వేర్పాటువాదశక్తులు ఎంతగా పెట్రేగిపోతున్నాయన దానికి నిలువెత్తు నిదర్శనం. ఏకంగా ధర్మశాలలోని అసెంబ్లీ భవనాన్నే దుండగులు లక్ష్యంగా ఎంచుకున్నారు. ఈ నెల రెండోవారంలో అసెంబ్లీ ప్రధాన గేటు, ప్రహరీపై వేర్పాటువాదశక్తులు ఖలిస్తాన్ జెండాలు ఎగురవేశాయి. ఖలిస్తాన్ అనుకూల నినాదాలు రాశాయి. హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లా నగరంతో పాటు ధర్మశాలలో అసెంబ్లీ శీతాకాల సమావేశాలు జరుగుతుంటాయి. సిమ్లాలో విపరీతమైన చలి కారణంగా శీతాకాల సమావేశాలు ఇక్కడ నిర్వహించేందుకు అసెంబ్లీ భవనాన్ని నిర్మించారు. ఆ మేరకు 2005 నుంచి సమావేశాలు జరుగుతున్నాయి. హిమాచల్ ప్రదేశ్ శాంతికాముక రాష్ట్రం. ప్రశాంతతకు నిలయం. వివిధ వర్గాల ప్రజలు పరస్పర సామరస్యంతో మెలగుతుంటారు. రాష్ట్రంలో ఎప్పుడూ శాంతిభద్రతలకు భంగం వాటిల్లలేదు. ధర్మశాలలో ప్రవాస టిబెట్ ప్రభుత్వం నడుస్తోంది. టిబెట్ బౌద్ధ నాయకుడు దలైలామా ఇక్కడే నివాసం ఉంటారు. ఇంతటి ప్రశాంత నగరంలో జరిగిన ఈ ఘటన ఆందోళన కలిగించింది. ముఖ్యమంత్రి జైరాం ఠాకూర్ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. దీనిని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. అర్ధరాత్రి గానీ లేదా తెల్లవారుజామున గానీ దుండగులు జెండాలు పెట్టి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. తమకు సమాచారం అందిన వెంటనే వెళ్లి జెండాలను తొలగించామని, నినాదాలను చెరిపేశామని పోలీసులు తెలిపారు. పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ గేటు, ప్రహరీపై జెండాలను ఉంచిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి సుధీర్ శర్మ మాట్లాడుతూ, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిని ఖండించాల్సిన ఆమ్ ఆద్మీ పార్టీ అందుకు బదులుగా భారతీయ జనతా పార్టీపై విమర్శలు గుప్పించడం విచిత్రంగా ఉంది. ఖలిస్తాన్‌వాదం పట్ల ఉదాసీన వైఖరిని ప్రదర్శించడం ఆ పార్టీకి కొత్తేమీ కాదు. ఢిల్లీ, పంజాబ్‌ల్లో ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన తరవాత వేర్పాటువాద శక్తులకు అదనపు బలం వచ్చినట్లయింది. వారి కార్యకలాపాల పట్ల ఆ ప్రభుత్వాలు ఉదాసీన వైఖరి అవలంబించడమే ఇందుకు కారణమని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ధర్మశాల ఘటనపై పోలీసులు చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టంలోని వివిధ



సెక్షన్లతో పాటు, హిమాచల్ ప్రదేశ్ ఓపెన్ ప్లేసెస్ ప్రివెంటింగ్ ఆఫ్ డిస్ట్రబెన్సెస్ యాక్టు-1985 కింద కేసులు నమోదు చేసినట్లు కాంగ్రా జిల్లా పోలీస్ అధికారి ఖుషాల్ శర్మ, ధర్మశాల సబ్ డివిజినల్ మేజిస్ట్రేట్ శిల్పి బీక్తా వెల్లడించారు. దీనిని పంజాబ్‌కు చెందిన కొందరు పర్యాటకుల చర్యగా పోలీసులు అనుమానిస్తున్నారు. సీసీటీవీలు పనిచేయక పోవడం వల్ల దుండగులను పోలీసులు గుర్తించలేకపోయారు. అయితే ఘటనకు సంబంధించి అమెరికాలోని వివాదాస్పద సంస్థ సిఖ్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జె)కు చెందిన గురు పత్వంత్ సింగ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇండియన్ పీనల్ కోడ్‌లోని 153-ఏ, 153-బీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.


గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, ప్రస్తుతం పాలన సాగిస్తున్న ఆప్ పార్టీల నిర్వాకం వల్ల ఖలిస్తాన్ శక్తులు మళ్లీ బుసలు కొడుతున్నాయన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. నిన్న మొన్నటి వరకూ పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన, ముఖ్యమంత్రి పదవి ఆశించి, ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన నవజ్యోత్ సింగ్ సిద్ధూ ఖలిస్తాన్ శక్తులతో ఉదారంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ప్రమాణ స్వీకారానికి ఇస్లామాబాద్ వెళ్లి సైన్యాధిపతి జనరల్ బజ్వాతో రాసుకుపూసుకు తిరిగి, కౌగిలించుకున్న చరిత్ర సిద్ధూది. ఆప్ నేతలూ ఇందుకు భిన్నమైన వారేమీ కారు. వారూ వేర్పాటువాదుల పట్ల అంత కఠినమైన వైఖరి ఏమీ అవలంబించడం లేదన్న సంగతి అందరికీ తెలిసిందే. విధానాలపరంగా, రాజకీయంగా ఎన్ని తేడాలైనా ఉండవచ్చు. పరస్పరం విమర్శలు చేసుకోవచ్చు. విధానాలతో విభేదించవచ్చు. కానీ జాతి సమగ్రత, సమైక్యతల విషయంలో అన్ని పార్టీలు ఒకే మాట మాట్లాడాలి. ఒకే పంథాను అనుసరించాలి. ఒకే గళం వినిపించాలి. లేనట్లయితే ఇలాంటి ఘటనలు మళ్లీ మళ్లీ చోటుచేసుకునే ప్రమాదం ఉంది. ఈ సత్యాన్ని ఆయా పార్టీలు ఎప్పటికి తెలుసుకుంటాయన్నదే అసలు ప్రశ్న.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్





గ్రనేడ్ దాడిలో ధ్వంసమైన మొహాలిలోని ఇంటెలిజెన్స్ కార్యాలయ భవనం



అప్పులపై లెక్కలు చెప్పాలని కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) 5 నెలలుగా అడుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా అప్పులు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు వస్తున్న సంగతి తెలిసిందే. కేంద్ర ఆర్థిక శాఖకు తెలిసి చేస్తున్న అప్పులు కొన్నైతే తెలీకుండా చేసేవి అంతకు మించి ఉన్నాయని ఆర్థిక నిపుణులు ఆరోపిస్తున్నారు. పైగా ప్రభుత్వం చేస్తున్న అప్పులు మూలధన వ్యయానికి చేస్తే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వాటి నుంచి సంపద సృష్టించవచ్చు. కానీ అందుకు విరుద్ధంగా సంక్షేమం పేరు చెప్పి ఓట్ల కొనుగోలు లక్ష్యంతో అప్పు తెచ్చిన నగదును ప్రజలకు పంచేస్తోంది. ఇదే ఇప్పుడు కేంద్రానికి ఆందోళన కలిగిస్తోంది. వైసీపీ ప్రభుత్వ అప్పులు రూ.7 లక్షల కోట్లకు పైగా చేరిన తరుణంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. గత ఏడాది పరిమితికి మించి రుణం తీసుకున్నట్లు ఆరోపణలు రావడంతో అసలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అప్పులెంతో లెక్కగట్టేందుకు కాగ్ ప్రయత్నించింది. ప్రతి ఏడాది ఆయా రాష్ట్రాలకు వచ్చిన ఆదాయాలు, ఖర్చుల వివరాలను కాగ్ పరిశీలించి పార్లమెంటుకు నివేదిస్తుంది. అయితే ఏపీ ప్రభుత్వం మాత్రం ఇంతవరకు తాను తీసుకున్న అప్పుల వివరాలను మాత్రం కాగ్ కార్యాలయానికి పంపలేదు. ఇప్పటికి పదే పదే లేఖలు రాసినా ఫలితం లేదు.

# అప్పులు, గ్యారెంటీల లెక్కలేవీ?

కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న బహిరంగ మార్కెట్ రుణాల వరకే వివరాలను తీసుకుని వాటితోనే లెక్కలు తేలుస్తోంది. కాని వైసీపీ సర్కారు పలు రూపాల్లో అప్పులు సేకరించింది. 33 కార్పొరేషన్లు ఏర్పాటుచేసి వాటి ద్వారా రుణాలు సేకరించింది. ఈ వివరాలు గోప్యంగా ఉంచింది. దాదాపు 33 సంస్థలు రెండు లక్షల కోట్లకుపైగా రుణాలు తీసుకున్నట్లు అందిన సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. ఇందులో అత్యధికంగా రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ రూ.35 వేల కోట్ల వరకు రుణాలు తీసుకున్నట్లు తేలింది. ఇంధన శాఖకు సంబంధించి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ రూ.14 వేల కోట్లు, పవర్ కో-ఆర్డినేషన్ సంస్థ ద్వారా డిస్కామ్‌లు రూ.11 వేల కోట్లు, జెన్‌కో రూ.5 వేల కోట్లు, పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రూ. వెయ్యి కోట్లు రుణంగా తీసుకున్నట్లు సమాచారం. ఇక ఇళ్ల నిర్మాణానికి సంబంధించి టిడ్కో రూ.12 వేల కోట్లు, గృహ నిర్మాణ సంస్థ రూ.4 వేల కోట్లు రుణంగా సమీకరించాయంటున్నారు. రహదారుల అభివృద్ధి సంస్థ, నీటివనరుల అభివృద్ధి సంస్థ, ఆర్‌టీసీ కూడా జాబితాలో ఉన్నాయట. కొత్తగా ఏర్పాటుచేసిన రాష్ట్రాభివృద్ధి సంస్థ రూ.23 వేల కోట్లు, ఫైనాన్షియల్ సర్వీసెస్ కార్పొరేషన్ రూ.10 వేల కోట్లు తీసుకోగా, గ్యారెంటీలు లేకుండా మరికొన్ని సంస్థలు రూ.65 వేల కోట్ల వరకు రుణాలు తీసుకున్నట్లు నిపుణులు అంటున్నారు. మొత్తం రుణంలో కొన్ని సంస్థలు తామే రుణం తీసుకుని, తామే చెల్లించుకుంటున్నది రూ. 50 వేల కోట్ల వరకు ఉంటుంది. వీటిలో చెల్లించినవి పోగా దాదాపు రూ. 1.63 లక్షల కోట్ల అప్పుకు ప్రభుత్వమే జవాబుదారీగా ఉండాలి. అయితే ఈ మొత్తంలో సింహభాగం ప్రభుత్వ అవసరాలకు వివిధ ఖాతాల ద్వారా మళ్లి పోతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇంత భారీ రుణాలపై ఏటా రూ. 15 వేల కోట్ల నుంచి రూ.17 వేల కోట్ల వరకు వాయిదాలు, వడ్డీలు చెల్లించాల్సి వస్తోందని తెలుస్తోంది. ఇది రానున్న రోజుల్లో పెను భారంగానే మారుతుందన్న ఆందోళన వ్యక్త మవుతోంది.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్

**అన్నింటిపై ఆరా..**

సంస్థలు తీసుకునే రుణాలపై ప్రభుత్వం ఇస్తున్న గ్యారెంటీల వివరాలపై కాగ్ ఆరా తీస్తోంది. ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి పంపిన ప్రశ్నావళిలో గ్యారెంటీలకు

సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించింది. ఏ సంస్థకు ఎంత గ్యారెంటీ ఇచ్చారన్న దానితోపాటు ఆ రుణానికి సంస్థలు చేస్తున్న వాయిదాల చెల్లింపులు, గడువు తేదీల వివరాలు కూడా సమర్పించాలని కోరింది. గ్యారెంటీలకు ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వుల కాపీలు కూడా ఇవ్వాలని, ఏవైనా రుణాలను రీషెడ్యూల్ చేశారా అన్నది చెప్పాలని స్పష్టం చేశారు. ఫలానా సంస్థలకు రుణాలకు భారీగా గ్యారెంటీలు ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది, ఫలానా సంస్థలు ఆ రుణాలను ఏ అవసరానికి తీసుకున్నాయన్నది కూడా చెప్పాలని ఏజీ కార్యాలయం కోరినట్లు సమాచారం. గ్యారెంటీల ద్వారా ఆయా సంస్థలు ఏయే బ్యాంకుల నుంచి, ఏయే ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తీసుకున్నాయన్న అంశాలను కూడా ప్రశ్నావళిలో చేర్చారు. ఈ గ్యారెంటీల మొత్తం 2021 మార్చి నెలాఖరుకు, 2022 మార్చి నెలాఖరుకు ఎంత ఉన్నాయన్నది కూడా చెప్పాలని కోరింది. అలాగే ఆయా సంస్థలు తీసుకున్న రుణాలకేనా, ఆ రుణాలపై చెల్లించాల్సిన వడ్డీలకు కూడా గ్యారెంటీ ఇచ్చారా అని ఏజీ కార్యాలయం ఆరా తీస్తోంది. ఒప్పందం మేరకు రుణం తీసుకున్న నాటి నుంచి అసలు ఎంత చెల్లించారు? ఏమైనా గ్యారెంటీల కాలపరిమితి ముగిసిందా? అన్న అంశాలపైనా ప్రశ్నలు వేశారు. ఇక గ్యారెంటీలపై వసూలు చేయాల్సిన కమిషన్ గురించీ అడగడం గమనార్హం.

> సంస్థలు తీసుకునే రుణాలపై ప్రభుత్వం ఇస్తున్న గ్యారెంటీల వివరాలపై అకౌంటెంట్ జనరల్ కార్యాలయం ఆరా తీస్తోంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపిన ప్రశ్నావళిలో గ్యారెంటీలకు సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించింది. ఏ సంస్థకు ఎంత గ్యారెంటీ ఇచ్చారన్న దానితోపాటు ఆ రుణానికి సంస్థలు చేస్తున్న వాయిదాల చెల్లింపులు, గడువు తేదీల వివరాలు కూడా సమర్పించాలని కోరింది.

వసూలు కాని గ్యారెంటీల కమిషన్‌కు గల కారణాలు చెప్పాలని కోరింది. వాటికి సంబంధించిన చలాన్ల వివరాలు కూడా పంపించాలని స్పష్టం చేసింది.

అంతేకాదు, ప్రభుత్వ గ్యారెంటీల ద్వారా రుణాలు తీసుకున్న సంస్థల వార్షిక టర్నోవర్ల వివరాలు కూడా సమర్పించాలని ఏజీ కోరింది. ప్రధానంగా 2019-20, 2020-21 ఆర్థిక సంవత్సరాల వివరాలు కావాలని కోరింది. రుణాలకు సంబంధించి ఆయా సంస్థలకు చేసే బడ్జెట్ కేటాయింపుల్లో పొందుపరిచారా లేదా అన్నది కూడా చెప్పాలని పేర్కొన్నట్లు సమాచారం.

**ఈ ఏడాది అప్పులపై ప్రభావం!**

అనుమతి లేకుండా చేసే రుణాలు ప్రభుత్వ రుణాలుగానే పరిగణించాల్సి ఉంటుంది. కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న రుణాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అప్పుల జాబితాలో కలిపితే రుణ పరిమితి దాటిపోతుంది. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది తీసుకున్న అప్పులు ఎక్కువగా ఉన్నట్లు తేలితే ఈ ఏడాది లభించే రుణ సదుపాయంపై ఆ ప్రభావం పడనుంది. ఈ ఏడాది ఇచ్చే రుణాల మొత్తం నుంచి గత ఏడాది అదనంగా తీసుకున్న రుణాలను తీసివేసి మిగతాది మాత్రమే ఇచ్చే అవకాశం ఉందంటున్నారు. దీనివల్ల సంక్షేమ పథకాలకు చెల్లింపుల కోసం ప్రతి నెలా అప్పుల కోసం ఎదురుచూసే రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక వెసులుబాటు తగ్గుతుంది. ఈ ప్రభుత్వం ఇప్పటి వరకు చేసిన విచ్చలవిడి అప్పులు, గత అప్పులతో కలిపితే రూ.7.76 లక్షల కోట్లకు చేరాయంటున్నారు. ఇది మరో రెండేళ్లు కొనసాగితే రూ.10 లక్షల కోట్లకు చేరిపోతుంది. అదే జరిగితే రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఏర్పడటం ఖాయం. కాని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం చేసే కట్టడితో రాష్ట్రానికి రక్షణ రేఖ ఏర్పడవచ్చు. ★



# ‘ప్రభావతీ’యం

**మే 27**
**నిర్మల ప్రభావతి**
**వర్ధంతి**



పవని నిర్మల ప్రభావతి. ఈ రచయిత్రి పేరు మునుపే విన్నట్లుంది కదూ! కథల, నవలల రచనల్లో అలనాటి మేటి. ‘స్త్రీ మండోదరి మళ్లీ పుట్టింది, శిథిలాల నుంచి శిఖరాలకో’... ఇటువంటి వైవిధ్య శీర్షికల ఆమెవే. ఎనభై రెండేళ్ల జీవితకాలంలో ఎన్నెన్నో రాసి, ఎంతెంతో ఆలోచింపజేశారు. ప్రత్యేకించి వనితల మనస్తత్వ చిత్రీకరణలో నేర్పరి. ఆద్యంతాల మధ్య, అమ్మా! యువమాసం, శివదూతీ సప్తశతి, నాగరికత నవ్వుతోంది పేరిట రాసినవి అప్పట్లో చదువరుల అపార ఆదరాన్ని పొందాయి. అటు తర్వాత తత్వచింతనతో ‘భవానీ సౌందర్య లహరి’ అంటూ శక్తి సమన్విత గ్రంథాన్ని వెలువరించారామె. ఒంగోలులో పుట్టి, అదే ప్రాంతం మొగిలిచర్ల గ్రామంలో తుదిశ్వాస విడిచిన ఆమె ఆ మధ్య కాలవ్యవధిలో అనంత సాహితీ సృజన చేశారు. కథాసంపుటాలు, నవలల పరంపర, ఇతర ప్రక్రియల్లోనూ తనదైన ముద్రవేసిన ఆ సహజసిద్ధ రచయిత్రి సమకాలీన సమస్యలకు పరిష్కారాలనూ సూచించడమే ప్రత్యేకత. కాళీపట్నం రామారావు (కారా) మాస్టారు నిర్వహణలోని ‘శ్రీకాకుళం కథానిలయం’ సమీకరించి భద్రపరచిన ఆమె రచనలెె అనేకం. సంస్థ రజతోత్సవ తరుణంలో ప్రభావతి కథలను విశేషంగా ప్రస్తావించిన నిర్వాహకులు – స్త్రీ అంతరంగానికి నిలువుటద్దం పట్టిన కలం ఆమెదని అభివర్ణించారు. విశ్లేషించితే ఉదాహరణలు అసంఖ్యాకం.

'అద్దంలో ప్రతిబింబాలు' కథ ఇప్పటిది కాదు. అది ప్రచురితమై ఇప్పటికి ఆరున్నర దశాబ్దాలు కావస్తోంది. 'నా కథే ఇలా పత్రికలోకెక్కిస్తారని నీవనుకోలేదు' అంటుందీ భార్య. నవ్వూ, ఆశ్చర్యం ముంచుకొచ్చిన ఆ రచయిత 'నీ కథ కాదిది, లోకంలో ఇంకెవరూ లేరా' అంటాడే కానీ, తదుపరి సంఘటనలన్నీ ఇతరులూ అది తమ కథే అనుకొనేలా చేస్తాయి. చివరికి అతను ఆమెను పిలిచి అద్దంలో చూడమంటాడు. 'ఏముందక్కడ.... నా ప్రతిబింబం తప్పిస్తే' అని బదులిస్తుంది. 'అదే మరి– దాన్ని చూసి నువ్వు కోప్పడలేదేం' అని ప్రశ్నిస్తాడు. 'అయితే మేమంతా మీ కథలో మా ప్రతిబింబాన్ని చూసి అపోహ పడ్డామంటారా?' అంటూ ఎదురు ప్రశ్నిస్తుంది. 'అంటే మీ కథ....' అనగానే, 'కేవలం ఓ అద్దం' అన్నదే అతడి సమాధానం! ఈ కథాంశాన్ని అర్థం చేసుకుంటున్నకొద్దీ అటు రచయితలు ,ఇటు చదువరులు ఎంతైనా తెలుసుకొంటారు. వెలువడి 65 ఏళ్లు అవుతున్నా, ఈ నాటికీ కొత్తదనం కనిపించే సంవిధానం ఇది.

**మానవ, మాధవసేవ**

వచనాన్ని ఎంత బాగా పలికిస్తారో గ్రాంథికాన్నీ అంత చక్కగా పండించారు రచయిత్రి ప్రభావతి. 'భాగవతామృత కలశం' పుస్తకమే నిత్య నూతన నిదర్శనం. కథల మాదిరే కావ్యరచననూ అలవోకగా నడిపించిన ఆమె మధుర, మార్దవ, మానసానందకర వచనంలో భాగవత కథలెన్నింటినో పాఠకుల ముందు పెట్టారు. తన గ్రామంలో మాధవసేవకు ఆలయాన్ని, అదే కోవలో మానవసేవకు వైద్యశాలను ప్రారం భించిన క్రియాశీలి. పోతన మహాకవి భాగవతామృ తాన్ని అందరికీ పంచాలన్న సదాశయంతో ముందుకు సాగి జనజాగృతి సాధించిన సారస్వత మూర్తి ఆమె. అదే గ్రంథంలో కుంతీదేవిని పరిణిత భక్తురాలిగా ప్రశంసించారు. ఎంతటి సంయమనమో ఆ హృదయానికి!ఎంతెంత ఆత్మ నిగ్రహమో తనకి! కష్టాల కొలిమిలో కాగి తుదకు పరమాత్మ శ్రీచరణాలకు శరణాగతి అయిన కుంతిది ఇంకెంత పరిణతత్వమోనంటూ విపులీక రించారు. దేవతానేక బ్రాహ్మణ గోగణార్తి హరణా, నిర్వాణ సంధాయకా అని తనకు తానుగా ఆత్మార్పణ చేసుకున్న వైనాన్ని తనదైన తీరున విశ్లేషించారామె.

**జ్ఞాననేత్రం - భక్తి రసామృతం**

ఈ దేశం మనకు ఏమిచ్చిందో భాగవత నేపథ్యంగా తేటతెల్లం చేశారు ప్రభావతి. మన దేశంలో, ప్రపంచంలో ఆధ్యాత్మిక భావజాలం నిక్షిప్త మైంది. మనిషి ఆత్మ ఔన్నత్యం తాలూకు మార్గదర్శ నానికి ఎందరో మహనీయులు మాటలు, రాతలతో కృషి జరిపారు. సర్వలోకానికీ ఈ భారతదేశమే జ్ఞాననేత్రం. దీన్ని నమ్మిన వారికి దేశం మనకే మిచ్చిందన్నది బోధపడుతుంది. ఇక్కడి మట్టి, గాలి, నిప్పు, ఆకాశానికి ఎంత ఋణపడి ఉన్నామో అవగత మవుతుంది. శాస్త్రాలు, కళలన్నింటి పరమార్థమూ దైవదర్శన భాగ్యమే. మనుషులుగా పుట్టిన మనం దేశం మనకిచ్చిన కావ్యాల సారాంశాన్ని కొద్దిగానైనా గ్రహిస్తే అదే మహాద్భుత వరమంటారామె. పోతన మహాకవి ప్రసాదించిన భక్తిగంగలోని కొన్ని నీటి బిందువులను తన దోసిలిలోకి తీసుకునే ప్రయత్నమే ఈ రచన అని వివరించి చెప్పారు.

**భావశక్తితో ఆరాధన**

ఇంతకుముందే మనం అనుకొన్నట్లు, జగన్మాతది అపారమైన దయామహిమ. ఆ అంశాన్నీ సౌందర్యల హరిలో వివరిస్తూ శంకర భగవత్పాదులను స్మరించు కున్నారీ రచయిత్రి. సద్భావనలు, సదాలోచనలు, సదాశయాలు వెల్లి విరుస్తుండగా మార్గదర్శనం జరగాలని ఆకాంక్షించారు. దేవీ వదనాన్ని 'శరత్పూర్ణ చంద్ర ప్రభాపూర్ణ బింబాధర స్మేర వక్త్రారవిందాం సుశాంతం / సురత్నావళీహార తాటంక శోభాం మహాసుప్రసన్నాం భజే శ్రీభవానీం' అని కొనియా డారు. అలాటి ఘనతను 'లలాటం లావణ్య / ద్యుతి విమల మాభాతి తనయత్ ద్వితీయం తన్మన్యే, మకుటఘటితం చన్ద్ర శకలమ్/విపర్యాస న్యాసా దుభయమపి, సమ్భూయచ మిదః సుధాలేప స్యూతిః పరిణమతి ర్యాకా హిమకరః' అంటూ స్తుతించారు అద్దంలా నిగనిగలాడుతున్న తల్లి నుదురుపై కిరీటపు కింది అంచు అర్ధ చంద్రాకృతిలో ఉన్నదని అంతరార్థం.




జంధ్యాల శరత్‌బాబు

**సమస్యలకు సమాధానాలు**

కథలూ నవలలూ రాసిన రచయిత్రిగా పేరున్న ప్రభావతిలో ఇంతటి గ్రాంథికత, ఆలంకారిక రచనాశక్తి ఇమిడి ఉన్నదని అందరూ మరింత గ్రహించాల్సి ఉంటుంది. భాషా సంబంధమైన పదజాలం, ప్రాచీన గ్రంథాల అధ్యయన పటిమ, వీటన్నింటినీ మించిన తత్వచింతనాసక్తి ఆమెను అపురూప కావ్యకర్తగా రూపుదిద్దాయి. ఎదలో ముల్లు, శలభాలు, శాపగ్రస్తులు, రాసినపూలు, శేష ప్రశ్నలు వంటి రచనా శీర్షికలు తన నిశ్చయత్వాన్ని వెల్లడి స్తాయి. భగవాన్! నేనేమీ కోరను, ముగింపేమిటి?, ఈ జీవిత సంధ్యా సమయంలో... వంటివి లోలోపలి తాత్వికతను వ్యక్తపరుస్తాయి. పంజర కోరాలు, శలభాలు, అనామిక రచనలు ఆమె పరిశీలనా శక్తిని ప్రస్ఫుటీకరిస్తాయి. ఇంత నిరంతరంగా, నిరంత రాయంగా వ్యాసంగం సాగించినవారు అరుదుగానే ఉంటుంటారు. మరీ ముఖ్యమైన విషయం – 'చైతన్య రాహిత్యంలో స్త్రీ' అనే నవలికను తీర్చిదిద్దిన విధానం. పలు రకాల స్థితిగతుల ప్రభావం నేడు కొంతమంది వనితలపై ఎలా ప్రసరిస్తుందో సామాజిక కోణంలో విశ్లేషించారామె. కాలం మారింది అంటున్నాం. రోజులు మారాయని చెప్తున్నాం. మరి ఇంత మార్పు వచ్చేస్తే, ఇప్పటికీ ఆ పడతులకు ఎందుకింత దుస్థితి? అన్నదే ప్రశ్న. రచయిత్రిగా తానిచ్చిన లిఖిత సమాధానం ఆమె విమర్శనాత్మక దృక్పథానికి సూచిక. ఇన్ని విధాలుగా కలం బలాన్ని చూపిన పవని నిర్మల ప్రభావతి మనం ఎన్నటికీ మరవలేని,ఎంతకీ మరపురాని అసాధారణ సాహితీవేత్త. ఈ నెల 27వ తేదీన ఆమెను స్మరించుకోవటం రచనా వైవిధ్యాన్ని ప్రశంసించడమే!

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



సుజాత గోపగోని, 6302164068

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ రెండో విడత ప్రజా సంగ్రామ పాదయాత్ర ముగింపు సభ పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం నింపింది. క్షేత్రస్థాయిలో ఆ పార్టీ కార్యకర్తలకు ఓ సంకేతం పంపింది. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ గట్టి పోటీ ఇవ్వగలదన్న నమ్మకాన్ని కలిగించింది.**

# భాజపాలో సరికొత్త ఉత్సాహం



హైదరాబాద్ తుక్కుగూడలో మే 14న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సాగించిన ప్రజా సంగ్రామ యాత్ర రెండో విడత ముగింపు సభ జరిగింది. ఈ సభను పార్టీ అట్టహాసంగా నిర్వహించింది. సభకు అమిత్‌షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీఆర్ఎస్ పాలనపైనా, కేసీఆర్ తీరుపైనా విమర్శల వర్షం కురిపించారు. అంతేకాదు, ఎంఐఎంపైనా తనదైన శైలిలో వాగ్బాణాలు సంధించారు. మజ్లిస్‌కు భయపడే వాళ్లను అధికారం నుంచి దించేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సీఎం కేసీఆర్‌ను గద్దె దించడానికి బండి సంజయ్ ఒక్కడు చాలని అన్నారు. 45 డిగ్రీల ఉష్ణోగ్రతలో భగభగలాడే ఎండలోనూ బండి సంజయ్ 660 కిలోమీటర్ల దూరం పాదయాత్ర చేశారని అమిత్ షా కొనియాడారు. ఇక, టీఆర్ఎస్ లాంటి అవినీతి ప్రభుత్వాన్ని తానెప్పుడూ చూడలేదన్నారు. సంజయ్ పాదయాత్ర రాష్ట్రంలోని రైతులు, ఎస్సీలు, వనవాసీలు, అణగారిన వర్గాల కోసమేనని అన్నారు. హైదరాబాద్ నుంచి నిజాంను పారద్రోలి.. రజాకార్ల పీడనుంచి హైదరాబాద్ గడ్డను విముక్తి చేసి భారత్‌లో విలీనం చేసిన వాళ్లకు శ్రద్ధాంజలి అర్పించాలని, టీఆర్ఎస్‌ను అధికారం నుంచి పెకిలించి వేయాలని పిలుపునిచ్చారు. ఈ ఆశయానికి అందరూ చేతులు కలపాలన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపాన్నారు. అంతేకాదు, రామానంద తీర్థ, సురవరం ప్రతాప రెడ్డి, దాశరథి, పీవీ నరసింహారావుకు కూడా ఈ సందర్భంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నానని అమిత్ షా అన్నారు.

కేసీఆర్ వాగ్దానం చేసిన నీళ్లు – నిధులు – నియామకాలు వచ్చాయా?, దళితులకు మూడెకరాల భూమి వచ్చిందా?, వాగ్దానం చేసినట్లు బీసీలకు ఏటా వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయిస్తున్నారా? అంటూ అమిత్‌షా ప్రశ్నల వర్షం కురిపించారు. హైదరాబాద్‌లో 4 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మిస్తానని చెప్పి.. అవి చేయలేదు సరికదా ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఎంఐఎం, టీఆర్ఎస్ ఇద్దరూ దగ్గరి మిత్రులేనన్న అమిత్‌షా.. టీఆర్ఎస్ స్టీరింగ్ ఒవైసీ చేతిలోనే ఉందని వ్యాఖ్యానించారు. తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధుల గురించి లెక్కలు చెప్పిన అమిత్ షా కేంద్రం రూ. 18 కోట్లు ఇస్తే, హరితహారం పథకాన్ని తమ పథకంగా చెప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**హస్తం పార్టీ ఉక్కిరిబిక్కిరి**

ఓవైపు టీఆర్ఎస్ నేతలపై అంతెత్తున విమర్శలు సాగించిన అమిత్‌షా, బండి సంజయ్.. కాంగ్రెస్ విషయంలో మాత్రం సరికొత్త ప్రణాళిక అనుసరించారు. ఆ పార్టీ విస్మరించిన ప్రజామోద నేతలను స్మరించుకున్నారు. కాంగ్రెస్ పార్టీని ఆత్మపరిశీలనలోకి నెట్టేశారు. తుక్కుగూడ సభలో అమిత్‌షా పీవీకి శ్రద్ధాంజలి ఘటించారు. మరోవైపు, ఆ మరుసటిరోజే జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న బండి సంజయ్.. పీజేఆర్ గొప్ప వ్యక్తి అంటూ ప్రశంసలు కురిపించారు. అమిత్ షా, బండి సంజయ్ ఇద్దరూ పొగిడింది ఒకప్పుడు కాంగ్రెస్‌లో ఓ వెలుగు వెలిగిన వాళ్లనే. వాళ్ల పేర్లను ఉన్నట్టుండి తెరపైకి తీసుకురావడం, ప్రశంసల వర్షం కురిపించడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. హస్తం అంటేనే అంతెత్తున లేచే బీజేపీ.. ఆ పార్టీ నేతలను పొగడటం దేనికి సంకేతం? కాంగ్రెస్ ఖేల్ ఖతం చేసే కార్యక్రమం కమలం పెట్టుకుందా అన్న ప్రచారం జోరుగా నడుస్తోంది. ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీలోనూ, రాజకీయ వర్గాల్లోనూ చర్చకు దారితీసింది. అసలు బీజేపీ నేతలు ఎందుకిలా వ్యూహం మార్చారు? కాంగ్రెస్ నేతలపై ప్రశంసల వెనుక కమలనాథుల ఉద్దేశం ఏంటన్న విషయం ఆసక్తికరంగా మారింది.

బీజేపీ నేతలు వ్యూహాత్మకంగానే కాంగ్రెస్ నేతల పేర్లు ప్రస్తావించారని, శ్రద్ధాంజలి ఘటించారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కాంగ్రెస్ నేతలను పొగడటం ద్వారా వారి వారసత్వాన్ని తమవైపు లాక్కోవడంతో పాటు.. మిగతా బలమైన నేతలను ఆకర్షించడం బీజేపీ స్ట్రాటజీగా భావిస్తున్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్‌ను ఓడించాలంటే ముందు కాంగ్రెస్ పార్టీని బలహీనం చేయాలనే భావనలో బీజేపీ అధిష్ఠానం ఉందని అనుకుంటున్నారు. కాంగ్రెస్ బలహీనం అయితే.. ఆ పార్టీకి చెందిన చాలా మంది నేతలు కమలం గూటికి చేరే అవకాశం ఉంది. నిజానికి కొంత కాలంగా కాంగ్రెస్ సీనియర్లు బీజేపీలో చేరుతారనే ప్రచారం జరుగుతోంది. సభల్లో టీఆర్ఎస్‌ను తీవ్ర స్థాయిలో టార్గెట్ చేస్తున్నా.. అంతర్గతంగా మాత్రం కాంగ్రెస్‌ను బలహీనపరిచే ప్రయత్నాలను బీజేపీ నేతలు చేస్తున్నారని తెలుస్తోంది. అందులో భాగంగానే తెలంగాణలో గతంలో బలమైన నేతలుగా ఉన్న కాంగ్రెస్ నేతల జపం చేస్తున్నారని అంటున్నారు. దివంగత ప్రధాని పీవీకి బలమైన వర్గం ఉంది. ఇక హైదరాబాద్ పరిధిలో పీజేఆర్‌కు లక్షలాది మంది అనుచరులు ఉన్నారు. అందుకే బీజేపీ నేతలు వీళ్లిద్దరి పేర్లను ప్రస్తావించారని అంటున్నారు.

**వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్**

❋ పౌరాణికం ❋



# రావణ గర్వ

*(గత సంచిక తరువాయి)*

ఏదో చెప్పబోతున్న విభీషణుణ్ణి అడ్డుకుని అన్నాడు, రావణుడు “నేను బ్రహ్మని కోరిన అసలు వరం మృత్యువు రాకూడదనే. విరించి అలా వరం తీర్చడం కుదరదన్నప్పుడు ఈ మానవులని వదిలేసి మిగతా వాళ్లచేతుల్లో చావకూడదని కోరుకున్నాను. ఈ గడ్డిపరకలన్నింటినీ ఎప్పటికప్పుడు ఏరి పారేస్తూంటే నాకు మృత్యువనేదే లేదు. వీళ్లని ఏరి పారేయడం కోసం ఆ మధ్య కైలాసం పైకెత్తి శివుణ్ణి మెప్పించాను కదా?” ఆయనిచ్చిన చంద్రహాసంతో విభీషణుడు నమ్మలేనట్టు చూసేడు రావణుడి కేసి. నోరు పెగుల్చుకుని అన్నాడు ‘అన్నా, నువ్వు నిజంగానే అమరుడవని నమ్ముతున్నావా?’

‘ఎందుకా సందేహం?’

‘నువ్వు కైలాసం పైకెత్తినప్పుడు నందీశ్వరుడిచ్చిన శాపం మర్చిపోయావా?’

రాజభవనం కదిలిపోయేలాగ నవ్వేడు రావణుడు తన పేరుని సార్ధకం చేస్తూ. ‘యముణ్ణి జయించిన నేను – ఇంద్రుణ్ణి జయించిన మేఘనాథుడూ, కుంభకర్ణుడూ, నువ్వూ నాకు అండగా ఉండగా – కోతి మూకల మూలంగా చస్తానా? ఎవడో ఒక ఎద్దు మొహంగాడు ఏదో అంటే దాన్ని పట్టుకుని నాకు పిరికిమందు పోయకు విభీషణా!’

“శివ శివా!” చెవులు మూసుకున్నాడు విభీషణుడు. ‘నేను చెపుదామనుకున్న విషయం విను. ఇది చెప్పడం నీ ఆంతరంగికుల్లో ఒకనిగా నా బాధ్యత. యుద్ధం వద్దు అని చెప్పడానికి వచ్చాను ఎందుకంటే నువ్వు ఎంతమందిని ఎన్నిసార్లు అణిచినా మృత్యువు ఏ రూపంలో వస్తుందో ఎవరూ చెప్పలేరు కానీ ఈ పరిస్థితిలో నేను చెప్పేది నీకు నచ్చేటట్టు కనిపించదు, సెలవు.’

‘అన్నా నందీశ్వరుడి శాపం మహత్తరమైంది. సందేహం లేదు. మనుషులు ఎప్పటికప్పుడు బలం పుంజుకుంటున్నారనీ, మనుషుల్లోంచే నీ ప్రాణాంతకుడు పుట్టబోతున్నాడనేది తెలుస్తూనే ఉంది. ఇంతమంది ఉసురు మనకి అనవసరం. కాస్త ఆలోచించి చూడు.’

‘విభీషణా, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండకపోతే ఎలా?’

‘దేనికీ అంత అప్రమత్తంగా ఉండడం?’

‘రాబోయే చావుకి!’

‘అది తప్పించగలవా?’

‘మనుషులందర్నీ నా చెప్పుచేతల్లో పెట్టుకోగల్గితే, తప్పకుండా తప్పించుకోగలను.’

‘ఎంతకాలం తప్పించుకోగలవు? ఎవరూ చంపలేకపోతే వ్యాధి రూపంలోనో, మరోవిధంగానో యముడు కాచుకుని కూర్చునుంటాడు కదా?’

‘యముడా?’ నవ్వేడు రావణుడు, ‘ఆయనకంత ధైర్యం ఉందా? నా చేతిలో ఓడిపోయేక నా కేసి




❋ తాత్వికత ❋

# వివేకం

ఆయన ఒక సంగీత విద్వాంసుడు. వయొలిన్ వాయించాడంటే మండుటెండల్లో కూడా వర్షాలు కురుస్తాయని పేరు. ఆయన ఒకసారి ఒక సర్కస్ చూడటానికి వెళ్లాడు. అక్కడొక సర్కస్ కళాకారుడు వయొలిన్ వాయిస్తుంటే ఒక ఎలుగుబంటి డాన్స్ చేసింది. ప్రేక్షకుల చప్పట్లతో సర్కస్ టెంట్ మార్మోగింది. అది చూసిన మన వయొలిన్ విద్వాంసుడు ‘బాగా తర్ఫీదునిచ్చిన ఎలుగుబంటి మాత్రమే నీ వయొలిన్‌కు తగినట్టు నాట్యం చేయగలదు. కాని నా సంగీతంతో ఎటువంటి జంతువు చేతనైనా నాట్యం చేయించగలను’ అన్నాడు గొప్పగా. ‘అది సాధ్యం కాదు’ అన్నాడు సర్కస్ కళాకారుడు. ఇద్దరికీ మాటా మాటా పెరిగి పోటీకి దారితీసింది. దాంతో వయొలిన్ విద్వాంసుడికి ఎదురుగా ఒక సింహాన్ని పంపాడు సర్కస్ కళాకారుడు. వయొలిన్ నాదాన్ని చిందులేస్తూ ఆడింది సింహం. ఆ తరువాత ఒక చిరుతపులిని పంపాడు. అది కూడా వయొలిన్ సంగీతానికి మైమరచి నాట్యం చేసింది. తరువాత ఒక పెద్దపులి వంతు వచ్చింది. ఏమాత్రం బెదిరిపోకుండా అద్భుతంగా వయొలిన్ వాయించసాగాడు విద్వాంసుడు. అయితే ఆ పులి సంగీతానికి అసలు ఏమీ మైమరచిపోకుండా పంజా విప్పి మన వయొలిన్ విద్వాంసుడి మీదికి దూకబోయింది. బిత్తరపోయిన ప్రేక్షకులు చెల్లాచెదరయ్యారు. మన విద్వాంసుడు కూడా వయొలిన్‌ను కిందపడేసి పరుగుతీసి పులిబారి నుంచి తప్పించుకున్నాడు. సర్కస్ సిబ్బంది తెలివిగా పులిని బోనులో బంధించారు. ప్రాణభయం నుంచి తేరుకున్న సంగీత విద్వాంసుడు సర్కస్ కళాకారుని ముందు తన ఓటమిని అంగీకరిస్తూనే, ఆ పెద్దపులి తన

దోర్బల పూర్ణిమాస్వాతి

# భంగం – 2

చూడగలడా?'

'సరే, నీ ఇష్టం.' విభీషణుడికి ఒక్కసారి ఏదో స్ఫురించినట్లయింది.

'అన్నా, పుట్టిన ప్రతీ జీవి గిట్టక తప్పదనేది బ్రహ్మ వాక్కు. లేకపోతే ఆయన నువ్వడిగినప్పుడు అమరత్వం ఇచ్చి ఉండేవాడు కదా? నేను ఎంతచెప్పినా ఒకటే. నీ మీదకి దండయాత్రకి రాని మనుషుల మీద దాడి చేయడం అనవసరం. మానవమాత్రులు బలం పుంజుకుంటు న్నారంటే వాళ్లనో కంట కనిపెట్టడం మంచిదే కానీ ఇలా వార్త రాగానే ఏదో అత్యవసరం అన్నట్టు వాళ్లని చంపేసి రావడం ఎంతవరకూ సమంజసం? ఇది కూడా దాదాపు ఇష్టం లేని స్త్రీని బలాత్కరించడం వంటిదే.

ఓ వేదవతి శాపం, రంభ ఇచ్చిన శాపం, కామధేనువు బిడ్డడైన నందీశ్వరుడి శాపం, ఇప్పుడు అనరణ్యుడు చెప్పిన వాక్కూ అవన్నీ ఒక్కసారిగా కలబడి మీద పడితే అప్పుడు చేసేదేమీ ఉండదు కదా? నువ్వు జగత్సంహారకుడైన శివుణ్ణి మెప్పించిన పులస్త్య బ్రహ్మ వంశ సంజాతుడివి. ఇంతటి నీచానికి దిగజారవల్సిన అవసరం లేదు. కొద్దిగా ఆలోచించి చూడు.'

'నువ్వెన్ని చెప్పు విభీషణా, నేను ఈ మనుషులని అదుపులో ఉంచవల్సిందే.'

విభీషణుడు చెప్పేది మొదట్లో కాస్త విన్నట్టు అనిపించినా చావు గుర్తొచ్చేసరికి రావణుడు లేచిపోయేడు. విభీషణుడు నిట్టూర్చేడు. ★

సంగీతానికి కట్టుబడకపోవడం తనకెంతో ఆశ్చర్యం కలిగిస్తోందన్నాడు. అందుకు సర్కస్ కళాకారుడు నవ్వుతూ ఇలా అన్నాడు. 'ఆ పెద్దపులి పుట్టినప్పుడే దానికి చెవుల్లేవు. ఈ సంగతి గమనించిన ప్రేక్షకులు పారిపోవడం ప్రారంభించారు. మీరు అది గమనించకుండా వయొలిన్ వాయిస్తూనే ఉన్నారు' అన్నాడు. సంగీత విద్వాంసుడు సిగ్గుతో తలదించుకున్నాడు. ఈ కథను చెప్పిన గురువు తన శిష్యులతో– చదువు, తెలివి, చురుకుదనం మాత్రమే ఉంటే చాలదు. వర్తమానం గురించిన స్పృహ కూడా అవసరం. ఈ వివేకం లేనివారికి ఎన్ని తెలివితేటలున్నా ఏ విధమైన ప్రయోజనమూ ఉండదని గ్రహించాలి అని బోధించాడు. ★





దానిమ్మను సంస్కృతంలో దాడిమి అంటారు. లలితా సహస్రనామాల్లో అమ్మవారికి 'దాడిమికుసుమప్రభ' అనే నామం కనిపిస్తుంది. వినాయకుడికి చేసే పత్రిపూజలో దాడిమి 12వది. ఇది పండ్ల జాతులలో మేలైనది. దానిమ్మ పండ్లను విష్ణుమూర్తికి నివేదిస్తారు. దానిమ్మపూలను శివపూజలో వినియోగిస్తారు. దానిమ్మ పుల్లను కలంగా చెక్కి సిరాలో ముంచి వాడతారు. దానిమ్మ తినడానికి రుచిగా ఉంటుంది. దీనిలో విటమిను ఎ, సి, ఇ, బి5 సమృద్ధిగా ఉంటాయి. దానిమ్మ మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఎర్రగా నిగనిగలాడుతూ కంటికి ఇంపుగా కనిపించే దానిమ్మ గింజలు ఆరోగ్యానికి అనేక విధాలుగా ప్రయోజనం



# ఔషధాల్లో అమ్మ వంటిది దానిమ్మ

కలిగిస్తాయి. పండులోని 'ఇల్లాజిక్ యాసిడ్'ను చర్మంపై రాస్తే సూర్యకిరణల తాలూకు ప్రభావం నుంచి రక్షిస్తుంది. రక్తహీనతను తగ్గించడంలో ఈ పండును మించింది లేదు.

అత్యంత శక్తిమంతమైన యాంటీఆక్సిడెంట్ల సమాహారం దానిమ్మ. ఇవి కణాల విధ్వంసానికి కారణమయ్యే ఫ్రీరాడికల్స్ పని పట్టి వృద్ధాప్యాన్ని దూరం చేస్తాయి. అల్జీమర్స్, వక్షోజ క్యాన్సర్, చర్మ క్యాన్సర్లను అడ్డుకుంటాయి. దానిమ్మ సహజ యాస్పిరిన్. రక్తసరఫరాను తగినంతగా వేగవంతం చేస్తుంది. పావు కప్పు రసం రోజూ తాగితే మీ గుండె ఎంచక్కా భద్రంగా బీరువాలో ఉన్నట్టే. ఎముకల ఆరోగ్యానికి కూడా దానిమ్మ చాలా మంచిది. ఆస్టియో ఆర్థ్రయిటిస్‌తో బాధపడేవారికి మంచి మందు దానిమ్మ పండు, రసం. సంతాన సాఫల్యతను పెంచే శక్తి ఉంది దీనికి.

గర్భస్థశిశువుల ఎదుగుదలకు అత్యవసరమైన ఫోలిక్ యాసిడ్ ఈ పండులో పుష్కలంగా లభిస్తుంది. గర్భిణులు రోజూ ఒక గ్లాసు దానిమ్మ రసం తాగితే మంచిది. దీనివల్ల నెలలు నిండకుండానే ప్రసవం అయ్యే ముప్పు కూడా తప్పుతుందని ఒక అధ్యయనం. వయసు పెరిగే కొద్దీ ఏర్పడే ముడతలను కూడా నివారిస్తుంది దానిమ్మ రసం.

నీళ్లవిరేచనాలతో బాధపడేవారికి మంచి మందు ఇది. ఇందులో ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు నోటి పూతనుంచి ఉపశమనాన్ని కలుగజేస్తాయి. అల్సర్లను నివారిస్తాయి. దంతాల చిగుళ్లను బలపరుస్తాయి. అధిక రక్తపోటుతో బాధపడుతున్నా లేక ట్రైగ్లిసరైడ్స్ 100 దాటి ఉన్నా లేదా గుండెను కాపాడే హెచ్.డి.ఎల్. కొలెస్ట్రాల్ 50 కన్నా తక్కువగా ఉన్నా... వారానికి ఒకసారి గ్లాసు దానిమ్మరసం తాగడం మంచిది.

గుండెజబ్బులున్న వారికీ మేలు చేస్తుంది. మూత్రపిండాల సమస్యలను నివారిస్తుంది. ★


ఈ రోజు యారోజు ఏమిటి– పువ్వుల రోజు
లేలే లేల లేలమ్మారో– ఓలే లేల లేల.......
భూమిదేవికి కట్టిన కోక – ఏమిటి పూలకోక?
భూమిదేవికి కట్టిన కోక– బూరుగుపూలకోక!
ముత్తేలమ్మకు కట్టిక కోక – ముషిణిపూల కోక!
మావెలమ్మకు కట్టిన కోక– మామిడిపూల కోక!
సారునమ్మకు కట్టిన కోక – సిర్లిపూల.....

హఠాత్తుగా ఆకాశమంతా పక్షుల కలకలం. దగ్గరలో ఉన్న చెట్ల మీది పక్షులన్నీ ఒక్కసారిగా ఆకాశంలోకి లేచాయి. ఎదుట కనిపిస్తున్న ఆ ఆకుపచ్చ లోయ నుంచి రంగురంగుల పక్షులు అరుస్తూ గుంపులు గుంపులుగా వచ్చి వాటిని కలిశాయి. తన ప్రమేయం లేకుండానే ఉగ్గిరంగి రామన్న నోటి నుంచి పాట ఆగిపోయింది. బాస్టియన్, కిష్టయ్యల సంగతి కూడా మరచిపోయి నిలబడి చూస్తున్నారంతా.

కర్ణకఠోరమైన శబ్దంతో గుప్పు గుప్పు మంటూ నల్లటి, దట్టమైన పొగను వదిలి పెడుతూ వచ్చింది, ఆ రోడ్డు రోలర్. కొంచెం దూరంగా ఆ పెద్ద పనసచెట్టు కింది నిలబడి ఉన్న కిష్టయ్య చూపించిన చోట నెమ్మదిగా ఆపాడు విలియం. ఎందుకో మరి, ఒక్కసారిగా ఇంజన్ రైజ్ చేశాడు. ఇంజన్ కొసన బండ అంచుతో ముదురు అరటి బోదెలా ఉన్న ఆ నల్లటి పొగ గొట్టం నుంచి భగ్గుమంటూ ఎగ చిమ్మింది పొగ, మరింత ఉద్ధృతంగా. ఆ వెంటనే తెల్లటి ఆవిరి– గొట్టం కిందనే ఉన్న ఇంకో బుడిపె లాంటి భాగం నుంచి. ఆ రెండు శబ్దాలతో ఆ కొండలన్నీ ప్రతిధ్వనించాయి. పనసచెట్టు గుబురు నిండా నల్లటి పొగ ఆకుల మధ్యకు చొరబడింది. గుబురుగా, దళసరిగా ఉండే పనసాకులు కూడా విలవిలలాడుతున్నట్టు వెనక్కి కదిలాయి పొగ దూకుడికి. ఓ ఘాటు వాసన నెమ్మదిగా వ్యాపించింది. ఆకాశంలో పక్షులు మరింత గట్టిగా అరుస్తున్నాయి.

అక్కడికి కొంచెం దూరంగా కూల్చేసిన ఓ చెట్టు కొమ్మకి కట్టేసి ఉన్న ఆ నల్లగుర్రం బెదిరి కళ్లెం నుంచి విడిపించుకోవడానికి గింజుకుంటోంది, అసహనంగా సకిలిస్తూ. అది బాస్టియన్ గుర్రం. రంగేమిటో కూడా అంతుపట్టనీయకుండా ప్రతి ఆకునీ ఆవరిస్తూ, శాఖలను ఒరుసుకుంటూ చిటారుకొమ్మ వైపుకి సాగుతోంది నల్లటి పొగ, దేగవేగం కలిగిన ఏదో చీడలా.

రోడ్డు పని కూలీలు చేష్టలుడిగిపోయారు. తొలిసారి తీసుకు వచ్చారు ఆ రోడ్డు పని కోసం ఆ రోలర్‌ని. ఏప్లింగ్ అండ్ పోర్టర్ కంపెనీ కెంట్ ఇంగ్లండ్ సంస్థ తయారుచేసిన స్టీమ్ రోడ్ రోలర్ అది. దాదాపు పన్నెండు అడుగుల ఎత్తు. ఏనుగులాగే ఉంది. ఇంకో పన్నెండు అడుగుల పొడవు. కుంభస్థలం ఉండేచోటే ఉంది పొగగొట్టం. వెనుక రెండు చక్రాలు మనిషి ఎత్తులో. ముందు నాలుగడుగుల ఎత్తు రోలర్. ఆకుపచ్చ, బూడిద రంగులలో ఉంది మొత్తం రోలర్. విశాఖ మన్యంలో గడచిన నాలుగేళ్లుగా రోడ్డు పనులు సాగుతున్నా





# లంబసింగి రోడ్డు

6

డా॥ గోపరాజు నారాయణరావు

ఈ మధ్యనే ఇరవై వేల రూపాయలు పోసి కొత్తగా కొనిపించారు. స్టీరింగ్ కిందే ఉంది గుండ్రటి మీటర్. దానికి రెండు వైపులా అనుసంధానించి ఉన్నాయి గట్టి రాగి గొట్టాలు, నలుపలకల ఫొటో ఫ్రేమ్‌లా. వెదురు చిగుళ్ల మాదిరిగా ఉన్న మీటలు ఆ గొట్టాలకే అమర్చి ఉన్నాయి. భయపడుతూ భయపడుతూ నిలబడి ఉన్నాడు విలియం చెప్పే మాట కోసం కిష్టయ్య. కొండవాళ్ల పిల్లలు రోలర్ దగ్గరగా వెళ్లి చూస్తున్నారు. మహా వింతలా ఉంది. “ఇంక ఆ బండ రోలరు మనుషులు లాగక్కర్లేదంట!” ఒక కూలీ అంటున్నాడు, పక్కనే ఉన్న మరొక కూలీతో. “మంచి మాట చెప్పావురా! అబ్బబ్బ! గూడలు పడిపోయేవి కదరా, అది లాగితే. అయినా ఇదేంట్రా ఇంతుంది?” అతడే ఆశ్చర్యంగా అన్నాడు. నిజమే, మొన్నటి దాకా ఉపయోగించిన బండలాంటి ఆ రోలర్‌ని పగ్గం పట్టుకుని కొండవాలు మీద లాగుతుంటే నరకం కనిపించేది కూలీలకి. కొండవాలు అది. కొండ చెంప అని కూడా అంటారు. ఎగువకే లాగాలి రోలర్. చాలా వరకు పైకే. గుండెలు అవిసిపోతుండేవి. ఒక్కొక్కసారి వాలు మరీ ఎక్కువైతే, తాడు ఒడిసి పట్టుకుని, పాదాలు నేలకి తాటించి దిగువకి అంగుళం అంగుళం చూసుకుని వదలేవారు. పదడుగులు వేసే సరికే కాళ్లు చచ్చుపడిపోయినట్టు ఉండేది. “మనకి పని తగ్గించి, రోడ్లు ఇంకా తొందరగా ఏస్తారంట!” మరొక కూలీ అన్నాడు. అప్పుడే రోలర్‌కి మించిన కర్ణకఠోర శబ్దంతో అరిచాడు బాస్టియన్. హఠాత్తుగా ఊడిపడ్డాడు. హడలిపోయారు కూలీలు. మరు లిప్తలోనే పని మొదలు పెట్టారు. “ఏంట్రా దాన్ని చూసేది! ఏంటి చూసేది! ఎక్కడ చిన్న సందు దొరుకుద్దా, పని ఎగ్గొడదామా అనే ఎంత సేపూ! దొంగ నాకొడుకులు. ఎవర్ని చూడు, నీతీ జాతీ లేదు! క్షణం కనిపించకపోతే ఇక అంతే.

మీరు చోద్యం చూస్తావుంటే, పనెవడు చేస్తాడ్రా! బయటోళ్లని ఎందుకు పిల్చుకురావటమని నేనాలోచిస్తా ఉంటే, ఇక్కడ ఇదీ ఈళ్ల వరస. రోజులు గడిచిపోతూంటాయి. గజం రోడ్డు కూడా పడదు. మీ మీద జాలి చూపించకూడదురా!” అంటూ భుజం మీదే ఉన్న కొరడా తీసుకుని పరుగున వెళ్లి వాళ్ల మీద ఝుళిపించాడు, కర్కశంగా.

కూలీలంతా భయంతో వణికిపోతూ మళ్లీ వాళ్ల వాళ్ల చేతుల్లో పనిని కొనసాగించారు. అప్పటికే ఇద్దరు ముగ్గురు వీపుల మీద, కాళ్ల మీద వెంటనే తట్లు లేచాయి. బాధను అణుచుకుని, అదేమీ పట్టనట్టే పని చేస్తున్నారు వాళ్లు. అయినా గావుకేకలు ఆపలేదు బాస్టియన్. “అప్పగించింది ఇరవై గొలుసుల దూరం ఐదురోజుల గడువు. రెండు రోజులు అయిపోయాయి.

పదడుగులు పడలేదు రోడ్డు. ఒరేయ్! ఇప్పుడే చెబుతున్నా... పని పూర్తి కాలేదో... కూలీగీలీ దేవుడెరుగు... తోళ్లు తీసేస్తాను చెత్తనాకొడకల్లారా!” ఈ కేకలు విని, వీరంగం చూసి పది నెలల తమ్ముణ్ణి ఎత్తుకుని అక్కడే నిలబడి రోలర్ శబ్దాన్ని వింటూ, దాని పొగని వింతగా చూస్తున్న ఆ నాలుగేళ్ల కొండ వాళ్ల పిల్ల బెదిరిపోయి దూరంగా పారిపోయింది, ఆయాస పడుతూ. దాని వెనుకే మరో నలుగురైదుగురు కొండవాళ్ల పిల్లలు కూడా పరుగెట్టి కొంత దూరం వెళ్లాక ఆయాసంతో చెట్ల వెనక్కి పోయి నిలబడ్డారు, రొప్పుతూ.

“ఏమే! అడవి ముండా! నీకు ఏరే చెప్పాలా బొట్టెట్టి?” బాస్టియన్ కంటే బిగ్గరగా అన్నాడు కిష్టయ్య. కానీ అక్కడ ఏ ఆడది ఖాళీగా నిలబడి కనిపించడం లేదు. బాస్టియన్‌ని చూసి వీరంగం మొదలుపెట్టాడు వాడు. అలా అన్నాడే కానీ, బాస్టియన్‌కి వింతగానే ఉంది. అడుగులో అడుగు వేసుకుంటూ దగ్గరగా వెళ్లాడు. జంతు ప్రదర్శన శాలలో జంతువును చూసినట్టు చూస్తున్నాడు విలియం, బాస్టియన్ కేసి. అప్పటికే రోలర్ మీద నుంచి కిందకి దిగిపోయారు విలియం సహాయకులు. ఫైర్ మ్యాన్ ఒక రాయిని ఎంచుకుని పెట్టుకుంటున్నాడు నేల మీద. రెండోవాడు క్లీనర్, కట్టెల కోసం వెతుకుతున్నాడు అక్కడే. కొండసంత నుంచి వచ్చింది రోలర్. అంటే దౌనూరు. బండల్లా ఉండే రాక్షస బొగ్గును ముక్కలు చేసి, స్టీరింగ్‌కు ముందు ఉన్న రోలర్ కొలిమిలో వేయడం, తరువాత కొన్ని కట్టెలు వేసి వెలిగించడం ఫైర్ మ్యాన్ పని. మళ్లీ అవసరమైతే బొగ్గు వేస్తాడు.

క్లీనర్ గొడ్డలితో ఎండు కట్టెలు చీల్చి ఇస్తాడు. ఈ ఇద్దరూ విశాఖపట్నం వాళ్లే. “రోలర్ నిన్ననే రావాలి కదా!” ఆరా తీస్తున్నట్టు అన్నాడు బాస్టియన్ రోలర్ ముందు భాగాన్ని చూస్తూ. అది తనకి వేసిన ప్రశ్న అన్న సంగతి విలియంకి తెలుసు. అయినా నోరు విప్పకుండా డ్రైవర్ సీటులోనే కూర్చుని ఉన్నాడు, కూలీల వైపు చూస్తూ. రెండు నిమిషాలు ఆగి మళ్లీ అదే ప్రశ్న వేశాడు బాస్టియన్. “ఇది గుర్రమో ఏనుగో కాదు. రోలర్. కొండదారుల్లో రావడానికి సమయం పడుతుంది.” విసురుగా అన్నాడు విలియం. “ఈ రోలర్ వస్తుందని పాత రోలర్ పంపేశాను. మూడు రోజులు ఆలస్యం పని!”



మన్యంలో అడుగు పెట్టినప్పటి నుంచి ఆ డైరీ బుర్రను తొలుస్తూనే ఉంది. నిలవనివ్వడం లేదు. కొంగసింగి గ్రామ మునసబు పంపించిన రెండెడ్ల బండిలో కూర్చున్నారు డాక్టర్ మూర్తి. వాళ్ల ఊళ్లో వైద్య పరీక్షలు జరపాలని స్వయంగా వచ్చి కోరితే తన సిబ్బందితో వెళుతున్నారు. అప్పుడే సంచిలో నుంచి డైరీ తీసి, ఆ పేజీ చదవడం మొదలు పెట్టారు. గూడెం, 4-3-1921 డియర్ మన్యం డైరీ! గూడెం కొండలు ఎంత అద్భుతమో!

అన్నాడు బాస్టియన్. "ఆ సంగతులన్నీ మీ ఇండియన్ ఇంజనీరుతో మాట్లాడుకో. ఆయనకి తెలియద్దా, ఎంత సమయం పడుతుందో?" సంభాషణంతా ఇంగ్లిషులో జరగడం కొంత మేలు. లేకపోతే బాస్టియన్‌ని లెక్క చేయను అన్నట్టు ఉన్న అతడి ధోరణి ఈ కొండవాళ్లకి కూడా తెలిసిపోయేదే. అయినా తాను ఏమన్నాడని! రోలర్ రావలసింది నిన్న అనే కదా! ఎందుకు ఇలా భుగభుగలాడిపోతాడు వీడు అనుకున్నాడు బాస్టియన్. అసలు బాస్టియన్ వైఖరి చూస్తుంటే అసహ్యంగా ఉంది విలియంకి. ఏమిటీ మనిషి? అనిపిస్తోంది. వీడు ఆఫీసరా, మేస్త్రీనా? అని అప్పటికే పదిసార్లు తనని తాను ప్రశ్నించుకున్నాడు. రుసరుసలాడిపోతున్నాడు బాస్టియన్.


అతడికి అర్థంకానిది ఒకటి ఉంది. విలియం రోలర్ డ్రైవరే. కానీ ఇంగ్లిష్ వాడు. బాస్టియన్ డిప్యూటీ తహసీల్దారే. ఇరవై ఏళ్ల నుంచి ఉద్యోగంలో ఉన్నాడు. కానీ అతడు మద్రాసీ. అందుకే విలియంలో ఆ పొగరు. ఏం చేయలేక చుట్టూ చూశాడు. కోపాన్ని దిగమింగుకుందామన్నా సాధ్యం కావడం లేదు. దూరంగా కట్టేసి ఉన్న తన గుర్రం బెదురు తగ్గక ఇంకా కళ్లెం నుంచి విడిపించుకోవాలని గింజుకుంటోంది. ఒక్క అరుపు అరిచాడు. "ఒరేయ్ కిష్టయ్యా!" ఏ మూలన ఉన్నాడో, చటుక్కున ప్రత్యక్షమయ్యాడు కిష్టయ్య. "చూడ్రా! గుర్రానికి నీళ్లు పట్టు. తీసుకెళ్లి కొంచెం దూరంగా కట్టు. బెదిరిపోతందిక్కడ! కళ్లు కనపడట్లేదా?" "చిత్తం దొర! ఇప్పుడే ఏరే చోట కట్టేస్తాను." ఒక్క పరుగున వెళ్లాడు కిష్టయ్య. గుర్రాన్ని అక్కడే వదిలి రెండు గంటల క్రితం గప్పీ దొర బంగ్లాకి వెళ్లాడు బాస్టియన్. అక్కడికే రమ్మన్నాడు డోలా లచ్చిని.

*  *  *

మన్యంలో అడుగు పెట్టినప్పటి నుంచి ఆ డైరీ బుర్రను తొలుస్తూనే ఉంది. నిలవనివ్వడం లేదు. కొంగసింగి గ్రామ మునసబు పంపించిన రెండెడ్ల బండిలో కూర్చున్నారు డాక్టర్ మూర్తి. వాళ్ల ఊళ్లో వైద్య పరీక్షలు జరపాలని స్వయంగా వచ్చి కోరితే తన సిబ్బందితో వెళుతున్నారు. చాలా చక్కగా ఉంది వాతావరణం. అప్పుడే సంచిలో నుంచి డైరీ తీసి, ఆ పేజీ చదవడం మొదలు పెట్టారు. గూడెం, 4-3-1921 డియర్ మన్యం డైరీ! గూడెం కొండలు ఎంత అద్భుతమో! గూడెం అంటే విశాఖ మన్యంలో ఒక ప్రాంతం. ఊరు కాదు. కాకులు దూరని ఇలాంటి కారడవిలో ఇవాళ ఒక బడిని చూశాను. ఆ బడిలో ఒక కొత్త పాఠం కూడా చదువుకున్నాను. పది ఇంటూ పది అడుగుల తాటాకుల పాక. వెదురు తడకలు కట్టారు చుట్టూ. లోపల ఈతాకు చాపలు పరిచి ఉన్నాయి. అయ్యవారు, అంటే ఉపాధ్యాయుడు కూర్చోడానికి చిన్న ముక్కాలి పీట మాత్రం ఉంది. ఏడుగురో ఎనిమిది మందో విద్యార్థులు. ఐదో తరగతి వరకు ఉంది. ఇక్కడి టీచర్ కూడా లక్ష్మయ్యగారు. కూడా అన్నది ఇంటి పేరు. ఆయన ఒక్కరే. నేను చూడలేదు కానీ, ఈ చుట్టు పక్కల ఆయనకి చాలామంచి పేరుంది. పిల్లల్లో తప్ప. పిల్ల లంతా ఆయన తీయించే గుంజీలకి జడిసి పోతున్నారట. ఆయన చెబితేనే నా దగ్గరకి తన మనుమడు రామునాయు డిని తీసుకుని వచ్చాడు సలబు పోతినాయుడు. వయో వృద్ధుడిలా ఉన్నాడు పోతినాయుడు. కుర్రాడికి పన్నెండేళ్లు ఉంటాయి. ఊరు పాకాబు. కడుపులో బల్ల. పొట్ట ఉబ్బి ఉంది. ముఖం పాలిపోయి ఉంది. పోషకాహార లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. నన్ను చూడగానే బిక్కముఖం వేశాడు రామునాయుడు. వాడిని మచ్చిక చేసుకోవడానికి మాటలు మొదలుపెట్టాను. "ఈ బళ్లోనే చదువుతున్నావా రామునాయుడు?" అన్నాను. "ఔను దొర!" అన్నాడు తడబడే మాటతో. "ఐదో తరగతిలోకి వచ్చావా!' "లేదు, ఒకటో తరగతి" మేం ముగ్గురం ఆశ్చర్యపోయాం.

"ఇంకా ఒకటో తరగతేనా? ఎందుకు?" "మా అయ్యోరు రెండో తరగతికి పంపడం లేదు." అన్నాడు రామునాయుడు. పరీక్షించడానికి ఉదరం నొక్కుతూ అడిగాను. "ఏదీ అఆలు చెప్పు వింటాను." "అ.. ఆ.. ఇ.. ఈ.. ఉ....ఊ.... ఋ... ౠ...." అక్కడితో ఆపేశాడు.

నేను ఉదరం నొక్కడం వల్ల ఇబ్బందితో మానేశాడనుకున్నాను. నొక్కడం ఆపేసి అన్నాను, ముఖంలోకి చూస్తూ, "ఆపకు. చెప్పు!" "ఇంకా ఉన్నాయా.....?" చాలా అమాయకంగా అడిగాడు. "అయ్యోరు అవే చెప్పారు." అన్నాడు రామునాయుడు, సిగ్గుపడుతూ. సంవత్సరంలో ఆరు మాసాలు చింతంబలీ, మామిడి టెంకల అంబలీ తాగితే పిల్లలకి వచ్చేది చదువు కాదు. చావు! మనసులోనే అనుకున్నాను. "మాకు చదువు లెందుకంటే, లక్ష్మయ్య అయ్యోరు ఇనడం లేదు బాబు! ఇంటికొచ్చి పిల్లల్ని లాక్కెళ్లిపోతన్నారు" అన్నాడు తాత నాయుడు. "చదువుకుంటే మంచిదే కదయ్యా!" అన్నాన్నేను, ఆయుర్వేదం మందులు ఇస్తూ. "రాము నాయుడు! రోజూ బడికి వెళ్లు. బాగా చదువుకో" అన్నాను భుజం తడుతూ మళ్లీ నేనే. "మా అయ్యోరు గుంజీలు తీయించడం మానేస్తే బడికెల్తాను." తలొంచుకుని అన్నాడు. "గుంజీలు తీస్తే మంచిదే కదరా! చదువు బాగొస్తది." అన్నాడు తాత నాయుడు. మనవడు నాయుడికి ఉక్రోషం వచ్చేసింది. "రోడ్డు పనికాడ ఒక్కరోజు గుంజీలు తీస్తే నెల్రోజులు నెప్పులో అంటా కూకున్నావు. రోజూ గుంజీలు తీస్తే ఎలగుంటది?" "అదేమిటి పోతినాయుడు? కాళ్ల నొప్పులుంటే చెప్పు!" అన్నాను. "చలికాలం ఉంటాయి బాబు! అంతే!" అన్నాడతడు. అతడి కాళ్లు కూడా



పరీక్షిస్తూ నెమ్మదిగా అడిగాను. "ఏం జరిగింది. రోడ్డు పని ఎలా చేయాలో బాస్టియన్ దొర పాఠం చెప్పాడా?" అనడిగాను.

అప్పటికి మనుషులు లాగే రోడ్డు రోలరే ఉండేదట. అది లాగే బృందంలో పదేశారట పోతినాయుడిని. ఒక ఎత్తయిన ప్రదేశం మీద తాడు పట్టుకుని లాగుతుంటే కాళ్లు చచ్చు పడినట్టయి నేల మీద కూలబడిపోయాడట. కిష్టయ్య, అక్కడ మేస్త్రి రామమూర్తి వచ్చారట, కంగారు పడుతూ. "ఏంట్రా కూకుండిపోయావ్!" అన్నాడట రామమూర్తి. "కాళ్లు చచ్చుపడినట్టనిపిస్తంది మేస్త్రీ" అన్నాడట పోతినాయుడు.

అప్పుడే వచ్చిన బాస్టియన్ సంగతి అడిగి, అసలు ఇంత ముసిలి నా కొడుకుని ఎందుకు తెచ్చావని రామమూర్తిని కొట్టినంత పని చేసి, పోతినాయుడిని పంపించెయ్యమని చెప్పాడట. అక్కడ పోతినాయుడు చేసిన తప్పిదం ఒక్కటే– ఆ ముందు రోజు కూలీ అడగడమే.

అందుకే శిక్ష వేశాడు బాస్టియన్. ఆ శిక్షతో కాళ్లు కూడా బలపడి గంతులు కూడా వేయొచ్చునని అరిచాడట. పాతిక గుంజీలు. మధ్యలో ఆపితే వీపు చుర్రుమనిపించమని గుర్రాన్ని తోలే చర్నాకోల ఇచ్చి పక్కనే కిష్టయ్యని నిలబెట్టాడట.

పాతిక గుంజీలు... ఆగకుండా.... 57 ఏళ్ల వయసులో... బక్క ప్రాణికి అదీ శిక్ష .....




* * *

బాధని రోడ్డు పని దగ్గరే వదిలి పెట్టి రాగలగుతున్నారు. కానీ శరీరాన్ని గుంజుతున్న బడలిక వెంటబడి వస్తోంది. గుడిసెల దగ్గరకి వచ్చే సరికి మళ్లీ స్వేచ్ఛా విహంగాలైపోవడం నేర్చుకున్నారు వాళ్లు. ఏదో చెట్టు కొమ్మ మీద నుంచి పక్షి గానం వినిపించినట్టు, ఆ గుడిసెలలో ఎక్కడో ఒక్క చోట నుంచి ఏదో ఒక పాట తటాల్న వినపడుతూ ఉంటుంది. కారణం– అక్కడ బాస్టియన్ ఉండడు.

ఆ నెగడు వెలుగులో ఏదో పసరు పిక్క మీద రాసుకుంటున్నాడు ఉగ్గిరంగి రామన్న. తాజంగి నుంచి నలుగురు మనుషుల్ని రోడ్డు పనికి తీసుకు రావాలని హుకుం జారీచేశాడు బాస్టియన్. ఎవరూ దొరకలేదు. రామన్న, అతడి భార్య మాత్రం వచ్చారు. 'నలుగురిని తీసుకురమ్మంటే మీ ఇద్దరే వస్తారా' అంటూ చేతిలో ఉన్న పచ్చి చెట్టు కొమ్మతో కొట్టాడు బాస్టియన్. కమిలిపోయింది శరీరం. నాలుగు రోజులైనా నెప్పి వదలడం లేదు. దానికే ఆ పసరు పూస్తున్నాడు రామన్న. చలి తన ప్రతాపం చూపిస్తోంది. రాత్రి చలీ, గాందూ (మంచు) ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నట్టు ఉంది. చింత చెట్టు ఆకుల మీద నుంచి అప్పుడప్పుడు మంచు బిందువులు పడుతున్నాయి, నెగళ్లలో.. రాత్రి కాపలా కోసం ఉన్న నలుగురు యువకులు, ఇంకో పదిహేను మంది ఆ పెద్ద నెగడు చుట్టూ కూర్చుని ఉన్నారు. గారంగి లింగాలు గొంగడి కప్పుకుని వచ్చే నిద్ర ఆపుకుంటూ రామన్న చెప్పే కథ కోసం చూస్తున్నాడు. పాపం, లింగేటి మూగయ్య ఒక్కడే రెండు గోనె పట్టాలు ఒకదాని మీద ఒకటి కప్పుకుని మంటకి ఇంకాస్త దగ్గరగా కూర్చున్నాడు. అతడి వయసు యాభయ్ దాటి ఉంటుంది. చూడ్డానికి అరవయ్యేళ్ల మనిషిలా ఉన్నాడు. గూడెం ప్రాంతంలోనే వీరముష్టిపేట గ్రామం నుంచి వచ్చాడు.

*(ఇంకా ఉంది)*


## జాగృతి/స్వర్గీయ ఎం.డి.వై. రామమూర్తి స్మారక నవలల పోటీ



**జాగృతి ఆధ్వర్యంలో ఎం.డి.వై. రామమూర్తి స్మారక 'నవలల పోటీ- 2022'కి రచయితలను ఆహ్వానిస్తున్నాం.**

ప్రథమ బహుమతి రూ. 25,000

ద్వితీయ బహుమతి రూ. 20,000

సూచనలు :

- ఇతివృత్తం భారతీయ జీవన విధానానికి, విలువలకు అద్దం పట్టేదిగా ఉండాలి. సామాజిక, చారిత్రక, పౌరాణిక అంశాలను స్వీకరించవచ్చు.
- నవల 125–150 (ఎ4, 15 పాయింట్) పేజీలకు మించరాదు.
- సాధ్యమైనంతవరకు డీటీపీ చేయించిన రచనలనే పోస్ట్ ద్వారా మాత్రమే పంపాలి. వ్రాతప్రతులైతే చక్కని దస్తూరితో, ఒక్క కొట్టివేత కూడా ఉండరాదు.
- నవల మీద రచయిత పేరు ఉండరాదు. విడిగా హామీపత్రంలో పూర్తి చిరునామా మొబైల్ నంబర్‌తో సహా రాయాలి. రచన తమ సొంతమని, అనువాదం, అనుసరణ కాదని, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని హామీ ఇవ్వాలి.
- ఎంపిక విషయంలో తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదే. ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదు.
- నవలలు పంపవలసిన చిరునామా : **3-4-228/4/1, జాగృతిభవన్, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్- 500027.**

**నవలలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ : 03 జూన్, 2022**

**చరిత్రాత్మకంగా పత్రికలు నిర్వహించవలసి ఉన్న బాధ్యతను అవి నిర్వహించడం లేదని నిర్మొహమాటంగా చెప్పదలుచుకున్నానని చెప్పారు డాక్టర్ కేఐ వరప్రసాదరెడ్డి. నేరాలకు సంబంధించిన వార్తా కథనాలు, వార్తలు పదే పదే ప్రచురించడం వల్ల ప్రజలలో ఉండే సున్నితత్వం నశించిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నింటికి మించి అధికార పక్షం పత్రికలు ఉంటున్నాయి. విపక్షం వైపు మొగ్గే పత్రికలూ ఉన్నాయి. కానీ ప్రజల పక్షం వహిస్తున్న పత్రికలు ఏవీ, ఎక్కడ అని ప్రశ్నిస్తున్నారు డాక్టర్ వరప్రసాదరెడ్డి. మే 8వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన దేవర్షి నారద జయంతి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ వరప్రసాదరెడ్డి నేటి పత్రికా రంగంలోని కొన్ని పోకడల పట్ల తన ఆవేదనను ప్రసంగం ద్వారా వెల్లడించారు. ఆ ప్రసంగానికి ఇది వ్యాసరూపం.**



# వార్తాహారులు కాదు, పత్రికా రచయి

ప్రపంచం నిద్రపోయాక కూడా సమాజ హితం కోసం తన కర్తవ్యాన్ని నిర్వర్తించే యోధుడు జర్నలిస్టు. దుష్ట రాజకీయాల, అవినీతి పారిశ్రామికవేత్తల చీకటి సామ్రాజ్యాల గుట్టును ప్రజల దృష్టికి తెచ్చి, వారి మీద సమాజానికి ఉన్న భ్రమలు వదిలించే సూరీడు జర్నలిస్టు.

అసాంఘిక శక్తులను నిలువరించే ఆయుధాలుగా, సమస్యలనే చీకటికోణాలను ఛేదించే కరదీపికలుగా తన అక్షరాలను మలుస్తాడు పత్రికా రచయిత. నిర్లక్ష్యానికి గురవుతున్నామన్న వేదనలో ఉన్న విద్యార్థిలోకానికీ, నిరాశా నిస్పృహలతో కుంగిపోతున్న రైతన్నలకూ ఆశాజ్యోతుల్లా కనిపించేవారు కూడా జర్నలిస్టులే.

అలాంటి అసాంఘిక శక్తుల గురించీ, రాజకీయ నేరగాళ్ల గురించీ ఇంచుమించు జర్నలిస్టులంతా తమకున్న పరిధిలో ఎంతో కొంత బాగానే అక్షరీకరిస్తున్నారు. కానీ రాజకీయాల విషయంలోనే పచ్చి పోలరైజేషన్ రాజ్యమేలుతున్నది. కొందరు అధికార పక్షం జెండా మోస్తుంటే, మరికొందరు ప్రతిపక్షం జెండాను భుజానికెత్తుకున్నారు. ఇది అత్యంత విచారకరం. ఎందుకంటే – ప్రజాపక్షంగా ఎవరూ లేరు. ఇది నిజం! నిజానికి ప్రజలే, వాళ్ల యోగక్షేమాలే జర్నలిస్టులకు ఎజెండా కావాలి.

ప్రజలకేం కావాలో, వారికి ఏవి ఉపయోగపడతాయో వాటి మీద దృష్టి పెట్టాలని జర్నలిస్టులను అభ్యర్థిస్తున్నాను. రాజకీయాలు, ప్రభుత్వ కార్యకలాపాల మీద మాత్రమే ప్రజల మనుగడ ఆధారపడి ఉండదు. జనజీవనం, దాని భవిష్యత్తు, మనుగడ ప్రధానంగా విద్య, వైద్యం, వాణిజ్యం, పరిశ్రమలు– వీటి చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటాయని నా విశ్వాసం. ఈ దేశానికి మూలాధారమైనది వ్యవసాయం. ఆ రంగం సైతం వ్యాపారంతోనే ముడిపడి ఉంది. గురించి ఏ మహానుభావుడో, మహానుభావులో రాయగా వాటిని దినదినం ప్రచురించి దేశ ప్రజల మనసులను ఉత్తేజపరుస్తున్నారు. అలాంటి వారికి శిరసాభివందనం.

జనాల్ని చైతన్యవంతం చేసి, వారి వ్యక్తిగత భవిష్యత్తునూ, దేశ భవిష్యత్తునూ తీర్చి దిద్దడమనే వాటి పాత్రను దినపత్రికలు సజావుగా పోషించినప్పుడు దేశ ఆర్థిక చిత్రపటం రూపురేఖలు మారిపోతాయి. పత్రికలు వాటి ధర్మాన్ని అవి నిర్వర్తించినప్పుడు ఇది సాధ్యమే కూడా. కేవలం ఆర్థిక, వాణిజ్య అంశాలతోనే వెలువడుతున్న పత్రికలూ ఉన్నాయి. కానీ అవి నిర్వహించే భూమిక దేశంలో చాలా పరిమితం. ఎందుకంటే, సాధారణంగా అందరూ చదవేది మాతృభాషలో వెలువడే దినపత్రికలే! అది కూడా వాణిజ్యం వంటి ప్రత్యేక అంశాలకు పరిమితమైన పత్రికలు కాకుండా, అన్ని విషయాలను

మార్కెట్‌ను అధ్యయనం చేసి సరైన పంటను వేసుకునే ముందుచూపు, పండిన పంటను అమ్ముకోగలిగిన సామర్థ్యం రైతు అలవర్చుకొన్నపుడు రైతు ఆత్మహత్యలుండవు. నిరుద్యోగులు, చిరుద్యోగులు, మాజీ ఉద్యోగులు– ఇలాంటి వారి అందరి చూపూ ఉపాధి కల్పనపై, వ్యాపార అవకాశాలపై ఉండాలని నాయకమ్మన్యులు, పత్రికా సంపాదకులు ముక్తకంఠంతో ఘోషించడం, నినదించడం మనం చూస్తూనే ఉన్నాం, వింటూనే ఉన్నాం. అయితే ఆయా నినాదాలూ, ఘోషలకీ తగినట్టు ఆయా రంగాలపై అవగాహన పెంచే సమాచారం, ప్రస్తుత పరిస్థితులపై జరగవలసిన అధ్యయనం, భవిష్యత్తులో అందే అవకాశాలపై అంచనా, ఇతర రాష్ట్రాలకూ, దేశాలకూ విస్తరించడానికి ఉన్న సాధ్యాసాధ్యాలు... ఇవేవీ సాధారణ ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. మరి మన పత్రికలలో ఏం కనిపిస్తున్నాయి! నేరాలు, ఘోరాలు, మానభంగాలు, తల్లి తల నరికిన కొడుకు, భర్తను హతమార్చిన భార్య, కూతురుని చెరిచిన కన్నతండ్రి– ఇవీ! ఇదా మనం ప్రజలకు అందించవలసిన సమాచారం? ఇలాంటి ధోరణి గురించి సరైన దృష్టితోనే ఆలోచిస్తున్నామా? మనకి కావలసినది నిర్మాణాత్మక కథనాలు మాత్రమే. కానీ ఇందులో కొన్ని మినహాయింపులు లేకపోలేదు.

ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు జరుపుకొంటున్న ప్రస్తుత తరుణంలో, బ్రిటిష్‌వారితో భిన్నమార్గాల్లో ప్రత్యక్ష, పరోక్ష యుద్ధాలు చేసి, అసువులు బాసిన దేశభక్తుల వీరగాథలు, ఉద్యమాల

**జాగృతి డెస్క్**



# తలు కావాలి!

ప్రచురించే పత్రికలనే చదువుకుంటారు.

ఏమైనా, ప్రజల పట్ల, సమాజం పట్ల పత్రికలు నిర్వర్తించవలసి ఉన్నదీ అని చెప్పే చరిత్రాత్మక బాధ్యతను నేటి దినపత్రికలు పూర్తిగా విస్మరించాయని చెప్పడానికి నేను సందేహించను. అవి కేవలం కుళ్లు రాజకీయాలకు, చిల్లర మల్లర స్థానిక వార్తలకు, ఆకర్షణే ధ్యేయంగా ఉండే ఫీచర్లకు పెద్దపీట వేసి, తక్కిన లోతైన అంశాల్ని పక్కకు నెట్టివేశాయి. ఎన్నికల సమయంలో పత్రిక నిండా అభ్యర్థుల, ప్రత్యర్థుల కథనాలెన్ని నింపినా, చివరకు ఓటింగ్ 45 శాతం – 50 శాతం కన్నా ఎందుకు మించడంలేదు? ఎందుకంటే కేవలం రాజకీయాలే పొట్ట నింపవనీ, తమ సమస్యలను పరిష్కరించవనీ ప్రజలకూ తెలుసు.

జిల్లా ఎడిషన్లు చూస్తుంటే ఇంకా బాధ అనిపిస్తున్నది. అసలు ఆయా జిల్లాలలో జరిగే వ్యాపారం, వ్యవసాయం, అందుబాటులో ఉన్న విద్యావకాశాలు, వైద్య సదుపాయాలు సేవామూర్తుల కార్యాచరణల గురించిన కథనాలకు వాటిలో చోటే ఉండడం లేదు. గృహిణి మానభంగానికి గురై ఒక కుటుంబం విచ్ఛిన్నమైతే అదే పతాక శీర్షిక. పది కుటుంబాలకు అన్నం పెట్టే పరిశ్రమను ప్రారంభిస్తే మాత్రం అసలు వార్తే కాదు. ఊరూరా ఉండే రిపోర్టర్లు ఏం చేస్తున్నారు! ఛోటా మోటా రాజకీయ నాయకుల ప్రకటనలు (సాధారణంగా వాళ్ల అధినాయకుడిని కీర్తిస్తూ) సేకరించి ప్రచురిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో లంచగొండితనం గురించి వివరణాత్మకంగా రాస్తారు. అప్పుడపుడు జరిగే ఖాకీల దౌష్ట్యం గురించి విశేషాలు ఉత్కంఠ రేపేటట్టు రాస్తారు.

అసలు వీరు సానుకూల దృక్పథం కలిగించే వార్తలు రాయలేరా? ఆ జిల్లాలో కొత్తగా తెరుస్తున్న వ్యాపార సంస్థలు ఏమిటి? లేదా మూతపడుతున్న వ్యాపార సంస్థలు ఎన్ని? ఇలాంటివేమీ వారి కంటికి కనిపించవా?

ఇవాల్టి పత్రికలలో కనిపించే మరొక వికృత ధోరణి, వీటికి బిజినెస్ అంటే కేవలం షేర్ మార్కెట్. పూర్తి పేజీ లేదా అర పేజీ షేర్ ధరవరలకే కేటాయించడం కనిపిస్తుంది. అందులో రాసే కాలమిస్టుల పని– ఏ కంపెనీ షేర్ కొనాలో సలహా ఇవ్వడం మాత్రమే! కానీ నిజం ఏమిటి? షేర్ మార్కెట్ల వల్ల ఉత్పత్తి పెరగదు. ఉపాధి అవకాశాలూ పెరగవు. మధ్యతరగతికి చెందిన ఇన్వెస్టర్లుకు షేర్ ధర తెలపడం తప్ప, ఏ పరిశ్రమ, ఏ సంస్థ గురించి కూడా లోతైన అవగాహన కలిగించే ప్రయత్నమే చేయడం లేదు. బిజినెస్ కాలమ్‌లలో ఆయా కంపెనీల వార్షిక ఆర్థిక ఫలితాలను వెల్లడించేందుకు ఏర్పాటైన సమావేశంలో ఆ కంపెనీ అందించిన అంకెలనే వార్తలుగా అందిస్తున్నారు.

ఇక, అప్పుడప్పుడు ఏదైనా రంగం గురించి ఓ మాదిరి వ్యాసం కనిపించిందంటే, దాని అర్థం ఆ రంగానికి సంబంధించిన ఓ ప్రముఖ సంస్థ అతి త్వరలో పబ్లిక్ ఇష్యూకు వెళ్తుందని ఊహించుకోవచ్చు. జర్నలిస్టులు ఏ పారిశ్రామికవేత్తనయినా ఇంటర్వ్యూ చేస్తే ఆయన చెప్పినవి తు.చ. తప్పకుండా ప్రచురించండి. కానీ – అక్కడితో మీ కర్తవ్యం అయిపోయిందని అనుకోకూడదు. వారు చెప్పినవి క్రాస్‌చెక్ చేసుకోవాలి. నిజనిర్ధారణ చేసి మీరు పరిశోధించిన నిజ ఫలితాలను వెల్లడిస్తే యిన్వెస్టర్లకు కనువిప్పు కలుగుతుంది. అప్పుడప్పుడు సుదీర్ఘ వ్యాసాలు కూడా కనిపిస్తుంటాయి. కానీ ఆ వ్యాసాలు ఏదో ఇంగ్లిష్ పత్రిక నుండి తీసుకొని యథాతథంగా తర్జుమా చేసినవే కానీ, స్వంతంగా విశ్లేషించి రాసినవి కావు. పత్రికలు, కొందరు జర్నలిస్టులు ప్రతిష్ఠాత్మకంగా చెప్పుకునేది ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం. కానీ అంతటి ఇన్విస్టిగేటివ్ జర్నలిజం అవకాశవాద రాజకీయాలకు, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి కథనాలకి మాత్రమే పరిమితం కావడం శోచనీయం.

మరో బాధాకరమైన విషయం గురించి కూడా జర్నలిస్టుల దృష్టికి తీసుకువస్తున్నాను. అదే, వార్తను వార్తగా రాయడం తగ్గిపోతున్న రోజులివి. వార్తను వ్యాఖ్యలుగా మారుస్తున్నారు. ధర్మాసనం వెలువరించిన తీర్పును కూడా తమ ఊహకు తోచినట్లు వ్యాఖ్యానిస్తున్నారు. ఏది వార్త? ఏది వ్యాఖ్యో తెలియని అయోమయం. మీ విశ్లేషణలకు, వ్యాఖ్యలకు 'సంపాదకీయం' అని ఒక కాలమ్ ఉంది కదా! కానీ అంతా గుర్తించవలసిన వాస్తవం– ఇలాంటి వ్యాఖ్యలూ, విశ్లేషణాలూ, మార్గదర్శనాలూ, జోస్యాలూ పారిశ్రామికరంగానికి వర్తించవు. ఏదైనా ఒక పరిశ్రమ మీద దృష్టి సారించినప్పుడు వాటి గురించి ప్రభుత్వమో సంబంధిత వ్యాపార సంస్థో అందజేసిన గణాంకాలనే పాఠకులకు అందిస్తారు. వాటిని నిశితంగా విశదీకరించడం గానీ వేరే కోణంలో విశ్లేషించడం కానీ జరగడం లేదు. అసలు తమంతట తాము చొరవ తీసుకుని స్వంతంగా విషయ సేకరణ జరిపి, అధ్యయనం చేసి ఒక నిర్ణయానికి జర్నలిస్టులు రావడం లేదు.

ఎంత దురదృష్టమంటే, పన్నులు ఎగ్గొట్టే, కార్మికుల హక్కులు కాలరాసే వ్యాపారస్తుల ఆటలు, బ్యాంకులను ముంచి, రాజకీయ పలుకుబడులును ఉపయోగించి రుణాలు మాఫీ చేయించుకునే బడా బాబుల విన్యాసాలు ఇవాల్టి జర్నలిస్టులకు పట్టడం లేదు. పన్నులు సరిగ్గా చెల్లించి, కార్మికులను భాగస్వాములుగా చేసుకొని వారి ఆర్థిక మూలాలను మెరుగుపరుస్తున్న సంస్థల గురించి, దేశ గౌరవాన్ని, సంపదను పెంచుతున్న, శాస్త్ర, సాంకేతిక పురోభివృద్ధికి కృషి చేస్తున్న పారిశ్రామికవేత్తలను గుర్తించి 'శభాష్' అంటూ ప్రేరణనిచ్చే కథనాలు రాయడానికి జర్నలిస్టులకు మనసు రావడం లేదు. అలా అని వాళ్ల గురించి అసలేమీ రాయడం లేదని అనడం లేదు. అవార్డులు వచ్చినప్పుడు కొంచెం రాస్తారు. లేదా, అరెస్టయినప్పుడు మాత్రమే రాస్తున్నారు. ఇలా రాసేవారిని 'వార్తాహరులు' అనాలే తప్ప పాత్రికేయులని పిలవడం సాధ్యంకాదు. ఇవాళ న్యూస్ ఛానళ్లు వచ్చాయి. నిమిషాల్లో వార్తలు అందిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో పాఠకులు దినపత్రికల నుండి ఎదురుచూసేది నిఖార్సైన వార్తావ్యాఖ్యానాల కోసమే!

జర్నలిజం సామాజిక బాధ్యతే కాదు, దానిని స్వీకరించిన జర్నలిస్టు చైతన్యంతో కూడా ముడిపడి ఉన్న వృత్తి. ఇలాంటి వృత్తిని సరైన పంథాలో నిర్వహించాలంటే జర్నలిస్టులకు ఒక సాధన అవసరం. తర్ఫీదు, శిక్షణ అనివార్యం. పత్రికల యాజమాన్యాలు వాటిని అందించాలి. ఏ విభాగంలోని జర్నలిస్టులకు ఆయా రంగంలోని నిపుణుల చేత ప్రత్యేక శిక్షణ ఇప్పించాలి. అవగాహన, అంచనా సామర్థ్యాలను నిరంతరం అవగాహన చేసుకొనే శక్తిని వారికి సమకూర్చాలి.

మన దేశ పారిశ్రామిక రంగం, భవిష్యత్తులో ఆ రంగం ఎదుర్కొనబోయే పరిణామాలు, ప్రభావాలను అంచనా వేయగలిగే నైపుణ్యం పాత్రికేయులకు అత్యవసరం. గ్యాట్ ఒప్పందం, క్యోటో సమీకరణం వంటి అంతర్జాతీయ అవగాహనా ఒప్పందాలలోని సున్నితమైన అంశాలను సైతం అవగతం చేసుకుని సందర్భానుసారంగా ప్రజలను చైతన్యవంతులను చేయవలసి ఉంటుంది.

ఎజెండా ఇప్పటికే సుదీర్ఘమయింది. ఇది 100 పేజీల ఎలక్షన్ మేనిఫెస్టో మాత్రం కాదు. పత్రికలు ప్రజాపక్షం వహించాలి. ప్రజాహితం కోరాలి. వాస్తవాలు, నిజాయతీతో కూడిన విశ్లేషణల అవసరం ఎంతో చెప్పడానికి ఇవన్నీ కొన్ని సూచనలు. వాటికి పరిష్కారాలు. ఇంతే! సబబుగా ఉన్నాయని అనిపిస్తే ఒక ఔషధంలా తీసుకోండి. సెలవు. ★


మే 25 హనుమజ్జయంతి



కేసరినందనుడు పురాణ పురుషుడుగానే కాకుండా పరిపూర్ణ సాకారమూర్తిగా, ఆదర్శప్రాయుడుగా నిత్య ఆరాధ్యనీయుడు. స్వామి (యజమాని) కార్యం కోసం శక్తియుక్తులు ధారపోయాలని, అహం దరిచేరనీయక సంకల్ప బలం, మనోనిశ్చయం కలిగి నిరంతరం శ్రమించాలన్నది హనుమ సందేశం. లక్ష్యసాధనకు పట్టుదల, శారీరక బలమే చాలదని, సమయాను కూలంగా తగ్గడం, నెగ్గడం, శక్తియుక్తులను ప్రదర్శించాలనేందుకు నిదర్శనంగా నిలిచాడు. నిర్భయత్వం, అమోఘమైన వాక్చాతుర్యం, అపారమైన బుద్ధిబలం, అద్భుత పాండిత్యాలకు గని. ఒక్క మాటలో... వ్యక్తిత్వ వికాస నిపుణుడు. ఎదగాలనుకునేవారు, రామాయణంలో వివిధ సన్నివేశాలలో ఆయన నడతను ఆదర్శంగా తీసుకోవాలని రామకృష్ణ పరమహంస, వివేకానంద లాంటి జిజ్ఞాసువులు హితవు పలికారు.

# వ్యక్తిత్వ వికాస ఖని హనుమ

శ్రీరామావతార కర్తవ్య నిర్వహణలో పాలు పంచుకునేందుకు వైశాఖ మాస కృష్ణ పక్ష దశమి నాడు రుద్రాంశతో హనుమ అవతరించాడని పరాశర సంహిత, ఆయన శిష్ట రక్షకుడు.. దుష్ట శిక్షకుడని నారద పురాణం తెలిపాయి. త్రిపురాసుర సంహార సమయంలో శ్రీహరి తనకు అందించిన సహకారా నికి కృతజ్ఞతగా శివుడే హనుమగా ఆవిర్భవించాడని వానరగీత పేర్కొంది. జీవన పారాయణంగా పేరొం దిన శ్రీమద్రామాయణంలోని హనుమ భూమిక తరతరాలకు స్ఫూర్తి మంత్రం. ఆయన నడత, కార్యదీక్షాదక్షతలు, యుక్తాయుక్త విచక్షణాది గుణా లను వాల్మీకి మౌని అనేక విధాలుగా ఆవిష్కరించారు.



డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

ఆరు కాండలతో విరాజిల్లే శ్రీమద్రామాయణ మహాకావ్యంలో ఐదవ కాండ (సుందరకాండ) ఆంజనేయుడి వీరత్వానికి, సాహస కృత్యాలకు, భక్తి వైభవాలకు నెలవు. సీతామాత జాడను తెలుసు కోవడం నుంచి రామచంద్రమూర్తికి అమ్మవారి ఆచూకి తెలియచేయడం వరకు ఎదురైన ఇబ్బందు లను అధిగమించి స్వామి కార్యం నిర్వహించడంలో ఆయన చూపిన అంకితభావం, ధర్మనిరతి వ్యక్తమవు తుంది. ఈ కాండకు హనుమ సౌందర్యత్వాన్ని ఆపాదించాడు. సూర్యుని వద్ద వ్యాకరణం నేర్చి నవవ్యాకరణ కర్తగా, సంగీతంలో నారద తుంబు రులతో సరిసాటి అనిపించుకున్న విద్వన్మణిగా, ఇతరుల మనసులోని అంశాలను గ్రహించడంలో దిట్టగా తదితర విశేషాలు సుందరకాండ ద్వారా తెలుస్తాయి.

మహాభారతంలోని భగవద్గీతలా శ్రీమద్రా మాయణంలో 'సుందరకాండ' సుప్రసిద్ధం. ఇది రామాయణానికి తలమానికం. భగవత్ చరిత్ర కన్నా భగవద్భక్త చరిత్ర ఎంతో ఉత్కృష్టమైనదంటారు. అందునా రామభక్తుడైన ఆంజనేయుని విజయ పరాక్రమాలు ఆహ్లాదకరంగా వర్ణితం కావడంతో ఈ 'కాండ' సౌందర్యానికి మారుపేరుగా నిలిచింది' అని ఆధ్యాత్మికవేత్తలు చెబుతారు. మరోవంక, హనుమ పరంగా వెలసిన అపార వాఙ్మయంలో తులసీదాసు విరచిత 'హనుమాన్ చాలీసా' మకుటాయమాన మైనది. దేశవ్యాప్తంగా హిందువులకు పారాయణ గ్రంథమైంది. హనుమను సద్గురువుగా, జానకీదేవి వరం వల్ల ఆయన అష్టసిద్ధులను, నవ నిధులను ప్రసాదించగలడని తులసీదాస్ ఆవిష్కరించారు.

సీతాన్వేషణకు తమ్ముడితో బయలుదేరిన రాముడికి కిష్కింధలో మారువేషంలో అంజనీపుత్రుడు కనిపించగా, 'సోదరా! ఇతడు నవవ్యాకరణాలనూ చదివిన జ్ఞానసంపన్నుడు. సాక్షాత్తూ సరస్వతీ స్వరూ పుడు. సీతాన్వేషణ కార్యాన్ని నెరవేర్చగల సమర్థుడు' అని హనుమలోని విశిష్ట లక్షణాలను వివరించారు. హనుమ తొలిసారిగా తనతో చేసిన సంభాషణను ప్రస్తావిస్తూ, చతుర్వేదాలను అధ్యయనం చేసిన వారికి తప్ప ఇతరులకు ఇంతటి శ్రేష్ఠమైన చతురత అలవడదని (నాన్ ఋగ్వేద వినీతస్య నా యజుర్వేద ధారిణి:/నా సామవే విదుష: శక్యమేవం ప్రభాషితుమ్) ఆయన పాండిత్య గరిమను నిర్ధారించాడు రామ చంద్రుడు.

శ్రీరామ పాదసేవా దురంధరుడు హనుమ. ప్రభుభక్తి పరాయణుడు. నవమ బ్రహ్మ పదవి కంటే

> సీతాన్వేషణకు సముద్రాన్ని దాటుతున్నప్పుడు సాగరగర్భం నుంచి పైకి వచ్చి మైనాకుడు (స్వర్ణమయ పర్వతం) ఇవ్వజూపిన ఆతిథ్యాన్ని మృదువుగా తిరస్కరించి (‘నేను విశ్రమించేందుకు ఇది సమయం కాదు. శ్రీరామ కార్యమే ప్రథమ కర్తవ్యం) ముందుకు సాగిన అంకితభావం గల సేవకుడు. సీతామాత ఆచూకీ తీయలేకపోతే ఆత్మహత్యే శరణ్యమని భావించి, అంతలోనే మనోబలంతో తనకు తానే ధైర్యం చెప్పుకుని పట్టుదలతో ప్రయత్నాన్ని కొనసాగించి సాధించాడు.

‘రామబంటు’గా ఉండేందుకే ఇష్టపడే పరమ భాగవతోత్తముడు. ‘యత్రయత్ర రఘునాథ కీర్తనమ్/ తత్రతత్ర కృతమస్తకాంజలిమ్’–రామనామం వినిపించినచోటల్లా వినయాంజలితో నిలుచుండి పోతారట. ‘జై శ్రీరామ్’ అనే పిలుపునకు రాముడి కంటే ముందే చేరి తన తేజశ్శక్తిని ప్రసరించి కార్యోన్ముఖులవుతారట. అందుకే శ్రీరాముడు వంటి ప్రభువు/యజమాని ఆంజనేయుడు వంటి సేవకుడు లేరన్నది పెద్దల మాట. ఆంజనేయుడు లాంటి బంటు లభించడం తన అదృష్టంగా రామచంద్రుడే కొనియాడాడని తులసీదాస్ కీర్తించారు. సర్వగుణ సమున్నతుడైనా, కపిశ్రేష్ఠుడిగా మన్ననలు అందుకున్నప్పటికీ ఏలిక కావాలనుకోలేదు. సుగ్రీవునికి సచివుడిగా, అనంతరం శ్రీరామబంటుగా ఉండేందుకే ఇష్టపడ్డాడు. మంత్రిగా, స్వామిసేవకుడిగా తన విధులను అత్యుత్తమంగా నిర్వహించాడు.

**యువతకు మార్గదర్శి**

‘దీక్ష, మనోనిగ్రహం, ధైర్యం, వినయం, త్యాగం, ఆత్మవిశ్వాసం, అంకితభావం, మనోబలం, బుద్ధి కుశలత, కార్యసాఫల్యానికి ప్రధాన లక్షణాలు. ఈ లక్షణాలు సంపూర్ణంగాగల హనుమంతుడిని యువత ఆదర్శంగా తీసుకొని జీవితాలను తీర్చిదిద్దుకోవాలి’ అన్నారు స్వామి వివేకానంద. స్వామి కార్యమే తప్ప ఇతరత్రా ఆలోచనలు లేని దీక్షాదక్షుడు పవనసుతుడు. బాహ్యాకర్షణలకు చలించని మనోనిగ్రహ సంపన్నుడు. అవరోధాలను సమయస్ఫూర్తితో అధిగమించిన ధీశాలి. లంకాదహనంతోపాటు మైరావణాది అసుర సంహారం లాంటి ఘనకార్యం సాధించినా, తాను రాముడు వదిలిన బాణాన్నే అని పొగడ్తలు, ఆత్మస్తుతి పట్ల విముఖత చూపిన వినయశీలి. కార్యసాధనకు స్వీయ సుఖాలను కాదనుకున్న త్యాగశీలి. ఆత్మవిశ్వాసం విజయానికి తొలిమెట్టు అనే సూత్రాన్ని హనుమ అక్షరాల పాటించాడు. సీతాన్వేషణకు లంకకు వెళుతున్న తాను ఎప్పటికి తిరిగా రాగలనో చెప్పలేను కానీ, సీతమ్మ జాడను తెలుసుకోవడమే కాదు...ఆ తల్లిని చూసే వస్తాననడంలో ఆత్మవిశ్వాసం కనిపిస్తుంది.



సీతాన్వేషణకు సముద్రాన్ని దాటుతున్నప్పుడు సాగరగర్భం నుంచి పైకి వచ్చి మైనాకుడు (స్వర్ణమయ పర్వతం) ఇవ్వజూపిన ఆతిథ్యాన్ని మృదువుగా తిరస్కరించి (‘నేను విశ్రమించేందుకు ఇది సమయం కాదు. శ్రీరామ కార్యమే ప్రథమ కర్తవ్యం) ముందుకు సాగిన అంకితభావం గల సేవకుడు. సీతామాత ఆచూకీ తీయలేకపోతే ఆత్మహత్యే శరణ్యమని భావించి, అంతలోనే మనోబలంతో తనకు తానే ధైర్యం చెప్పుకుని పట్టుదలతో ప్రయత్నాన్ని కొన సాగించి సాధించాడు. తాను సాధించిన కార్యాలు తన ఘనతగా కాకుండా వానర సమూహ విజయంగా అభివర్ణించిన మహోన్నతుడు. జ్ఞానులలో అగ్రగణ్యుడు, సకల గుణనిధానుడు. అయినా పెద్దల ముందు అతి వినయశీలి. అదీ ఆయన ఔన్నత్యం. అందుకే పదకవితా పితామహుడు అన్నమాచార్యులు ‘ఒక్కడే ఏకాంగ వీరుడుర్వికి దైవమౌనా/యెక్కడా హనుమంతుని కెదురా లోకము’ అనీ, ‘అన్నిటా నేరుపరి హనుమంతుడు/పిన్ననాడె రవినంటె పెద్ద హనుమంతుడు.....’ అని కొనియాడారు.

**భక్తి కవులకు స్ఫూర్తిప్రదాత**

‘రామాయణ మహామాలారత్నం’గా భాసిల్లుతున్న హనుమ దాస్యభక్తికి ప్రథమోదాహరణ. త్యాగయ్య (సంగీతసేవ), కబీరు (కవనసేవ), రామదాసు (కరసేవ) లాంటి మహావాగ్గేయకారులు, కవులకు స్ఫూర్తి ప్రదాత. భక్తుల పాలిట చింతామణి. రామ నామం ఉండే చోట అంజలి ఘటిస్తూ నిలుస్తాడు. ప్రభువుతో పాటు ప్రత్యేకంగా పూజలందుకునే అరుదైన ‘బంటు’. భగవంతునితో సమానంగా భక్తుడు పూజలు అందుకోవడానికి నిదర్శనం. అంజన్నంటే భక్తులకు కొండంత నమ్మిక. ఆయన పేరు విన్నంతనే భయం మటుమాయమై ధైర్యం ఆవహిస్తుంది. భూత ప్రేత పిశాచాదులు పలాయనం చిత్తగిస్తాయని, మనోభీష్టం నెరవేరుతుందని భక్తుల విశ్వాసం. ‘హనుమత్స దృశం దైవం నాస్తి నాస్త్యేవ భూతలే అనేనైన ప్రమాణేన జయసిద్ధికరం పరమ్’ (హనుమంతునితో సమానమైన దైవం భూతలంలో లేదు. ఈ ప్రమాణం వల్లనే హనుమంత వ్రతం ఆచరించిన వారికి నిశ్చయంగా జయం కలుగుతుంది) అని శాస్త్ర వచనం. తెల్లజిల్లేడు వేరుతో చేసిన హనుమ విగ్రహం ప్రశస్తమైనదని, దానిని అర్చించడం వల్ల శత్రుభయాలు ఉండవని చెబుతారు. జిల్లేడు పూలు, పారిజాతాలు, తమలపాకుల మాలను ఆయనకు అలంకరిస్తారు. హనుమత్ పూజతో సర్వదేవతా పూజఫలం కలుగుతుందని మైత్రేయునితో పరాశర మహర్షి చెప్పినట్లు (‘సప్తకోటి మహామంత్రా: సిద్ధ్యంత్యేవ,నసంశయం/ఆరాధితే కపిశ్రేష్ఠే సమస్తా ఆదిదేవతా:) అని పరాశర సంహిత తెలుపుతోంది.

ఆసేతు శీతాచల పర్యంతం హనుమను తమవాడిగా చెప్పుకోవడానికి ప్రయత్నించడంలోనే ఆయన పట్ల గల భక్తిభావం వ్యక్తమవుతోంది. హనుమ జన్మస్థలిపై వాదోపవాదాలను అటుంచితే ప్రతి ప్రాంతం వారు ఆయనను సొంతం చేసుకునేందుకు ప్రయత్నించడం గమనార్హం. అవతార పురుషులను తమ తమ ప్రాంతాలకు చెందిన వారుగా చెప్పుకోవడంలో వింతకానీ, అనౌచిత్యం కానీ లేదంటారు. ఏ ప్రాంతీయులైనా, ఏ కాలానికి చెందినవారైనా మహనీయులు లోకవంద్యులు, ఆరాధనీయులే. లోకారాధ్యుడు, ధర్మమూర్తి రామచంద్రుడి బహి: ప్రాణంగా సంభావించే లోకోత్తర వీరుడు పవనసుతుడు అంతే....

ప్రాంతీయ అచారాలను బట్టి వివిధ తిథులలో హనుమజ్జయంతిని జరుపుకుంటారు. తెలుగువారు పరశర సంహితను అనుసరిస్తూ వైశాఖ బహుళ దశమి నాడు నిర్వహించుకుంటారు. ద్వైత సంప్రదాయపరులకు హనుమజ్జయంతి ప్రధాన పండుగ. వారు ఆయనను ‘ముఖ్య ప్రాణదేవుడు’గా సంభావిస్తారు. హనుమదుపాసకులు ఈ పర్వదినాన్ని ఘనంగా నిర్వహిస్తారు. హనుమజ్జయంతి నాడు సూర్యోదయం నుంచి ప్రత్యేక పూజాదికాలతో మందిరాలు పరిమళిస్తుంటాయి.

*‘వైశాఖ మాసి కృష్ణాయాం దశమ్యాం మందవాసరే*

*పూర్వాభాద్ర ప్రభూతాయ మంగళమ్ శ్రీహనూమతే!!*

★

కథ

# పరోక్షంగా..

**వి. రాజారామ మోహనరావు**



**ముం**దు పొడి దగ్గులా వచ్చింది. మర్నాడు, రెండోనాడు జలుబు, జ్వరం. మూడోనాటికి బాగా ఎక్కువైపోయింది. మామూలుగా వెళ్లే వీధి చివరి ఆసుపత్రికి తీసుకెళ్లాడు భార్య సావిత్రిని శివ. డాక్టరు చూసి పరీక్షలు చేసి, వాటి వివరాల కోసం మర్నాడు రమ్మన్నాడు. మందులిచ్చి పంపించేశాడు. డాక్టరుకి చూపించడం అయింది కదా అని భార్యని ఇంట్లో దింపి, ఆటో నడపటానికి వెళ్లాడు శివ. మర్నాడు ఆసుపత్రికి వెళ్లాడు. ఏదో పలానా జ్వరం అని చెపుతారని తేలిగ్గా ఊహించాడు. కానీ డాక్టరు చెప్పింది విన్నాక, శివ తలకిందులైపోయాడు.

"మీ ఆవిడకి కరోనా పాజిటివ్. మా దగ్గర వైద్యానికి వీలు లేదు. హాస్పిటల్లో ఎక్కడైనా అడ్మిషన్ అంత తేలిగ్గా దొరకదు. మనకి దగ్గర్లో ఉన్న వైస్రాయి పెద్ద హాస్పిటల్. మంచిది. ఉత్తరం రాసిస్తాను. వెళ్లి ప్రయత్నం చెయ్యి. యాభైవేలు ముందు కట్టించుకుంటారు" అన్నాడు డాక్టర్.

"ఇంట్లోనే ఉండి మందులు వేసుకుంటే.." అనడిగాడు శివ.

"చాలా ప్రమాదం. ఇంట్లో అందరికీ వచ్చేస్తుంది. వెంటనే వైద్యం జరిగి తీరాలి. లేకపోతే ప్రాణాల మీదకు రావచ్చు. ఆవిణ్ణి ఎడ్మిట్ చేశాక, మీ కుటుంబంలో అందరూ కూడా కరోనా పరీక్ష చేయించుకోండి."

కొద్ది నిమిషాలలో శివ బుర్రంతా అల్లకల్లోలమైపోయింది. ఆ తర్వాత పనులన్నీ ఓ యంత్రంలా చేశాడు. తనకి అవసరమైనప్పుడు అప్పు తీసుకునే మార్వాడీ కొట్టుకి వెళ్లాడు. మార్వాడీ అడిగిన చోటల్లా సంతకాలు పెట్టి డబ్బు తీసుకున్నాడు. పిల్లలిద్దర్నీ, భార్యనీ తీసుకుని వైస్రాయి హాస్పిటల్‌కి వెళ్లాడు. బెడ్ ఉందంటారో, ఎడ్మిట్ చేసుకుంటారో లేదోనన్న టెన్షన్. భార్యని ఎడ్మిట్ చేసాడు. యాభైవేలు కట్టాడు. శివ, పిల్లలు కూడా టెస్ట్ చేయించుకున్నారు. భార్యకి బెడ్ దొరికిందన్న రిలీఫ్ లేకుండా, తమ టెస్ట్ రిపోర్ట్స్ ఏమోస్తాయోనన్న కొత్త టెన్షన్.

రిపోర్ట్స్ వచ్చాయి. పిల్లలకి గానీ, తనకి గానీ కరోనా లేదు. నెగిటివ్ అన్నారు. హమ్మయ్య! అనుకున్నాడు. హాస్పిటల్ వాళ్లు మరో యాభైవేలు కట్టమన్నారు. మార్వాడీ దగ్గరనుంచి మళ్లీ తెచ్చి కట్టాడు. ప్రతీసారి యాభైవేలంటే ఎలా? అన్న బెంగ పట్టుకుంది. కానీ సావిత్రి తన భార్యే కాదు, తన ఇద్దరి పిల్లల తల్లి. ఆమె ప్రాణం కన్నా ఏదీ ముఖ్యం కాదనుకున్నాడు. ఈ విషయం తెలిసి సావిత్రి తల్లి వచ్చి ఇంట్లో పిల్లల్ని చూసుకుంటోంది. ఇంటి చుట్టుపక్కల వాళ్లు దూరం దూరంగా మెసులుతున్నారు. మొహమాటానికి పలకరిస్తున్నారు.

సావిత్రిని ఐ.సి.యు.లో ఉంచారు. వైద్యం బాగానే జరుగుతోందని, ఆమె ఆరోగ్యం స్థిరంగానే ఉందనీ చెబుతున్నారు. తగ్గడానికి ఎన్నాళ్లు పడుతుందంటే, 'ఏమో చెప్పలేం.. ముందు టెస్ట్‌లో నెగిటివ్ రావాలి, ఆ తర్వాత మిగిలిన సంగతి' అన్నారు.

హాస్పిటల్ వాళ్లు చెప్పేది, చుట్టూ జనం చెప్పుకునే వార్తల వల్ల ఏదో అనుకోవటమే తప్ప, నిజంగా ఏం జరుగుతుందో, పరిస్థితి ఏమిటో శివకి తెలియదు. సావిత్రిని హాస్పిటల్‌లో చేర్చి పద్నాలుగు రోజులైంది. అప్పటికి ఏడు లక్షలు కట్టాడు. ఇంటి కాగితాలు, ఆటో సి బుక్ అన్నీ మార్వాడీ తీసుకున్నాడు. రోజులు గడుస్తున్నది తెలుస్తోంది కానీ, ఏ విషయం మనసుకి పట్టడం లేదు. ఏదో మొద్దు స్థితిలో ఉన్నట్టు గడుపుతున్నాడు. ఆటో నడుపుతున్నాడు కానీ, ఆసక్తి ఎంతమాత్రం లేదు. వందల్లో ఆటో సంపాదన, వేలల్లో హాస్పిటల్ ఖర్చు. తనొక భయంకరమైన ఊబిలో కూరుకుపోతున్నట్టుంది. బయటపడే ఆధారం కనపడటం లేదు. ఒకటే ఒక ఆశ, భార్య బతికి బయటపడితే చాలు. పిల్లలు తల్లిలేని వాళ్లు కాకుండా ఉండే చాలు.

శివ చుట్టూ భయం. ఆలోచనంతా కరోనా చుట్టూనే. హాస్పిటల్లో కరోనా చావులు, మాకు పదిహేను లక్షలైందని కొందరు, మాకు ఇరవై లక్షలైందని మరికొందరు. ఊరూరా కరోనా పెరుగుతోందని, కొత్త కేసులు వేలల్లో నమోదు అవుతున్నాయనీ వార్తలు. భార్యకి ఎలా ఉంటుందోనన్న బెంగతోపాటు, తనకో, పిల్లలకో, అత్తగారికో కరోనా వచ్చేస్తుందేమోనన్న చచ్చే బెదురు శివకి. పైగా ధారలా అవుతున్న ఖర్చు. విపరీతంగా పెరిగిపోతున్న అప్పు. కేవలం పదిహేను రోజుల్లోనే పీనుగులా అయిపోయాడు.

శివ ఆ నగరానికి వచ్చి పదిహేనేళ్లయింది. ముందు ఆటో అద్దెకు తీసుకుని నడిపాడు. రాత్రింబవళ్లు కష్టపడి నాలుగేళ్లకి సొంత ఆటో కొనుక్కున్నాడు. మరో రెండేళ్లకి, తాముంటున్న అద్దె ఇంటి దగ్గర్లో ఓ చిన్న ఇల్లు అమ్మకానికి వస్తే, ఊళ్లో పొలం అమ్మేసి కొనుక్కున్నాడు. సొంత ఇల్లు, సొంత ఆటో, చక్కటి సంసారం, అందమైన ఇద్దరు పిల్లలు... మంచి స్కూల్లో వాళ్లకి చదువు... ఇంకేం కావాలి? నువ్వు అదృష్టవంతుడివిరా... అనేవారు తోటివాళ్లు. శివ కూడా అదే తృప్తితో ఉండేవాడు. అలాంటిది ఇప్పుడు పరిస్థితి అంతా తలకిందులైంది. వెనక్కి తిరిగి చూసుకుంటే అంతా శూన్యంలా ఉంది. ఏ ఆసక్తిలేని నిర్లిప్తత. అంతూ, దరి కనబడని భయం, జంకు, బెదురు. భార్య చచ్చిపోతే అన్న దిగులు.

ఇరవై ఎనిమిది రోజులకి సావిత్రిని డిశ్చార్జ్ చేశారు. ఇంటికి తీసుకొచ్చాడు. భార్య బయట పడినందుకు, తమకెవరికి అంటుకోనందుకు కొంత వరకు తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు. అన్నీ కలిపి చూసుకుంటే ఖర్చు ఇరవై లక్షలు దాటింది.

మార్వాడీ ఇల్లు, ఆటో స్వాధీనం చేసుకున్నాడు. పూర్తి నిరాధారంగా రోడ్డు మీద నిలబడిన పరిస్థితి శివది. కొన్నాళ్లు అదే ఇంట్లో ఉండి అద్దె కడతానన్నాడు. మార్వాడీ ఒప్పుకోలేదు, ఆ ఇంట్లో కొత్త షాపు పెట్టించాడు. కొడుక్కి ఆ షాపు అప్పగించాడు. అలా విస్తరించటం మార్వాడీ అలవాటు. శివ అద్దె ఇంట్లోకి సంసారాన్ని మార్చాడు. సావిత్రి మరింతగా కోలుకునే వరకూ అత్తగారు ఉంటానంది.

మళ్లీ అద్దె ఆటో. పిల్లల చదువు ఎలాగో? అంత ఫీజు కట్టలేడు. గవర్నమెంట్ స్కూల్లో చేర్చాలేమో?

లేదా చదువు మానిపించాలి. శివ జీవితం పదిహేనేళ్లు వెనుకపడింది. అప్పుడు ఊళ్లో పొలం ఉండేది. ఇప్పుడు అదీ లేదు.

శివ బావమరిది గోపాల్ వచ్చాడు. అక్క సావిత్రి బాగా నీరసపడింది. బావ శివ మానసికంగా అంతకన్నా నీరసపడినట్టు కనిపించాడు. గోపాల్ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. బావకి సహాయంగా ఉంటుందని ఓ పదివేలు తెచ్చాడు. జరిగిందంతా అతనికి తెలుసు.

ఆ డబ్బు ఇస్తూ... ''దిగులుపడి నీరసపడిపోకు బావా. ఎవరు మాత్రం ఏం చెయ్యగలం చెప్పు'' అన్నాడు. డబ్బు ఇచ్చాడు. వద్దంటూనే తీసుకోక తప్పలేదు శివకి. ఇంట్లో అవసరాలు అలా ఉన్నాయి. "ఒక్క నెల రోజులు... మీ అక్క... ఈ జబ్బు... మొత్తం నన్ను నేలమట్టం చేశాయి" అన్నాడు శివ. అలా వింటుంటే అతని కళ్లల్లో నీళ్లు తిరిగాయి.




"బావా... ఇది అక్కకి వచ్చిన కరోనా వల్లే అనిపించినా, దీని వెనక చాలా కారణాలున్నాయి. మనకి స్వతంత్రం వచ్చి డెబ్భై ఏళ్లు దాటింది. మన గవర్నమెంట్ హాస్పిటల్స్ మీద మనలో చాలామందికి నమ్మకంలేని పరిస్థితి. డబ్బు పెట్టగలిగితే ప్రైవేటు వైద్యానికే పరిగెడతాం. వైస్రాయిలో అక్కకి చేసిన వైద్యానికి సరిగ్గా లెక్క కడితే, కొన్ని వేలే. కానీ నీ దగ్గర లక్షలు గుంజారు. వాళ్లు ఏం చేసినా అడ్డుకునే వ్యవస్థ లేదు. వాళ్లు అంత దారుణంగా దోపిడీ చెయ్యటమూ, ఈ కార్పొరేట్ హాస్పిటల్స్ అమానుష ప్రవర్తన కూడా దీనికి కారణం. కొన్ని దేశాల్లో విద్య, వైద్యం ప్రజలకి ఉచితం.

ప్రజల మంచి గురించి మనవాళ్లకి అక్కర్లేదు. వైద్యం, విద్య, రవాణా లాంటివి సజావుగా ప్రజలకి అందకపోతే బతుకు ఇలాగే ఉంటుంది. ఇవన్నీ నీలాంటి వాళ్ల దృష్టికి రాని విషయాలు" అన్నాడు గోపాల్.

శివకి అంతా అయోమయంగా ఉంది. అతని పదిహేనేళ్ల ఎదుగుదలని నెలరోజులు దోపిడి చేసినట్టయింది. వైస్రాయివాళ్ల కార్పొరేట్ దోపిడి, దాన్ని పట్టించుకోని ప్రభుత్వ తీరే ఇంత బాధగా అనిపిస్తుంటే, ఉత్తరం రాసి వైస్రాయికి పంపిన వీధి చివరి డాక్టరిక్కూడా, తను ఖర్చు చేసిన ఇరవై లక్షల్లో వాటా ముడుతుందని తెలిస్తే ఇంకెంత ఇదిగా ఉండేదో.

"బావా మన కుటుంబమే కాదు. కరోనా బారిన పడిన ఎన్నో వందల, వేల కుటుంబాలు నేలమట్టమయ్యాయి. వాళ్ల గురించి పట్టించుకొని, లెక్కలు వేసే వ్యవస్థ మనకి లేదు. మనలాంటి వాళ్ల ప్రాణభయాన్ని డబ్బులా మార్చుకొని తీరని దాహంలా తాగే రాక్షస వ్యవస్థలో ఉన్నాం.

అక్కని వైస్రాయి వాళ్లు ప్రాణాలతో ఇంటికి పంపించారు. వాళ్ల వైద్యాన్ని కాదనలేం. అందుకు సంతోషించు. అదే అదృష్టం అనుకో" అన్నాడు శివకి ధైర్యం చెబుతూ గోపాల్.

'సావిత్రిని ప్రత్యక్షంగా ప్రాణాలతో ఇంటికి పంపించారు. కానీ మరో రకంగా శివ కుటుంబం ఉసురు తీసారు. కంటికి కనిపించని హత్యే అది. ఈ హత్యల బాధ్యత ఎవరిదో లోతుగా చూస్తేనే కానీ అర్థం కాదు' అనుకున్నాడు గోపాల్ ఆ ఇంటి పరిస్థితి చూస్తూ.

'శివ రాత్రింబవళ్లు మళ్లీ ఎన్నాళ్లు కష్టపడాలో, కష్టపడినా యథాస్థితికి రాగలడో, లేడో. ఎందుకంటే, సమాజ పరిస్థితులు ఎలా ఉంటాయో?' ★

**మే 28, వీర సావర్కార్ 139వ జయంతి**

# అది సంకుచిత 'హిందూ



**భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో బ్రిటిష్ పాలన చివరి దశాబ్దంలో (1937-1947) అఖండ భారత్‌ను ఇండియా, పాకిస్తాన్‌లుగా విభజించే ఉద్దేశ్యంతో ద్విజాతి సిద్ధాంతం తలెత్తింది. ఆ అనైతిక, అరాచక రాజకీయ పరిణామాలకు భారత జాతీయ కాంగ్రెస్, ముస్లింలీగ్‌లదే బాధ్యత. ముస్లింలీగ్ మత రాజ్యకాంక్ష, గాంధీజీ చెప్పిన హిందూ-ముస్లిమ్ ఐక్యతను ముస్లింలు తమ మత రాజ్య నిర్మాణానికి అనుకూలంగా మలుచుకోవడం విభజనకు బలాన్ని చేకూర్చాయి. ఈ రెండు సంస్థల నేతల అధికార కాంక్ష కూడా అఖండ భారతావని రెండుగా చీలిపోయే దుస్థితిని తెచ్చిపెట్టింది. అటు జాతీయ కాంగ్రెస్ తొలితరం అగ్రనేతలలో అంతర్లీనంగా ఉన్న హిందుత్వ, జాతీయాభిమానం సన్నగిల్లిపోవడం, ఇటు ముస్లింలీగ్‌లో ముస్లిం రాజ్య స్థాపనే ధ్యేయంగా రాజకీయ దుర్నీతి ప్రబలడం కూడా చరిత్రలో కనీవినీ ఎరుగని రక్తపాతం మధ్య దేశం చీలిపోవలసిన స్థితిని తెచ్చిపెట్టాయి.**

అలాంటి తాత్త్విక, సామాజిక, రాజకీయ చారిత్రక సంఘర్షణలో హిందూ జాతీయతావాద ప్రవక్తగా నిలిచిన వారే వినాయక్ దామోదర్ సావర్కార్ (మే 28,1883-ఫిబ్రవరి 26,1966). తొలి నుంచి గాంధీజీ సిద్ధాంతాలతో విభేదించిన స్వాతంత్ర్య సమరయోధుడు. నిరుపమాన త్యాగశీలి. బ్రిటిష్ ప్రభుత్వం వేసిన రెండు జీవితకాలాల (యాభై ఏళ్లు) ద్వీపాంతరవాస శిక్షతో జైల్లపాలైన ఆ సమరయోధునికి 24 ఏళ్ల తర్వాత కొంత స్వేచ్ఛ లభించింది. కానీ రాజకీయ కార్యకలాపాలపై నిషేధం ఇంకొంత కాలం కొనసాగింది. హిందుత్వ రాజ్య భావోత్తేజితుడైన వీర సావర్కర్ అఖిల భారత హిందూ మహాసభలో ప్రవేశించారు. ఆ సంస్థ అధ్యక్షునిగా 1937 నుండి ఆరేళ్లు పాటుపడ్డారు. హిందూరాష్ట్ర (దేశం) ఆవిర్భావం ఆయన కల. 1937 కర్ణావతి (అహ్మదాబాద్), 1938 నాగపూర్ (మహారాష్ట్ర), 1939 కలకత్తా (బెంగాల్), 1940 మధురై (తమిళనాడు), 1941 భాగల్పూర్ (బిహార్), 1942 కాన్పూర్ (ఉత్తరప్రదేశ్) వార్షిక సమావేశాలలో, ఇతర ప్రసంగాలలో, అఖిల భారత హిందూ మహాసభ అధ్యక్ష హోదాలో వీర సావర్కార్ తన అభిప్రాయాలను వెలువరించారు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని దేశం నుండి పారదోలవలసిందే. ఏది ఆ దేశం? ఏది హిందుస్తాన్? వంటి అంశాల గురించి ఆయనకు పూర్తి స్పష్టత ఉంది. సింధు నదీ ప్రాంతం నుంచి ప్రాచీన భారత ఆర్యావర్త సముద్ర పర్యంతం విలసిల్లిన పవిత్రభూమి హిందుస్తాన్ అన్న నిర్వచనాన్ని ఆయన ముందుకు తీసుకువచ్చారు. హిమాలయోన్నత శిఖరాలపై హిందుత్వ విజయ పతాకను ఎగుర వేసేందుకు జరిపే పోరాటం కోసం భారతజాతికి పిలుపు ఇచ్చారు.

***ఆ సింధు సింధు పర్యంతా యస్య భారత్***
***భూమికా ।***
***పితృ భూః పుణ్య భూాయైశ్చైవ స వై***
***హిందురితిస్మృతః ॥***

కర్ణావతి హిందూ మహాసభ వేదికపై నుంచి, సావర్కార్ 'హిందూ' పద నిర్వచనానికి 'ఆ సింధు, సింధు పర్యంత' శ్లోకాన్ని ఉదాహరించి, హిందూ రాజ్యస్థాపన లక్ష్యాన్ని చెప్పారు. అయితే హిందూ మహాసభ కేవల మత సంబంధి కాదని, జాతీయ సంస్థగా, హిందుస్తాన్‌లో నివసించేవారందరి కోసం హైందవ రాజ్యాన్ని స్థాపిస్తుందని అన్నారు. భారత స్వరాజ్యం లేదా స్వాతంత్ర్యం అంటే హిందువులు యావన్మందికి రాజకీయ స్వాతంత్ర్యం సిద్ధింప చేయడమేనని ఆయన భావన. హైందవ సామ్రాజ్య విజేతగా ఛత్రపతి శివాజీ మొగల్ పాలనను తుద ముట్టించాడని, బ్రిటిష్ పాలనాధిపత్యం కూడా అనతికాలంలోనే తుడిచిపెట్టుకు పోగలదని చెప్పేవారు. ముస్లిమ్ లీగ్ లక్నో సమావేశం గురించి ప్రస్తావిస్తూ, జిన్నా, ఇతర నాయకులు జాతి వ్యతిరేక కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్నారని విమర్శించారాయన. అనుమానాస్పదంగా ఉండే మిత్రులకంటే, బాహాటంగా వ్యవహరించే శత్రువు నయమని వ్యాఖ్యానించారు.

**నాగపూర్ మహాసభలో...**

1938 నాగపూర్ అఖిల భారత హిందూ మహాసభ 20వ వార్షిక సమావేశ అధ్యక్షునిగా వీరసావర్కార్ గళం విస్ఫులింగాలు విరజిమ్మింది. అచంచల హిందుత్వ తత్త్వవేత్తగా సావర్కార్, మహాయోధ పృథ్వీరాజ్, రాణా ప్రతాప్, ఛత్రపతి శివాజీ, గురుగోవింద్ సింగ్, నానా ఫడ్నవీస్, మహద్‌జి షిండే వంటి హైందవ యోధుల చారిత్రక జీవిత విశేషాలకూ, భారత జాతీయతకూ ఉన్న బంధాన్ని తన ప్రసంగంలో పేర్కొన్నారు. నిజాం సంస్థానంలో మరాఠా దౌత్యవేత్త గోవిందరావు కాలే, హిందూ సమరయోధుడు నానా ఫడ్నవీస్‌కు 1793లో రాసిన ఉత్తరంలో ప్రస్తావించిన హిందూ సామ్రాజ్య ప్రాభవాన్ని కూడా సావర్కార్ ఈ మహాసభలో ప్రస్తావించారు. "అట్టక్ (పాకిస్తాన్‌లో ఉంది) నుంచి హిందూ మహాసముద్రం వరకు విస్తరించిన భూమి హిందువుల మాతృభూమి. అదే హిందుస్తాన్. అది

# రాష్ట్ర దర్శనం' కాదు



జయసూర్య

తుర్కస్తాన్ కానే కాదు. పాండవుల పాలన నుంచి విక్రమాదిత్యుని వరకు అక్కడ హిందూ సామ్రాజ్యాలు విలసిల్లాయి. తర్వాత ముస్లిమ్ రాజ్యమైనా పేష్వాలు, మహద్‌జీ షిండే హిందూ సామ్రాజ్య విజేతలుగా మళ్లీ వాటిపై విజయ పతాకం ఎగురవేశారు" అని చెప్పారాయన.

శతాబ్దాల పర్యంతం హిందూ, ముస్లిమ్, క్రైస్తవ, పార్శీ తదితరులు కలసి మెలిసి నివసిస్తున్న హిందుస్తాన్ మతం, భాష, సంస్కృతి, ఇతర చారిత్రక విభేదాలు ఉన్నా, ఒకే పునాది మీద విస్తరించిన జాతిగా పునురుజ్జీవనం పొందాలని నాగపూర్‌లో వీరసావర్కార్ తన జీవన వాంఛితాన్ని ఆవిష్కరించారు. కాంగ్రెస్ నేతలు సృష్టిస్తున్న కుహనా జాతీయవాదం కారణంగా మలబార్ నుంచి పెషావర్ వరకు, సింధ్ నుంచి అస్సాం వరకు తమ జన్మ భూమిలోనే హిందువులు నిస్సహాయంగా ఉండిపోతున్నారని ఆక్రోశించారు. "రామేశ్వరం నుంచి పెషావర్ వరకు హిందువుల మీద జరుగుతున్న ఘోరకలికి మూల కారణం ఏమిటి?" అని ప్రశ్నిస్తూ, ప్రస్తుత సమాధి స్థితి నుంచి హిందుత్వాన్ని పునరుజ్జీవింపచేసి, ప్రజ్వరిల్ల చేయగల శక్తి ఈ జాతిలో నిక్షిప్తమై ఉందని గుర్తు చేశారు కూడా. ఆర్యావర్తపు మహర్షుల హోమాగ్ని జ్వాలలే సంకేతంగా హిందూ సామ్రాజ్యం ఎన్నో విజయ పరంపరలు సాధించిందనీ, హిందూ సంఘటనవాదులు ఐక్య హిందూ జాతీయ వేదికపై ధర్మపతాకను ప్రతిష్ఠించి, ఆత్మాభిమానంతో, అచంచల విశ్వాసంతో సగర్వంగా తల ఎత్తుకొనే హిందుస్తాన్ ఆవిర్భవించాలనీ పిలుపునిచ్చారు. హిందూధర్మానికీ, రాష్ట్రానికీ (దేశానికి) విజయం సిద్ధించాలని నినదిస్తూ, వందేమాతరం అంటూ సావర్కార్ అధ్యక్షోపన్యాసం ముగించారు.

1939-1945 మధ్యకాలంలో జరిగిన రెండవ ప్రపంచ యుద్ధం మన స్వాతంత్ర్య పోరాట దిశను మలుపు తిప్పింది. అప్పటివరకు గాంధీజీ నాయకత్వంలో సాగుతున్న భారత జాతీయ కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ పోరాట సంస్థగా హిందూ మహాసభకు స్వాతంత్ర్య వీర సావర్కార్ తన కలం, గళం అందించి ప్రాణ ప్రతిష్ఠ చేసారు. మరాఠాలు, సిక్కుల త్యాగాలతో నిలిచిన చారిత్రక హిందూ రాజ్య వైభవాన్ని గుర్తు చేస్తూ, మహమ్మదీయుల ఢిల్లీ సామ్రాజ్య పతనాన్ని చారిత్రక ఆధారాలతో సహా ప్రస్తావించారు. 1857 ప్రథమ స్వాతంత్ర్య సమరోత్తేజాన్ని ఆయన గుర్తు చేశారు. మే 10, 1942న హిందూ మహాసభ స్వాతంత్ర్యదినంగా జరిపింది. ఆ రోజు హిందూ సంఘటనవాదుల పాకిస్తాన్ ఏర్పాటు పిలుపును వ్యతిరేకించే ప్రదర్శనలతో యావత్ హిందూదేశం సావర్కార్ అడుగుజాడలలో నడిచింది.

1939-1945 మధ్యకాలంలో జరిగిన రెండవ ప్రపంచ యుద్ధం మన స్వాతంత్ర్య పోరాట దిశను మలుపు తిప్పింది. అప్పటివరకు గాంధీజీ నాయ కత్వంలో సాగుతున్న భారత జాతీయ కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ పోరాట సంస్థగా హిందూ మహాసభకు స్వాతంత్ర్య వీర సావర్కార్ తన కలం, గళం అందించి ప్రాణ ప్రతిష్ఠ చేసారు. మరాఠాలు, సిక్కుల త్యాగాలతో నిలిచిన చారిత్రక హిందూ రాజ్య వైభవాన్ని గుర్తు చేస్తూ, మహమ్మదీయుల ఢిల్లీ సామ్రాజ్య పతనాన్ని చారిత్రక ఆధారాలతో సహా ప్రస్తావించారు. 1857 ప్రథమ స్వాతంత్ర్య సమరోత్తేజాన్ని ఆయన గుర్తు చేశారు.

**కలకత్తా హిందూ మహాసభలో...**

1939లో కలకత్తాలో జరిగిన హిందూ మహాసభ వార్షిక సమావేశంలో సావర్కార్ ఇచ్చిన అధ్యక్షోపన్యాసంలో నైజాంలో హిందువుల పరిస్థితులను వివరించారు. అక్కడ సాగుతున్న హిందూ వ్యతిరేక విధానాలు, అణిచివేతలపై ఆర్యసమాజం, హిందూ మహాసభ, ఇతర హిందూ సంఘటనవాదుల పౌర ప్రతిఘటన, ఉద్యమ నైతిక విజయం వంటి అంశాలను ప్రస్తావించారు. స్వరాజ్య అంటే స్వత్వ, కలిసిన హిందుత్వంగా పేర్కొంటూ, ఔరంగజేబ్ లేదా టిప్పు వంటి వారి పాలన హిందూ స్వరాజ్యం కాలేదని స్పష్టీకరించారు. ఆర్యావర్తం, భారతభూమి వంటి ప్రాచీన పదాలు ఉన్నా, హిందువుల మాతృభూమిగా హిందుస్తాన్, దేశభాషగా సంస్కృతం గుర్తింపు పొందాలన్నారు. స్వచ్ఛమైన సంస్కృత నిష్ఠంగా ఉన్న హిందీకీ, వార్ధా విద్యా విధానంలోని హిందుస్తానీకీ సంబంధం లేదన్నారు. హిందూ మహాసభ హిందూ ధర్మ మహాసభ కాదని, హిందూ జాతీయ మహాసభగా సర్వజాతి హిందూ జీవన సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ పూర్ణ స్వరాజ్య స్వాతంత్ర్య సాధనకు కట్టుబడి ఉందన్నారు. హిందూ సంఘటనను కోరుతున్న పార్టీని భారత జాతీయ కాంగ్రెస్ కుహనా జాతీయవాదులు మతతత్వ పార్టీగా ప్రచారం చేయడంపై వీర సావర్కార్ తీవ్రంగా స్పందించారు. గాంధీజీ నియంతృత్వంలో కాంగ్రెస్ హిందూ నాయకులు హిందూ జాతికి ద్రోహం చేస్తున్నారని నిప్పులు చెరిగారు. రానున్న రెండేళ్ల నిర్మాణాత్మక కార్యక్రమంలో భాగంగా హిందూ మహాసభ కార్యకర్తలకు సావర్కార్ కలకత్తా సమావేశ అధ్యక్షునిగా అంటరానితనం నిర్మూలన, యువతకు తప్పనిసరి సైనిక శిక్షణ, హిందూ సంఘటన వాదులకు ఎన్నికలలో విజయం కోసం ఉద్యమ కార్యాచరణ ప్రణాళిక అమలు చేయవలసిందిగా నిర్దేశించారు.

**మధురై హిందూ మహాసభ**

అఖిల భారత హిందూ మహాసభ వార్షిక సమావేశాలలో మధురైలో నాల్గవసారి అధ్యక్షునిగా సావర్కార్ బాధ్యతలు చేపట్టారు. తీవ్ర అస్వస్థత కారణంగా అధ్యక్ష బాధ్యత నిర్వహణలో డా॥ పి.వరదరాజులు నాయుడుకు తన నిస్సహాయతను వ్యక్తం చేసినా ప్రయోజనం లేకపోయింది. మద్రాస్ ప్రెసిడెన్సీకి సంబంధించి హిందూ సంఘటన ఉద్యమం సేలంకు చెందిన విజయరాఘవ చారియర్ వంటి పెద్దల అండదండతో త్రివేంద్రం నుంచి రాజమండ్రి వరకు ఊపందుకుంటున్న తరుణమది. ధర్మవీర్, డా॥ మూంజే, ఎం.ఎన్. ముఖర్జీ, డా॥ శ్యామాప్రసాద్ ముఖర్జీ, ధర్మవీర్ భోపట్కర్ వంటి నాయకుల సారథ్యంలో జాతీయ స్థాయిలో ఎన్నికల రంగంలో హిందూ సంఘటనోద్యమానికి లక్షలాది కార్యకర్తలు భారత జాతీయ కాంగ్రెస్‌తో తలపడుతున్న రోజులవి. హిందూ మహాసభ, హిందూ సంఘటనిస్ట్ పార్టీగా రూపొందింది. కాంగ్రెస్, ముస్లింలీగ్‌ల రాజకీయ కుతంత్రాలను తిప్పి కొట్టాలని సావర్కార్ దృఢ కార్యాచరణ నిర్దేశించి చేపట్టారు. సావర్కార్ రచనలు హిందుత్వ, హిందూ-పద్-పాద షాహి (హైందవ స్వరాజ్య సమరగాథ), హిందూ సంఘటన్, మహాసభ చరిత్ర, భాగనగర్ సంఘర్షణ (ఇంద్రప్రకాశ్, ఎస్.ఆర్.డాటే రచనలు) నాడు హిందువులను కదిలించి సంఘటిత పోరాటానికి సంసిద్ధం చేస్తున్నాయి. మధురై సభాధ్యక్షునిగా, సావర్కార్ నాటి ద్వితీయ ప్రపంచ

సంగ్రామ స్థితిని సమీక్షించారు. యుద్ధమే సదవకాశంగా హిందువులు అత్యధికంగా సైనికి శిక్షణ పొందాలని, పారిశ్రామికీకరణ సాధించాలని మహాసభ తీర్మానించింది. కళాశాలలు, పాఠశాలలో సైనిక శిక్షణ తప్పనిసరిగా ఉండాలని, రామ్‌సేన ఏర్పాటు, పౌర రక్షణ దళాలు, నూతన పరిశ్రమలు, విదేశీ వస్తు బహిష్కరణ, జనగణన వంటి 8 ప్రధాన అంశాల ప్రచారానికి హిందూ సంఘటిస్ట్‌లు దేశ వ్యాప్తంగా దృష్టి కేంద్రీకరించాలని వినాయక దామోదర్ సావర్కార్ మహాసభ అధ్యక్షునిగా ఉత్తేజవంతమైన సందేశంలో భారత జాతిని ప్రభావితం చేశారు.

**భాగల్పూర్ 23వ జాతీయ మహాసభలో...**

1941లో నిషేధపు ఉత్తర్వులు ఉన్నప్పటికీ బీహార్‌లోని భాగల్పూర్‌లో సావర్కార్ అధ్యక్షతన జరిపిన హిందూ మహాసభ సదస్సు విజయవంత మైంది. 'హిందువులదే హిందుస్థాన్', 'హిందూ ధర్మానికే విజయం' నినాదాలతో బ్రిటిష్ ఇండియా  హిందూ సమాజం నినదించింది. అంతకు ముందటి ఏడాది మహాసభ చేపట్టిన సామాజిక సంస్కరణలలో భాగంగా అంటరానితనంపై పోరాటం, ఎన్నికల రంగంలో విజయాలు, హిందూ రాష్ట్ర ఆశయ వ్యతిరేక శక్తులను ప్రతిఘటించడం వంటి అంశాలలో మహాసభ ఇంకొన్ని అడుగులు ముందుకు వేసింది. హిందువుల ప్రతీ ఓటు  హిందూ మహాసభ అభ్యర్థులకే లభించాలని, కాంగ్రెస్, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీల కుహనా జాతీయతావాదాన్ని పరాజితం చేయాలని సంఘటనవాదులకు సావర్కార్ తక్షణ కర్తవ్యాలుగా ప్రబోధించారు. రెండవ ప్రధాన అంశంగా సావర్కార్, పారిశ్రామికీకరణ, సైనిక శక్తికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

**కాన్పూర్ 24వ వార్షిక మహాసభలో...**

మహాసభ భాగల్పూర్‌లో నిర్వహించిన పౌర ప్రతిఘటనోద్యమంలో హిందూ జాతి నలుమూలల నుంచి వచ్చిన సంఘటనవాదులు ధర్మయుద్ధంలో లాఠీలు, తుపాకులు నిర్బంధాలకు ఎదురొడ్డి హిందుత్వ పతాకను విజయధ్వజంగా, వీర సావర్కార్ స్ఫూర్తి ప్రదాతగా ఆమోదించారు. స్వాతంత్ర్యం వెంటనే ప్రకటించాలని, సంపూర్ణ అధికారయుతంగా జాతీయ ప్రభుత్వం రాజ్యాంగబద్ధమైన శాసనాధికారం కోసం 1942 కాన్పూర్ సమావేశం డిమాండ్ చేసింది. వీర సావర్కార్, డా॥ శ్యామాప్రసాద్ ముఖర్జీ, డా॥ మూంజే, బారిస్టర్ ఛటర్జీ, రాజా మహేశ్వర్ దయాల్ సేఠ్, రాయ్ బహదూర్ మెహర్ చంద్ ఖన్నా, ప్రొ. దేశ్‌పాండేలతో ప్రత్యేక కమిటీ ఏర్పడింది. బ్రిటిష్ ప్రధాని చర్చిల్‌కు మహాసభ అధ్యక్షుడు సావర్కార్ తంతి పంపించారు. 1942లో సావర్కార్ స్వతంత్రం సాధించే దిశలో హిందుస్తాన్ భవితవ్యానికి చరిత్రాత్మకమైన మహాదార్శనికుగా సారథ్యం వహించి కీర్తి శిఖరం అధిష్ఠించారు. హిందూ మహాసభకు వరుసగా ఆరుసార్లు అధ్యక్ష బాధ్యత నిర్వర్తించి 1954 నాటికి డా॥ శ్యామాప్రసాద్ ముఖర్జీకి అప్పగించారు. సుదీర్ఘ పోరాటంలో ఒక ఉజ్జ్వల ఘట్టమది.

బొంబాయి ప్రచురణ సంస్థ 'వీరసావర్కార్ ప్రకాశన్' ఆయన రచించిన 'హిందూ రాష్ట్రదర్శన్' ప్రచురించింది. ఈ గ్రంథానికి మహాసభ ప్రముఖ నేత ఎస్.టి. గాడ్గిల్ ముందుమాట రాశారు. అందులో, గాంధీజీ నాయకత్వంలోని భారత జాతీయ కాంగ్రెస్ కారణంగా హిందూమతానికీ, జాతికీ, సంస్కృతికీ, ప్రధానంగా హిందుత్వ జాతీయ సంస్థాపక మహదాశయానికి ఎదురైన స్థితిగతులను సావర్కార్ ఏ విధంగా ప్రతిఘటించినదీ ప్రస్తావించారు.

(భారత స్వాతంత్ర్య సమర చరిత్రలోని ఆఖరి అంకంలో అత్యంత కీలకమైన 'అఖండ భారత్ విభజన' పతాక సన్నివేశం సందర్భంలోని కొన్ని ముఖ్యాంశాలను ఈ వ్యాసకర్త 'హిందూ రాష్ట్ర దర్శన్' గ్రంథం నుంచి అనువదించి అందచేసారు. వీరసావర్కార్ 139వ జయంతి (28 మే 1883) పురస్కరించుకొని ఈ విశేష వ్యాసం 'జాగృతి' అందచేస్తోంది.)

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



# 'పరిపూర్ణత దిశ

**రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి కావస్తున్నది. 1925లో నాగపూర్‌లో సంఘ్ స్థాపన జరిగింది. ఈ సంవత్సరం (2022) విజయదశమి నాటికి సంఘ ప్రారంభమై 97 సంవత్సరాలు పూర్తవుతాయి. సంఘ కార్యం ఏ ఒక్కరి కృషితో జరగలేదు. కార్యకర్తల కృషి, త్యాగం, బలిదానాల మూలంగా, నానాటికీ పెరుగుతున్న సామాజిక మద్దతు, పరమేశ్వరుని ఆశీర్వాదం వల్ల సంఘకార్యం పెరుగుతున్నది. అనేక వ్యతిరేకతలు, అవరోధాలు, సమస్యలను అధిగమించి విస్తరిస్తున్నది. ఈ కారణంగానే అంతటా సంఘ్ గురించిన చర్చ జరుగుతున్నది. సంఘ్ తన శతాబ్ది వేడుకలను ఎలా జరుపుకుంటుందనే ఆసక్తి సైతం ప్రజల్లో నెలకొంది.**

సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ హెడ్గేవార్ దృష్టి చాలా స్పష్టమైనది. సంఘ్ సమాజంలో ఒక సంస్థ మాత్రమే కాదు. యావత్ సమాజాన్ని సంఘటితం చేసేది. భావనాత్మకంగా సంఘ్, హిందూ సమాజం మధ్య సమన్వయం (conceptually RSS and Hindu society are co-terminus) ఉంటే, మనోవైజ్ఞానిక దృష్టి కోణంలో ఒకటేనని (psychologically they are one) సంఘ్ జ్యేష్ఠ కార్యకర్త దత్తోపంత్ ఠేంగ్డి అన్నారు.

ఈ కారణంగానే సంఘ్ శతాబ్ది వేడుకలు నిర్వహించాలనే ఆలోచనకు తావులేదు. సంఘ్ ఒక సంపూర్ణ సమాజం. సంఘ్ సాధనను సమాజమంతటా విస్తరింపజేయడమే లక్ష్యంగా ఉండాలి. సంఘ్ రజతోత్సవం సైతం జరుపుకోరాదని డాక్టర్ హెడ్గేవార్ చెబుతుండేవారు. అంతకుమునుపే కార్యాన్ని పూర్తి చేయాలనే ఆశయంతో పూర్తి శక్తియుక్తులతో నిమగ్నమయ్యారు.

కానీ వారికి కేవలం 15 సంవత్సరాల సమయం మాత్రమే లభించింది. కనుక శతాబ్ది సంవత్సరానికి ముందే సంఘ్ కార్యాన్ని పూర్తి చేయడమే లక్ష్యం అయిఉండాలి. "కార్యమగ్నత జీవన్ హో ఔర్ కార్యపూర్తి హీ విశ్రాంతి" (పనిలో



డా. మన్మోహన్ వైద్య, సహ సర్ కార్యవాహ, ఆర్ఎస్ఎస్

# గా సంఘ కార్యక్రమం'

నిమగ్నం కావడమే జీవితం, కార్యాన్ని పూర్తి చేయడమే విశ్రాంతి) అని ఒక సంఘ గీత్ (పాట) ఉంది.

సంఘ్ కార్య విస్తరణ యాత్రలో నాలుగు దశలు ఉన్నాయి. సంఘ్ స్థాపన నుంచి స్వాతంత్ర్యం వచ్చే వరకు మొదటి దశ. ఈ దశలో ఏక చిత్తంతో, ఏకాగ్రతతో సంఘటన పైన మాత్రమే దృష్టి ఉంది. ఎందుకంటే హిందూ సమాజం సంఘటిత మవుతుంది, అడుగులో అడుగువేసి ఒకే దిశలో ఏకథాటిగా నడవగలదు, ఒకే మనస్సుతో, ఒకే స్వరంతో భారత్ గురించి, హిందుత్వ గురించి మాట్లాడగలము అనే ఒక విశ్వాసాన్ని పాదుగొల్పడం అప్పుడు ముఖ్యం. ఆ లక్ష్యం కోసమే యావత్ కార్యం సాగింది. ఆ సమయంలో ఎవరికి వారే స్వచ్ఛందంగా వ్యక్తిగత స్థాయిలో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. సమాజ సంస్కరణ, తదితర ఉద్యమాల్లో పాలుపంచు కుంటున్నారు. కానీ సంఘ్ తన పూర్తి దృష్టిని హిందూ సంఘటన పైనే కేంద్రీకరించింది.

వెయ్యి సంవత్సరాల నిరంతర సంఘర్షణ తర్వాత 'స్వ' ప్రేరణగా కొనసాగిన స్వరాజ్య ఉద్యమం ఆధారంగా విద్య, విద్యార్థి, రాజకీయం, కార్మికులు, వనవాసీ సమాజం, వ్యవసాయం తదితర రంగాల్లో భారతదేశపు శాశ్వతమైన జాతీయ దృక్పథానికి ప్రేరణ చెంది వివిధ సంస్థలు ఆవిర్భవించాయి. అదే సమయంలో సంఘటన కార్యం కొనసాగింది. కానీ దానితో పాటుగా సంపూర్ణ సమాజ జీవనాన్ని విస్తరింపజేసే అనేక సంస్థలు ఆరంభమయ్యాయి.

నేడు సంఘ్ కార్యకలాపాలు శాఖ రూపంలో 90 శాతం బ్లాకులకు చేరుకున్నాయి. 35కు పైగా సంస్థలు సమాజ జీవనానికి చెందిన వివిధ క్షేత్రాల్లో చురుకుగాను, సమర్థవంతంగానూ పనిచేస్తున్నాయి.

సంఘ్ కార్యకలాపాల అభివృద్ధి యాత్రలో మూడవ దశ డాక్టర్ హెడ్గేవార్ జయంతి శతాబ్దిని పురస్కరించుకొని 1990లో ఆరంభమైంది. యావత్ సమాజం ఆత్మీయత, ప్రేమ ప్రాతిపదికన సంఘటితం కావాలి. అందుకు సమాజంలో వంచితులు, దుర్బలులు, వెనుకబడిన వర్గాలు, కనీస సౌకర్యాలకు నోచుకోకుండా జీవించే వారికి చేరువై వారికి సహాయం, సేవ చేయడాన్ని ఒక బాధ్యతగా భావించి, వారి సమగ్రాభివృద్ధి ధ్యేయంగా 1990లో సేవా విభాగ్ ఆరంభ మయ్యింది.

"దేశ సర్వతోముఖాభివృద్ధి కోసం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌లో స్వయంసేవక్‌ను అయ్యాను" అనే ప్రతిజ్ఞను స్వయంసేవక్ చేస్తారు. ఈ సర్వతో ముఖాభివృద్ధి కార్యాన్ని కేవలం స్వయంసేవకులు మాత్రమే చేయడం లేదు. వారితో మాత్రమే అది సాధ్యం కాదు. సమాజంలోని అనేక మంది ప్రభావశీలురు, సమాజానికి ఏదో ఒకటి చేయాలని ఆకాంక్షించేవారు స్వచ్ఛందంగా చేస్తున్నారు. వారి గురించి, వారు చేస్తున్న పనుల గురించి సంఘ్‌కు తెలియదు. అలాగే సంఘ్ జాతీయ భావజాలం వారి



దాకా చేరడంలేదు.

సమాజంలో అలాంటి ప్రభావశీలుర లక్షణాలు, వారి క్రియాశీలత, వారు సాధించిన విజయాలు, సమాజం నుంచి వారికి సహకారం, తదితర సమాచార సేకరణకు, సంఘ్ భావజాలం, కార్యకలాపాల గురించిన సమాచారాన్ని వారికి చేరవేసే దిశగా 1994లో సంపర్క్ విభాగ్ కార్యకలాపాలు ఆరంభమయ్యాయి. సంపర్క్ విభాగ్ ద్వారా కొత్తగా పరిచయమైన వ్యక్తులు సంఘ్‌లో చేరకపోవచ్చు కానీ సంఘ్ స్వయంసేవకులుగా మేము వారిని కలుస్తాము.

పరస్పర ఆలోచనలు, అనుభవాలు, విజయాలను పంచుకోవడం ద్వారా భావ సారూప్యత కలిగిన విషయాలతో మేము వారితో కలసికట్టుగా పనిచేస్తాము.

1967లో తొలిసారిగా మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల శాసనసభల్లో క్రైస్తవ మత మార్పిడిని అరికట్టేందుకు ఒక బిల్లు ఆమోదం పొందింది. ఆ సమయంలో కేంద్రంలో, ఆ రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. అనంతరం భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన కాలంలో వేర్వేరు రాష్ట్రాల శాసనసభల్లో క్రైస్తవ మత మార్పిడిని అరికట్టే బిల్లు ఆమోదం పొందింది. ఇందులో హిమాచల్ ప్రదేశ్‌కు కొంతవరకు మినహాయింపు ఉంది. 2006లో వీరభద్రసింగ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మతమార్పిడికి వ్యతిరేకంగా ఒక బిల్లును ఆమోదింపజేసింది. కొన్ని సంవత్సరాల క్రితం సంఘ్‌కు చెందిన సంపర్క్ విభాగ్ లో అధికారి వీరభద్రసింగ్‌ను కలుసుకోవడానికి వెళ్లారు. ఆ సందర్భంగా తమ ప్రభుత్వం ఉన్న కాలంలో మత మార్పిడిని వ్యతిరేకించే బిల్లు ఆమోదం పొందిన వైనాన్ని వారు స్వయంగా వివరించారు. హిమాచల్ ప్రదేశ్‌కు వెలుపల భారతదేశంలో ఏ ప్రాంతంలోనైనా మతమార్పిడిని అడ్డుకోవడంలో తన అవసరం ఉన్న పక్షంలో కూడా రావడానికి తాను సిద్ధంగా ఉన్నానని వారు తెలిపారు. 2008 – 09 మధ్యకాలంలో గో–గ్రామ యాత్ర మొదలైనప్పుడు అనేక ప్రాంతాల్లోని సర్వోదయ కార్యకర్తలు యాత్రలో పాల్గొన్నారు. అన్ని విషయాల్లోనూ సంఘ్ భావజాలం, దృక్పథంతో ఏకీభవించకపోయినా వారు సైతం అంశాలవారీగా సంఘ్ కార్యకలాపాల్లో పాలుపంచుకుంటున్నారు.

అదేవిధంగా వివిధ ప్రసార మాధ్యమాలను వినియోగించడం ద్వారా సంఘ్ జాతీయ భావజాలాన్ని సమాజంలో విస్తరింపజేయడం కోసం, సంఘ్‌పై జరుగుతున్న దుష్ప్రచారానికి దీటుగా జవాబు చెప్పడం కోసం, సంఘ్‌కు చెందిన సరైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడం కోసం, స్వయంసేవకులు పెద్ద ఎత్తున చేపడుతున్న సత్కార్యాలను ఈ ప్రసార మాధ్యమాల ద్వారా సమాజానికి తెలియపరిచే ఉద్దేశంతో 1994లో ప్రచార్ విభాగ్ (ప్రచార విభాగం) ఆరంభమయ్యింది. ప్రసార మాధ్యమాన్ని, ప్రజలకు సంబంధించిన అన్ని మాధ్యమాలను ఉపయోగించుకోవడానికి తోడు స్వయంగా ప్రయోగించడం ద్వారా సంఘ్ ప్రచార్ విభాగ్ చురుకుగా పనిచేస్తున్నది. సంఘ్‌కు చెందిన ఈ మూడు కార్య విభాగాలు (సేవ, సంపర్క్, ప్రచార్) సుదూర ప్రాంతాల ప్రజలకు సంఘ్‌ను చేరవేయడం ద్వారా సమాజాన్ని మేల్కొలిపే కార్యక్రమంలో పాల్గొంటున్నాయి.

ఇదే సమయంలో కొన్ని సమస్యలపైన తక్షణం ప్రత్యేకమైన దృష్టి పెట్టడం ద్వారా సమాజంలో పరివర్తన తీసుకువచ్చే కార్యక్రమం కూడా ప్రారంభమైంది. "ధర్మజాగరణ్ విభాగ్" (ధర్మజాగరణ విభాగం) ద్వారా హిందూ సమాజాన్ని మతమార్పిడి గావించే దిశగా ప్రణాళికాబద్ధంగా జరిగే ప్రయత్నా లను అడ్డుకోవడంతో పాటుగా, మతాంతరీకరణకు

గురైన ప్రజలకు తిరిగి వారిదైన సంస్కృతిలోకి చేరడానికి సులభమైన మార్గాన్ని చూపే కార్యక్రమం మొదలైంది. ప్రభుత్వంపై ఆధారపడకుండా ప్రజలందరూ కలిసికట్టుగా వారి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడం కోసం, ప్రభుత్వ పథకాలను సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా గ్రామ సర్వతోముఖా భివృద్ధి లక్ష్యంగా "గ్రామ్-వికాస్" (గ్రామాభివృద్ధి) కార్యక్రమం ఆరంభమైంది.

ఏకత్వంతో కూడుకున్న మన హిందూ సమాజం వివిధ కులాలతో కూడినది. అయితే కుల విద్వేషాలను పెంచడం ద్వారా కొన్ని అంతర్గత శక్తులు సమాజాన్ని కుల విభేదాలతో చీల్చే పని కూడా చేస్తున్నాయి. సామాజిక సద్భావన సమావేశాల ద్వారా, ప్రతి ఒక్కరూ ఒకచోట కూర్చొని కొన్ని సాధారణ సమస్యలు, సవాళ్ల గురించి ఆలోచించేలా, వాటిని అధిగమించడానికి సమష్టిగా కృషి చేయాలనే



ప్రస్తుతం సంఘ్ కార్యకలాపాల అభివృద్ధి యాత్ర నాల్గవ దశ సాగుతున్నది. దేశం సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రతి స్వయంసేవక్ సంఘ్ కార్యకర్తగా పనిచేస్తాడు. అందువల్ల ప్రతి ఉద్యోగి స్వయంసేవక్ సామాజిక మార్పు కోసం తన ఆసక్తి, సామర్థ్యానికి అనుగుణంగా ఏదైనా రంగంలో సామాజిక పరివర్తన, మార్పు కోసం చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించ డమైనది. సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ హెడ్గేవార్ 1940లో జరిగిన శిక్షావర్గలో ప్రసంగిస్తూ సంఘ్ కార్యకలాపాలను శాఖకు మాత్రమే పరిమితం చేయకుండా వాటిని సమాజంలోనూ చేయాలని అన్నారు.

ఉద్దేశ్యంతో "సామాజిక్ సద్భావ్" (సామాజిక సద్భావన) పేరిట వరుస సమావేశాలు ప్రారంభ మయ్యాయి.

మన సమాజంలోని అంటరానితనం పేరిట కొన్ని వర్గాలకు విద్య, సౌకర్యాలు, గౌరవ మర్యాదలు దురదృష్టవశాత్తూ నిరాకరించిన మాట నిజం. ఇది చాలా అన్యాయం. ఈ అన్యాయాన్ని నివారించి, మన సమష్టి వారసత్వాన్ని గుర్తు చేసుకుంటూ అందరిని కలిసికట్టుగా ముందుకు తీసుకువెళ్లే ప్రయత్నంలో భాగంగా "సామాజిక్ సమరసత" (సామాజిక సమరసత) పని మొదలైంది.

దేశీ గోవుల నుంచి మనం పొందే ఉత్పత్తుల్లో ఔషధీయ విలువల పట్ల ప్రజల్లో అవగాహన కలిగించడం కోసం, భారతీయ గోవుల సంరక్షణ, సంవర్ధన, అభివృద్ధితో పాటుగా ఆవుపేడ ఆధారిత సేంద్రియ వ్యవసాయం చేపట్టే దిశగా రైతులకు శిక్షణ, పర్యవేక్షణ, ప్రోత్సహించడం కోసం "గోసేవ-గోసంవర్ధన్" కార్యక్రమం కూడా విజయవంతంగా సాగుతున్నది. భారతదేశమంతటా వేలాది సంఖ్యలో గోశాలలు ఆరంభమయ్యాయి.

భారతీయ సంస్కృతి, పరంపరంలో కుటుంబం పాత్ర అత్యంత విశిష్టమైనది. సమాజం అత్యంత ప్రాథమిక స్థాయి వ్యక్తి నుంచి మొదలవుతుందని పాశ్చాత్య దృక్పథం భావిస్తుంది. కానీ భారతీయ దృక్పథానికి సంబంధించి అది కుటుంబం నుంచి ఆరంభవుతుంది. భారతీయ ఆధ్యాత్మిక దృష్టికోణంలో "నేను నుంచి మనం వరకు సాగించే ప్రయాణంలో" కుటుంబానిది తొలి అడుగు. ప్రస్తుతం పట్టణీకరణ వల్ల, జీవనంలోని హడావిడి కారణంగా కుటుంబాలు చిన్నబోయాయి. అందరూ కలిసి కూర్చుని తమ వారసత్వం, సంప్రదాయాలు, సంబంధాలు, పండుగలు మొదలైన వాటి గురించి చర్చించు కోవడానికి కూడా సమయం దొరకడం లేదు. కనుక కనీసం వారానికి ఒకసారైనా కుటుంబ సభ్యులందరూ ఒకచోట కూర్చోవాలి. తమ జాతీయ వారసత్వం, సంప్రదాయం, సాంస్కృతిక, వర్తమాన సామాజిక పరిస్థితులను జాతీయ దృక్కోణంతో విశ్లేషించాలి. అలా విశ్లేషించగా వచ్చిన వికాసంలో తమ కర్తవ్యాన్ని చర్చించుకోవాలనే ఉద్దేశ్యంతో "కుటుంబ్ ప్రబోధన్" కార్యక్రమం ప్రారంభమైంది.

సృష్టి మనది, సమస్త జీవులకు మాతృమూర్తి. కానీ భౌతిక జీవన ప్రభావం వల్ల ప్రకృతి దోపిడీకి గురైంది. పశ్చిమ దేశాల అభివృద్ధి ప్రమాణాల ఆధారంగా కొనసాగుతున్న అభివృద్ధి కేవలం 500 సంవత్సరాలలోనే సృష్టి సంతులతను దెబ్బ తీసింది. ప్రజల భాగస్వామ్యాన్ని వృద్ధి చేయడం ద్వారా దెబ్బతిన్న సంతులతను పునరుద్ధరించడానికి, "పర్యావరణం" పట్ల ప్రజల్లో అవగాహన, క్రియా శీలతను తీసుకురావాలనే ఉద్దేశ్యంతో "పర్యావరణ సంరక్షణ్" (పర్యావరణ పరిరక్షణ) కార్యక్రమం ప్రారంభమైనది. స్వయంసేవలు ఈ పనులన్నింటినీ 'గతివిధి' పేరుతో సమాజం ముందుంచి ఆరంభిం చారు. సంఘ్ కార్యకలాపాల అభివృద్ధి యాత్ర మూడవ దశలో ఇది ఒక భాగం.

ప్రస్తుతం సంఘ్ కార్యకలాపాల అభివృద్ధి యాత్ర నాల్గవ దశ సాగుతున్నది. దేశం సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రతి స్వయంసేవక్ సంఘ్ కార్యకర్తగా పనిచేస్తాడు. అందువల్ల ప్రతి ఉద్యోగి స్వయంసేవక్ సామాజిక మార్పు కోసం తన ఆసక్తి, సామర్థ్యానికి అనుగుణంగా ఏదైనా రంగంలో సామాజిక పరివర్తన, మార్పు కోసం చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించ డమైనది. సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ హెడ్గేవార్ 1940లో జరిగిన శిక్షావర్గలో ప్రసంగిస్తూ సంఘ్ కార్యకలాపాలను శాఖకు మాత్రమే పరిమితం చేయకుండా వాటిని సమాజంలోనూ చేయాలని అన్నారు. మీ కుటుంబానికి అవశ్యమైన ధనార్జన, కుటుంబం పట్ల శ్రద్ధ, క్రమం తప్పకుండా శాఖకు వెళ్లడంతో సరిపోదు. సమాజ పరివర్తన, జాగృతికి ఉపకరించే ఏ పనిలోనైనా మీ సమయాన్ని వెచ్చించి చురుకుగా పాల్గొనడమే సంఘ్ కార్యం అవుతుంది. సమాజంలో సంఘ్ కార్యకలాపాలను సమర్థవంత మైన పద్ధతిలో చేయడం ద్వారా మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోవాలి. అఖిల భారతీయ దృక్పథాన్ని సాధించి ఆసేతు హిమాచల పర్యంతం సమాజం అంతా ఒక్కటే అనే భావనను అనుభవంలోకి తెచ్చుకోవాలి. సమాజాన్ని కూడా తీసుకువెళుతూ స్వార్థాన్ని వదిలివేస్తూ సమాజానికి నేతృత్వం వహించే అంశాలను నేర్చుకుంటూ, వాటిని క్రమం తప్పకుండా సాధన చేస్తూ, శాఖకు సక్రమంగా వెళుతూ, శాఖ నుంచి నేర్చుకున్న ఈ అన్ని గుణాలను ప్రయోగిస్తూ, సమాజంలో పరివర్తన తీసుకురావడానికి ఏదో ఒక రంగంలో చురుకుగా పాల్గొనడం అత్యంత అవసరం. దీనితో పాటుగా స్వయంసేవకులకు సమాజంతో సంబంధం వృద్ధి చెందాలి. తద్వారా సమాజంలో నవతరం ప్రతినిధులు స్వయంసేవక్ ద్వారా సంఘ్‌తో సంబంధాలు ఏర్పరుచుకుంటారు. సంఘ్ గురించి తెలుసుకుంటారు. సంఘ్ జాతీయ భావజాలాన్ని తెలుసుకుంటారు. సమాజంలో అంతర్భాగమైన హిందూధర్మం, హిందూ సంస్కృతి, హిందూ సమాజాన్ని సంరక్షిస్తారు. ఈ దేశ సర్వతో ముఖాభివృద్ధి కోసం సన్నద్ధమవుతారు.

సంఘటన, వ్యక్తి నిర్మాణ కార్యక్రమం కొనసాగు తూనే ఉంటుంది. సమాజాన్ని మేల్కొలిపే కార్యక్రమం (జాగరణ్ శ్రేణి) సైతం తోడుగా కొనసాగుతుంది. వ్యవస్థ పరివర్తనను దృష్టిలో ఉంచుకొని సమాజ జీవనంలోని వివిధ రంగాల్లో వివిధ సంస్థల ద్వారా స్వయంసేవక్ చురుకుగా వ్యవహరించాలి. ప్రస్తుతం ప్రతి ఒక్క స్వయంసేవక్ సమాజ పరివర్తన ప్రక్రియలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉండాలి. వీటన్నింటి ద్వారా సంఘ్ కార్యాచరణ దిశగా ముందుకు సాగుతూ సంఘ్ కార్యాన్ని సంపూర్ణత వైపుకు తీసుకువెళ్లడమే శతాబ్ది ఉత్సవాలను జరుపుకోవడానికి ఉపకరించే ఉత్తమ మార్గం అవుతుంది.


**అను: వేదుల నరసింహం, సీనియర్ జర్నలిస్ట్**




# శ్రీలంక... ఎందుకిలా?

పేపరు, సిరా కొరత కారణంగా కొన్ని లక్షలమంది విద్యార్థులకు నిర్వహించాల్సిన పరీక్షలు వాయిదా పడ్డాయంటే నమ్ముతారా? కానీ ఈ నమ్మలేని నిజం, ఇప్పుడు శ్రీలంక ఎదుర్కొంటున్న దారుణ దుస్థితికి ఒక ఉదాహరణ! ఒకవైపు తరిగిపోతున్న చమురు నిల్వలు, నిత్యావసరాల కొరత, కోల్పోతున్న ఉపాధి అవకాశాలు, అందుబాటులో లేని ధరలు ఇవన్నీ 22 మిలియన్ల శ్రీలంక ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి, కోపాగ్నికి కారణమై చివరికి హింసాకాండకు దారితీసింది. ఈ దుస్థితికి మాజీ ప్రధాని మహీంద రాజపక్స ప్రభుత్వం కారణమన్న కోపంతో ప్రభుత్వ ఆస్తులపై దాడులు, దహనాలు, లూటీలకు పాల్పడ్డారు. ముఖ్యంగా దేశాధ్యక్షుడు గోటబయ రాజపక్స, మహీంద రాజపక్సపై ప్రజాగ్రహం పరాకాష్టకు చేరింది. ఎన్నడూ లేని రీతిలో దేశ ఆర్థిక పతనావస్థకు రాజపక్స సోదరులే కారణమంటూ వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజావ్యతిరేకతకు భయపడిన మహీంద రాజపక్స మే 9న ప్రధాని పదవికి రాజీనామా చేయడంతో, పరిస్థితి మరింత అస్తవ్యస్తంగా మారింది. ప్రభుత్వమంటూ లేకపోవడంతో దేశంలో అరాచకం తాండవించింది. ఎట్టకేలకు శ్రీలంక 26వ ప్రధానిగా రణిల్ విక్రమసింఘే మే 12న ప్రమాణస్వీకారం చేశారు. తక్షణం సుస్థిర ప్రభుత్వం ఏర్పాటు ఆవశ్యకతను ఇది తీర్చినా, కలగూరగంప మాదిరిగా అన్ని పార్టీల మద్దతుతో ఏర్పడిన ఈ ప్రభుత్వం ఉసురును ఎవరు ఎప్పుడైనా తీయవచ్చు! అంతేకాకుండా అవకాశం దొరికినప్పుడు, దేశం వదిలివెళ్లడానికి సహాయపడతారన్న ఉద్దేశంతోనే గోటబయ రాజపక్స ప్రధానిగా విక్రమసింఘేను నియమించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

శ్రీలంక చెల్లించాల్సిన మొత్తం బకాయిలు 51 బిలియన్ డాలర్లు. బ్లూమ్‌బర్గ్ ప్రకారం శ్రీలంక 2022లో మొత్తం 8.6 బిలియన్ యు.ఎస్. డాలర్ల మేర రుణాలు తిరిగి చెల్లించాల్సి ఉంది. 2022 మార్చి నాటికి దేశంలో 1.9 బిలియన్ యుఎస్ డాలర్లు మాత్రమే. విదేశీ మారకద్రవ్య నిల్వలు వీటిని చెల్లించడానికి ఏమూలకు సరిపోవు. ఇప్పటికిప్పుడు చెల్లించాల్సిన 4 బిలియన్ డాలర్లు కూడా చెల్లించలేని దుస్థితి. వీటికి తోడు ఇంటర్నేషనల్ సావరిన్ బాండ్ (ఐఎస్‌బి)కి సంబంధించి 1 బిలియన్ యుఎస్ డాలర్లు చెల్లించాలి. 2022 జనవరి నాటికి ప్రభుత్వం 500 మిలియన్ యుఎస్ డాలర్లు ఐఎస్‌బికి చెల్లించింది. వీటి చెల్లింపును వాయిదా వేయడమే ఉత్తమమన్న ఆర్థిక నిపుణుల సలహాలను ప్రభుత్వం పట్టించుకోలేదు. 2010-2020 మధ్యకాలంలో విదేశీ అప్పులు ఒక్కసారిగా రెట్టింపయ్యాయి. 2019లో దేశ జీడీపీలో రుణాలు 42% కాగా 2021 నాటికి ఏకంగా ఇవి 119%కు చేరాయి. చైనా అప్పుల చట్రంలో శ్రీలంక చిక్కుకుపోయిందంటూ వ్యక్తమవుతున్న అభిప్రాయాల నేపథ్యంలో ఆస్ట్రేలియాకు చెందిన లోవీ ఇన్‌స్టిట్యూట్ పేర్కొన్న విషయాలు భిన్నంగా ఉండటం గమనార్హం. దీని ప్రకారం శ్రీలంక మొత్తం అప్పులో చైనా వాటా 10% మాత్రమే. అంతర్జాతీయ పెట్టుబడి మార్కెట్ల నుంచి తెచ్చుకున్న రుణాలు 47%, బహుముఖ అభివృద్ధి బ్యాంకులు ఇచ్చిన రుణాలు 22%, తర్వాతి స్థానాన్ని 10%తో జపాన్ ఆక్రమిస్తున్నదని ఈ సంస్థ తన నివేదికలో వెల్లడించింది.



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

### సంక్షోభానికి ఐదు కారణాలు

బ్రిటిష్ ప్రభుత్వం నుంచి 1948లో స్వాతంత్ర్యం పొందిన శ్రీలంక ఇప్పటివరకు విదేశీ మారకద్రవ్యం లేని దుస్థితిని ఎదుర్కొనడం ఇదే మొదటిసారి. దీనివల్ల ఆహారం, ఇంధనం దిగుమతులకు చెల్లింపులు జరపలేని దయనీయత. దీనికంతటికి ప్రధాన కారణం గతం నుంచి ఇప్పటివరకు ప్రభుత్వాల నిర్లక్ష్య ఆర్థిక నిర్వహణా విధానాలు. ఇవి బడ్జెట్‌లోటుకు, కరెంటు ఖాతా లోటుకు దారితీసాయి. 2019లో ఆసియా అభివృద్ధి బ్యాంకు తన నివేదికలో ‘శ్రీలంక దుస్థితికి ఈ రెండు లోటులు (బడ్జెట్ లోటు,



కరెంటుఖాతా లోటు) కారణం. అంటే ఉత్పత్తి, సేవల వాణిజ్యం పడిపోవడంతో జాతీయ వ్యయం, ఆదాయాన్ని మించిపోయింది' అని పేర్కొంది. ఈ నివేదిక సంగతి ఎలా ఉన్నా, శ్రీలంక ప్రస్తుత దుస్థితికి ఐదు ప్రధాన కారణాలను చెప్పవచ్చు. 1. జాతీయ సేంద్రియ వ్యవసాయ విధానాన్ని ప్రవేశపెట్టడం, 2. 2019లో జరిగిన ఈస్టర్ బాంబింగ్‌లు (2019 ఏప్రిల్ 21న ఈస్టర్ రోజున, శ్రీలంకలోని మూడు చర్చ్‌లు, కొలంబోలోని మూడు లగ్జరీ హోటళ్లపై ఇస్లామిక్ తీవ్రవాదులు బాంబుదాడులకు పాల్పడ్డారు. అదేరోజు కొలంబోలోని దెమటగోడా హౌజింగ్ కాంప్లెక్స్, దేహీవాలాలోని ఒక గెస్ట్ హౌజ్‌పై కూడా బాంబుదాడులు జరిగాయి. ఈ దాడుల్లో 269 మంది మరణించగా వీరిలో కనీసం 45 మంది విదేశీయులు. 500 మంది గాయపడ్డారు), 3. కొవిడ్ మహమ్మారి 4. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, 5. గత ఎన్నికల్లో ఎడాపెడా పన్నురాయితీలకు హామీ ఇచ్చిన మహీంద రాజపక్స వాటిని అమలు జరపడం.

2021లో రాజపక్స సర్కార్ దేశంలో సేంద్రియ వ్యవసాయ విధానాన్ని అమల్లోకి తెచ్చి రసాయన ఎరువుల దిగుమతులను నిషేధించడం దేశ వ్యవసాయ రంగాన్ని తిరుగులేని దెబ్బతీసింది. శ్రీలంక వ్యవసాయమే అంతంతమాత్రం. రైతులకు ఏమాత్రం అవగాహనలేని సేంద్రియ వ్యవసాయాన్ని ఒక్కసారిగా తీసుకురావడం ప్రమాదకరమని నిపుణులు చెబుతున్నప్పటికీ సర్కారు వినలేదు. ఆవిధంగా ఆర్గానిక్ ఫార్మింగ్‌ను ప్రోత్సహించాలన్న ఉద్దేశం బూమరాంగ్ అయి వ్యవసాయ ఉత్పత్తులు పడిపోయి ఆహార సంక్షోభానికి దారితీసింది. పర్యాటకాదాయం శ్రీలంక జీడీపీలో 10శాతం వరకు ఉంటుంది. 2019 ఈస్టర్ బాంబుదాడులు పర్యాటకాదాయాన్ని దెబ్బతీయగా, కొవిడ్ మహమ్మారి ఈ రంగాన్ని తిరిగి కోలుకోనీయలేదు. కరోనా వల్ల ప్రధాన ఆదాయ వనరైన పర్యాటక పరిశ్రమ పూర్తిగా మూతపడి, విదేశీ ఆదాయమార్గం మూసుకుపోయింది. ఫలితంగా క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీలు శ్రీలంక రేటింగ్‌ను తగ్గించడంతో, అంతర్జాతీయ మార్కెట్లలో పరపతి కోల్పోయింది. రష్యా, ఉక్రెయిన్‌లకు చెందిన పర్యాటకులు అధికసంఖ్యలో శ్రీలంకకు వస్తారు. ప్రధానంగా విదేశీ మారక ద్రవ్యాన్ని సమకూర్చిపెట్టే పర్యాటకరంగాన్ని పునరుద్ధరించాలని నిపుణులు ఎంత మొత్తుకున్నా రాజపక్స సోదరులు ఖాతరు చేయలేదు. ఈ దెబ్బకు కేవలం రెండేళ్ల కాలంలో 70% విదేశీమారక ద్రవ్య నిల్వలు పడిపోయి దేశం దివాలాస్థితికి చేరుకుంది. నిండా మునిగాక శ్రీలంక ప్రభుత్వం భారత్, చైనాలను సహాయం అర్థిస్తే మన దేశం 3.5 బిలియన్ డాలర్ల విలువైన సహాయం అందించేందుకు ముందుకు వచ్చింది. 'ప్రస్తుతం దేశంలో రాజకీయ సుస్థిరత లేదు. ఇప్పటికే దేశం 51 బిలియన్ డాలర్ల అప్పును చెల్లించలేక డిఫాల్ట్ అయింది. అసలు విదేశీ రుణాలు చెల్లించడానికి నిధులేవీ? అందువల్ల తక్షణం సుస్థిర ప్రభుత్వం ఏర్పాటు కాకపోతే నేను రాజీనామా చేయడం తప్ప వేరే మార్గంలేదు' అని సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ నందలాల్ వీరసింఘే నిస్సహాయతను వ్యక్తం చేశారంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో తెలుస్తుంది. అంతేకాకుండా శ్రీలంక టీ ఎగుమతులకు అతిపెద్ద మార్కెట్ రష్యా. తాజా రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వల్ల ఈ ఎగుమతులు నిలిచిపోవడంతో శ్రీలంకకు మరో తిరుగులేని దెబ్బ తగిలింది. గడచిన ఎన్నికల సందర్భంగా మహీంద రాజపక్స, అనేక పన్నురాయితీలు కల్పిస్తామని హామీలు గుప్పించారు. అధికారంలోకి రాగానే వాటిని అమలుచేయడంతో దేశ ఆదాయం ఒక్కసారి కుప్పకూలి పోయింది.

**కట్టలు తెంచుకున్న అసంతృప్తి**

ప్రజలు నిత్యావసరాల కోసం నెలల తరబడి పెద్ద క్యూల్లో నిలబడాల్సిన పరిస్థితి. దీనికితోడు ఇప్పటి వరకు దిగుమతి చేసుకున్న మందులు, ఆహారం, ఇంధనం అడుగంటిపోవడం ప్రజల్లో తీవ్ర అసహనానికి, ఆగ్రహానికి కారణమై హింసాకాండకు

## శ్రీలంకను వెన్నాడుతున్న తమిళుల శాపం

బ్రిటిష్ వారినుంచి 1948లో స్వాతంత్ర్యం పొందిన తర్వాత శ్రీలంకలో సింహళీయులు, తమిళుల మధ్య క్రమంగా పెరిగిన విభేదాలు 1980ల్లో మిలిటెన్సీకి దారితీసింది. ఇది శ్రీలంక అంతర్యుద్ధానికి దారితీసి చివరకు 2009లో ముగిసింది. ఈ యుద్ధంలో లక్షమంది తమిళులు మరణించగా, కొన్ని వేలమందిపై అత్యాచారాలు జరిగాయి. మరికొన్ని వేలమంది అదృశ్యమైపోయారు. శ్రీలంక సైన్యం పాల్పడిన ఈ దారుణాలపై అనేక కథనాలు వెలువడ్డాయి. ఐక్యరాజ్య సమితి నియమించిన ప్యానల్, శ్రీలంకలో అధ్యయనం జరిపి అంతర్యుద్ధం చివరిరోజుల్లో 40వేల మంది తమిళులను దారుణంగా చంపేశారని తేల్చింది. 2020 జనవరిలో శ్రీలంక అధ్యక్షుడు గోటబయ రాజపక్స అదృశ్యమైపోయిన 20వేలకు పైగా తమిళులు మరణించారని స్వయంగా అంగీకరించారు. మరి అంతర్యుద్ధం ముగిసిందని చెబుతున్నా తమిళులు అత్యధికంగా నివసించే ప్రాంతాల్లో పత్రికాస్వేచ్ఛ ఇంకా పునరుద్ధరించలేదు. ఇక్కడి న్యాయవ్యవస్థ ప్రభుత్వ నియంత్రణలోనే కొనసాగుతోంది. అంతర్యుద్ధం వల్ల మొత్తం 8 లక్షల శ్రీలంక తమిళులు కెనడా, సింగపూర్, ఇండియా, యునైటెడ్ కింగ్‌డమ్, జర్మనీ వంటి దేశాల్లో తలదాచుకుంటున్నారు. శ్రీలంక ఉత్తర, ఈశాన్య ప్రాంతంలో విస్తరించిన జాఫ్నా రాజ్యానికి చెందిన తమిళుల చరిత్ర క్రీ.పూ.2వ శతాబ్దం నాటిది. భారత్‌లోని కళింగ రాజైన మఘ లేదా గంగరాజ కళింగ విజయబాహు, పొలన్నారువ ప్రాంత రాజైన రెండవ పరాక్రమ పాండ్యన్‌ను యుద్ధంలో ఓడించి ఈ ప్రాంతాన్ని హస్తగతం చేసు కున్నాడన్నది చరిత్ర. ఈయన శ్రీలంక ఉత్తర, ఈశాన్య, పశ్చిమ ప్రాంతాల్లో శక్తిమంతమైన రాజ్యాన్ని నెలకొల్పాడు. అయితే క్రీ.శ. 1258 నుంచి దక్షిణభారత్‌లోని శక్తిమంతమైన పాండ్య రాజులకు సామంత రాజ్యంగా జాఫ్నా కొనసాగింది.


సింహళీయుల గ్రంథం 'నాంపోటా'లో కూడా ఆధునిక ట్రింకోమలి జిల్లాలోని కొన్ని భాగాలతో పాటు మొత్తం జాఫ్నా రాజ్యాన్ని తమిళల ప్రాంతమైన 'దెమాల పట్టణం' (తమిళ నగరం) అని పేర్కొని ఉండటం గమనార్హం. మరి అంతటి చరిత్ర ఉన్న తమిళుల పట్ల తీవ్ర వివక్షను ప్రదర్శించిన సింహళీయులను కాలం శిక్షించకుండా ఉంటుందా? తమిళులపై తీవ్ర దారుణాలకు ఒడిగట్టిన రాజపక్స సోదరులను నేడు 'కాలం' ఈ విధంగా శిక్షిస్తోందని అనుకోవాలి. ★



మహీంద రాజపక్స



గోటబయ రాజపక్స



రణిల్ విక్రమ సింఘె

దారితీసింది. రోజువారి ఆదాయం 3.20 డాలర్ల కంటే తక్కువ ఉంటే పేదరికంలో ఉన్నట్టు ప్రపంచ బ్యాంకు పరిగణిస్తుంది. దీని అంచనా ప్రకారం శ్రీలంకలో 2019లో 9.2% ఉన్న పేదప్రజల జనాభా, 2020 నాటికి 11.7%కు పెరిగింది. దేశంలో కొవిడ్–19 నేపథ్యంలో 5 మిలియన్ల మంది పేదరికంలో మగ్గుతున్నారని గుర్తించిన ప్రభుత్వం నెలకు రూ.5000 అలవెన్స్ కింద చెల్లించినా పెద్దగా ఫలితం లేదు. దీనికి తోడు పులిమీద పుట్రలా రష్యా–ఉక్రెయిన్ యుద్ధం దేశంలో చమురు కొరతను తీవ్రం చేసింది. ఫలితంగా విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు తగినంత ఇంధనాన్ని సరఫరా చేయలేకపోవడంతో దేశంలో పవర్‌కట్‌లు మొదలయ్యాయి. ఒక్కసారిగా ధరలు పెరగడంతో, ద్రవ్యోల్బణం ఎన్నడూలేని స్థాయికి పెరిగింది. గత ఏప్రిల్ నెలలో దేశంలో ద్రవ్యోల్బణం 30శాతం వృద్ధిని నమోదు చేసింది. శ్రీలంక రూపాయి విలువ యుఎస్ డాలర్‌తో 33శాతం, భారతీయ రూపాయితో 31.6%, యూరోతో 31.5%, పౌండ్ స్టెర్లింగ్‌తో 31.1%, జపాన్ యెన్‌తో 28.7%కు పడిపోయింది.


2019 నవంబర్‌లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన గోటబయ, 2020లో తన తమ్ముడు మహీంద రాజపక్సను ప్రధానిగా నియమించారు. మహీంద మొదటిసారి 2004లో అధికారంలోకి వచ్చారు. తొలుత ప్రధానిగా, తర్వాత దేశాధ్యక్షునిగా పనిచేశారు. 2009లో గోటబయ డిఫెన్స్ సెక్రటరీగా ఉన్నప్పుడు తమిళ రెబెల్స్‌తో అత్యంత కఠినంగా వ్యవహరించి, తమిళ తీవ్రవాదాన్ని అణచివేసారు. 2015లో రాజపక్స సోదరులు కొద్ది కాలంపాటు అధికారానికి దూరం కాగా, మైత్రిపాల సిరిసేన, రణిల్ విక్రమ సింఘేలు దేశాన్ని ముందుకు నడిపారు. అయితే 2018లో విక్రమసింఘేను పదవినుంచి తొలగించడం రాజకీయ సంక్షోభానికి దారి తీసింది. 2020, ఆగస్టులో జరిగిన ఎన్నికల్లో మహీంద రాజపక్స నేతృత్వంలోని పార్టీ గొప్ప విజయాన్ని సాధించడంతో, అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే గతంలో అధ్యక్షుని అధికారాలపై విధించిన పరిమితులను తొలగించి, మళ్లీ ఆయనకు విశేష అధికారాలను కల్పించారు.

ఇప్పుడు వేలాదిమంది నిరసకారులు గోటబయ రాజీనామా కోరుతూ వీధుల్లో పెద్ద ఎత్తున ప్రదర్శనలు చేస్తున్నారు. 45 సంవత్సరాల శ్రీలంక పాలనా చరిత్రలో ఒక్కసారి మాత్రమే దేశాధ్యక్షుడిని తొలగించేందుకు విఫలయత్నం జరిగింది. ఎందుకంటే దేశంలో అమల్లో ఉన్నది 'కార్యనిర్వాహక అధ్యక్ష పాలనా వ్యవస్థ'. దేశాధ్యక్షుడికి అపరిమిత అధికారాలను రాజ్యాంగం కట్టబెట్టింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని, పోలీస్ ఉన్నతాధికారిని నియమించే అధికారం ఆయనదే. ఇంతటి అపరిమిత అధికారాలున్నప్పటికీ వాటిని అమలు పరచేందుకు మంత్రిమండలి, పార్లమెంట్ సహకారం అధ్యక్షుడికి అవసరం. ప్రస్తుతానికి రణిల్ విక్రమ సింఘేని ప్రధానిగా, దేశాధ్యక్షుడు నియమించినా ఈ ప్రభుత్వ సుస్థిరతకు గ్యారంటీ లేదు. మరి ఈ అనిశ్చిత పరిస్థితి ఎటు దారితీస్తుందో తెలియడం లేదు. సైనికచర్య జరిగితే పరిస్థితేంటన్న భయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా మాజీ ప్రధాని మహీంద రాజపక్స, ఆయన కుమారుడు నమల్ రాజపక్స మరో 15మంది దేశం విడిచి పోకుండా శ్రీలంక కోర్టు ఆంక్షలు విధించింది. ప్రస్తుతం మాజీ ప్రధాని ట్రింకోమలిలోని నౌకాస్థావరంలో పూర్తి రక్షణ మధ్య ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నెల 9న గొటగొగామ, మైనగొటగామ ప్రాంతంలో శాంతియుతంగా నిరసన ప్రదర్శన జరుపుతున్న వారిపై జరిగిన దాడులపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఫోర్ట్ కోర్టు మెజిస్ట్రేట్ మహీంద రాజపక్స విదేశాలకు వెళ్లకుండా నిషేధం విధించినట్టు రాయ్‌టర్ వార్తాసంస్థ పేర్కొంది.

**భారత్ అందించిన సహాయం**

భారత్ శ్రీలంకకు 2022లో ఇప్పటివరకు 2.4 బిలియన్ డాలర్ల మేర సహాయం అందించింది. 500 మిలియన్ డాలర్ల విలువైన డీజిల్‌ను ఈ ఏడాది ఫిబ్రవరిలో పంపింది. ఆహారం, ఔషధాల వంటి అత్యవసరాల దిగుమతుల కోసం 1 బిలియన్ యుఎస్ డాలర్ల మేర రుణసదుపాయం కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో శ్రీలంకలోని కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులను భారత్‌కు అప్పగించే అవకాశముందని ఆ దేశ మీడియా పేర్కొంటున్నది. ★





# తాంబూలం

**తాంబూలం తతంగం**

'తాంబూలాలిచ్చేశాను తన్నుకు చావండి' అంటాడు గురజాడవారి కన్యాశుల్కం నాటకంలో అగ్నిహోత్రావధాన్లు. ఇంట్లో ఆడవారికి ఒక్క ముక్కా చెప్పకుండా ఎనిమిదేళ్ల పిల్లని 60యేళ్ళ ముసలాడికి కట్టబెట్టేందుకు వీధరుగు మీదే తాంబూలాలిచ్చేసిన ఘనుడతను. అగ్నిహోత్రావధాన్లు తాంబూలం ఇచ్చేసినంత తేలిక్కాదు, ఒకరాజుగారు కవికో, యోధుడికో, సామంతుడికో తాంబూలం ఇచ్చి గౌరవించటం అంటే! దాని వెనక చాలా తతంగం ఉంటుంది.

రాజు శుచిగా స్నానం చేసి, తాంబూలాధికారి (అడపంగారు)ని పిలిచి తాంబూల ప్రదానానికి సిద్ధం చేయిస్తాడు. మేఘవర్తిపురంలోనూ, ఈశ్వరపురంలోనూ, కారటీపురంలోనూ పండిన వక్కల్ని తెప్పించి, రాజు సమక్షంలో వాటిని ఉడికిస్తారు. వక్కకాయలు కొద్దిగా ఎర్రగా అయ్యేవరకూ ఉడికించి ఆరబెడతారు. మామిడితొడిమ రసం, గంధం పొడి, కర్పూరం కలిపిన నీళ్లలో వీటిని నానబెట్టారు. పైన పొరని చెక్కి, నీడన ఆరబెడతారు. ఏడాదికన్న ఎక్కువ వయసున్న తీగనుండి పెద్దవిగా తెల్లగా లేతవిగా ఉన్న తమలపాకులు తీసుకుని వాటిమీద రాజుగారు నదీజలం చల్లి సంప్రోక్షణం చేస్తాడు.

వివిధ ఆకారాలలో తాంబూలం మడవగల నిపుణుల్ని పిలుస్తారు. ఆకుల తొడిమల్ని కొనల్ని తీసేసి మధ్య ఈనె దగ్గర చీలుస్తారు. శైలోదకం (చన్నీళ్లు)తో తడిపిన మంచి ముత్యాల భస్మాన్ని ఆకులకు రాసి. మామిడివాసన కలిగి మలయాచలంలో పుట్టిన శ్రేష్ఠమైన పచ్చకర్పూరాన్ని, గంధం పొడిని తగుమోతాదులో ఆ ఆకులమీద ఉంచుతారు.

***"కస్తూరీ శశి తక్కోలం జాతీఫల సుచూర్ణకం/***
***ఖదిరక్వాథ చూర్ణంతు కస్తూరీ తక్కోలమిశ్రితం***
***శ్రీఖండ కల్క సంయుక్తం కర్పూర రజసమన్వితం***
***/మేళయిత్వా సమ్యక్ భాగైః గుళికా కల్పితా శుభా"***

కస్తూరి, తక్కోలం, జాజికాయ, కాచు, వీటిని కూడా ఈ ఆకులమీద ఉంచి, అందమైన ఆకృతులలో మడుస్తారు.

తాంబూలాన్ని ఏ హోదా కలిగిన వ్యక్తికి ఇస్తున్నారో ఆ స్వీకర్త హోదాని (ప్రోటోకాల్) బట్టి ఎన్ని ఆకులు వెయ్యాలి, ఎన్ని వక్కలు వెయ్యాలి లాంటి నియమాలుండేవి. దేవాలయ సిబ్బందిలో శుభ్రపరిచే వారికి మంగళ వాద్యకారులకు, పూజారులకు ఇలా ప్రతీ ఒక్కరికీ ఇన్ని ఆకులు, ఇన్ని వక్కలు అని నిర్దేశిస్తూ వ్రాసిన శాసనాలున్నాయి.

వాణిజ్య శ్రేణులవారు తమని ఫలానా నగరాధీశులుగా చెప్పుకునేవారు "తెలికిశ్రేణి అంటే నూనె వ్యాపారుల సంఘం. తాము బెజవాడ ప్రభువులం అనీ, అయోధ్య ఇక్ష్వాకు వంశజులం అనీ ఈ తెలికి వర్గం వారు చెప్పుకున్నారు. 'తెలికి వేవురు చేసిన శాసనము' అంటే వెయ్యిమంది తెలికి శ్రేణి (గిల్డ్ లాంటిది) సభ్యులు చేసిన శాసనాన్ని ప్రభువు కూడా అంగీకరించేవాడు. తెలికి సామాజికవర్గం ప్రముఖులు వెయ్యిమంది చేసిన నిర్ణయం ప్రకారం ఏ రాజైనా సరే, తెలికివారింట వివాహం జరుగుతుంటే రాజు ఆ ఇంటివారిని ఆహ్వానించి తాంబూలం ఇచ్చి గౌరవించి పంపాలనే కట్టడి ఉండేది.



రాజ్యంలో ప్రముఖులకు ఆదరణీయులకు తాంబూల గౌరవాలివ్వటం రాజులకూ ఇష్టమైన విషయమే! వృత్తిపరంగా నిపుణులు (artisans), వ్యాపారుల గిల్డు చేసే సూచనలను తీర్మానాలను ప్రభువు అంగీకరించి, తన సంఘీభావం ప్రకటించేవాడు. ప్రభుత్వాలకు ఇప్పటికన్నా ఎక్కువగానే పౌర సంబంధాలు ఉండేవారోజుల్లో! ''కప్పురపు వీడియంబును కైరవళ్లు నొసగె" కర్పుర తాంబూలం కైరవళ్లు ఇచ్చి గౌరవించేవారట.

**బీడా ఎత్తటం**

బీడా అనేది విడెము (తాంబూలం)కు పర్షియన్ రూపం. హిందీలో "బీడా ఉత్తాన్" అంటే తాంబూలం తీసుకుని కష్టసాధ్యమైన దాన్ని సుసాధ్యం చేస్తానని ప్రతిజ్ఞ చేయటం. దీన్నే తెలుగులో కూడా 'బీడాఎత్తటం' అంటారు. వీర తాంబూలం అని మనవాళ్లు అన్నది దీన్నే! దీన్ని మొఘల్ పాలకులూ అవలంభించారు. సుల్తానులు కూడా పాటించారు. విజయనగర కాలంలో ఇది ప్రధానమైన ఆచారంగా మారింది. దసరా రోజున ఆయుధ పూజ చేసే అలవాటు వెనుక ఈ వీర తాంబూలం పాత్ర ఉంది.

వానల వలన యుద్ధాలకు అనుకూలత తక్కువ కాబట్టి, సైనిక శక్తిని సమృద్ధం చేసుకోవటానికి రాజులకు కావలసిన విరామం వానాకాలంలో ఉంటుంది. వానలు వెనకబడగానే యుద్ధ భేరీ భాంకారాలు మార్మోగుతాయి. విజయదశమి నాడు ఆయుధపూజ చేస్తారు. రాజు తన సైనికబలగాన్ని సమీక్షించుకుంటాడు. తగిన వ్యూహాన్ని రూపొందించుకుని యుద్ధానికి బయల్దేరేందుకు విజయదశమిని ఒక ముహూర్తంగా ఎంచుకుంటాడు. వీరాధివీరులైన సైనికులను సమావేశ పరుస్తాడు. వీర తాంబూలం ఇచ్చి, వారి నుండి విజయం సాధించ గలననే వాగ్దానం తీసుకుంటాడు. ఇదీ 'బిడాఎత్తటం' అంటే!

విజయనగర ప్రభువులు దసరా ఉత్సవాలను నిర్వహించిన తీరు గురించి డొమింగో పేస్, అబ్దుల్ రజాక్ లాంటి యాత్రికులు కొన్ని వివరాలు రాశారు. ఇప్పటి రిపబ్లిక్ డే పెరేడ్ నాడు దేశరక్షణ యంత్రాంగాన్ని ప్రదర్శించినట్టే రాయల కాలంలో సైనిక కవాతులు, ఏనుగులు, గుర్రాలు, మర ఫిరంగులు వగైరా ప్రదర్శించేవారు. మల్లయుద్ధాలు, కత్తి యుద్ధాలు, విలువిద్య ఇతర యుద్ధ విద్యా ప్రదర్శనలు ఈ తొమ్మిది రోజులూ జరిగేవి. ప్రజలు లక్షలాదిగా రాజధానికి తరలివచ్చి వీటిని తిలకించే వారు. రాజభక్తి, శౌర్యము, స్థిరత్వం కలవారిని ఎంచుకొని తాంబూలం ఇచ్చి గౌరవించటం ఈ ఉత్సవాల నిర్వహణ లక్ష్యం.

తంజావూరు పాలకులు తాంబూలం మీద విశేష ప్రయోగాలు చేశారు. దాన్ని లైంగికశక్తిని పెంచే ఒక ఉత్తమ సాధనంగా భావించేవారు. అలా ఉపయోగించుకునేవారు కూడా! బ్రిటిష్ యుగంలోనే తాంబూల సదాచారానికి పొగాకుని చేర్చి తాంబూల గౌరవాన్ని విదేశీ పాలకులు మైలపరిచారు. ఈనాటికి

ఈ పొగాకు ఒక జాడ్యంగా ముదిరిపోయి కొనసాగుతోంది.

**వారాంగనలకు తాంబూల గౌరవం**

“విదేశీ రాయబారులు తమ కొలువుల కేతెంచినపుడు నాటిరాజులు మర్యాదకై వీడ్యము (తాంబూలము) లిచ్చిరి, దమయెదిరికి ప్రియా ప్రియులు మనసులోని మరులను వక్కలాకులతో ఉదెలిపిరి” అని ఆనాటి విదేశీ యాత్రికులు విజయ నగర సామ్రాజ్యంలో తాంబూల గౌరవం గురించి శ్రీ భావరాజు కృష్ణారావుగారు “ఆంధ్రదేశము విదేశీ యాత్రికులు” అనే గ్రంథంలో రాశారు. అబ్దుల్ రజాక్ రాతల్ని ఇలా వివరించారు: రాణివాసపు స్త్రీలు, వారాంగనలే కాదు, సాధారణ పామర స్త్రీలు కూడా “తరుణధావన ధగధగద్దశన మణులయందు లేతవీడ్యములడాలు హత్తుకొల్పి”రని తెనాలి రామకృష్ణుడు పాండురంగ మాహాత్మ్యం(3-74) లో వర్ణించాడు.

**తాంబూలం ప్రోటోకాల్**

తాంబూల గౌరవం మొదటగా గురుత్రయానికి అందజేయాలి. శంకరాచార్యులు, జీర్ణాద్వైతమత పునరుద్ధారకులైన శ్రీ చిదానంద సరస్వతీ స్వామి (లక్ష్మీనారాయణ దీక్షితులనేది పూర్వాశ్రమ నామ ధేయం) ఆ కార్యక్రమాన్ని నడిపించే పురోహితుడు ఈ ముగ్గురుకీ మొదట తాంబూలం ఇవ్వాలి. బంధుయాజనవరులలో పూజ్యులైన ఒకర్ని ఆహ్వానించి వారికి అగ్రతాంబూలం సమర్పించాలి. ఆ తరువాత విద్యాది యోగ్యతానుసారంగా తాంబూలాదులివ్వాలి. “శ్రీ దీక్షితపద్ధతి నియమావళి” అనే గ్రంథంలో ఈ తాంబూలం ప్రోటోకాల్ వివరాలున్నాయి. మదర్పిత చందన తాంబూలాదులు గైకొని అనటం అంటే దానివెనుక ఇంత ప్రోటోకాల్ నిబంధనావళిని పాటిస్తాననే వాగ్దానం ఉంది. పాటించాలి కూడా!

**విశ్వబ్రాహ్మణులకు ప్రథమ తాంబూలార్హత**

“దేవాలయాలకు ‘శంకుస్థాపనలు, యజ్ఞ యాగాదులు, యూపప్రతిష్ఠ, నూతన గృహ ప్రవేశాలు, వివాహోపనయన సమయాలలోనూ, మహాసభల్లోనూ గంధపుష్ప తాంబూల వస్త్రాభరణా లతో బ్రాహ్మణాది చాతుర్వర్ణాలవారికి బహూక రించడం” ఆచారం అని స్వర్ణ సుబ్రహ్మణ్యకవి రాశారు. “విగ్రహాలకు శిల్పి తల్లి అయితే, శాస్త్రం తండ్రి లాంటిదని రూపంలేని శిలా మృణ్మయ దారులోహాదులకు రూపాన్ని కల్పించి వానికి ప్రాణప్రతిష్ఠ, షోడశ కళాన్యాసాలు చేయవలసి ఉంటుందని, ప్రాణప్రతిష్ఠ మంత్రం తర్వాత నమక చమక పురుష సూక్తాలతో అభిషేకం చేసి, భస్మగంధక్షత పుష్ప ధూప దీప నైవేద్య తాంబూల మంత్రపుష్పాది షోడశోపచారాల్ని శిల్పాచార్యులే చేయవలసి ఉంటుంది. కాబట్టి, విశ్వబ్రాహ్మణులకు ప్రథమ తాంబూలార్హత ఉంటుంది” అని రాశారాయన

**తాంబూల బిరుదాంకితుడు**

13వ శతాబ్ది నాటి కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రదేవుని ఆస్థానంలో 20 మంది మహాకవు లుండేవాళ్లట. “మంగళపల్లి భాస్కరుడు” వాళ్లలో ముఖ్యుడు. ఒకరోజు ప్రతాపరుద్రుడు నవరత్నాలు పొదిగిన బంగారు పళ్లెంలో అమూల్యమైన రత్నాభరణాలు, కర్పూర తాంబూలం ఉంచి, నా ఆస్థానంలోని కవులందరిలో గొప్ప కవిత్వం చెప్పినవారికి ఈ పళ్లెంలో నగలుతో సహా కర్పూర తాంబూలం సమర్పిస్తానని ప్రకటించాడని, ఆ పోటీలో తాంబూలాన్ని గెలిచి మంగళపల్లి భాస్కరుడు హుళక్కి భాస్కరుడయ్యాడనీ, కన్నడంలో ‘హుళక్కి’ అంటే తాంబూల గౌరవంతో ఇచ్చే బిరుదని ఒక కథ వ్యాప్తిలో ఉంది.



**“దేవాలయాలకు ‘శంకుస్థాపనలు, యజ్ఞ యాగాదులు, యూపప్రతిష్ఠ, నూతన గృహ ప్రవేశాలు, వివాహోపనయన సమ యాలలోనూ, మహాసభల్లోనూ గంధపుష్ప తాంబూల వస్త్రాభరణా లతో బ్రాహ్మణాది చాతుర్వర్ణాలవారికి బహూకరించడం” ఆచారం అని స్వర్ణ సుబ్రహ్మణ్యకవి రాశారు.**

ఈ కథకు ఆధారాల్లేవు. ‘హుళక్కి భాస్కరుడు’ ‘హుళక్కి భాస్కరుడు’ ఎలా అయ్యాడో తెలీదు. ఉత్తర కన్నడ ప్రాంతంలో ‘హాళక్కి ఒక్కలిగ’ అనే ప్రజలున్నారు. ‘హాళక్కికన్నడ” అనే మాండలికభాష మాట్లాడతారు. వారికీ ఈ తాంబూల బిరుదుకూ సంబంధం లేదు. పైగా కన్నడంలో హుళక్కి, హుళికి, హుళిక్కి, ఉళక్కి అంటే, వట్టిమాట, అబద్ధము అని! తెలుగులోకూడా ఇదే అర్థంలో ఈ మాటని వాడతారు. కాకతీయుల కాలానికి సత్యము, ఉదాత్తమైనదనే అర్థంలో ఈ పదం వాడకంలో ఉండేదేమో తెలీదు. కాలానుక్రమంలో కొన్ని పదాలు అర్థవిపర్యయం చెందటం సహజం. హుళక్కి అలాంటిది కావచ్చు. తెలుగులో తొలి రామాయణ అనువాదం భాస్కర రామాయణ అవతరణకు




కళారత్న డా॥ జి.వి. పూర్ణచందు
9440172642


కారకుడు, ప్రేరకుడు అయిన ఈ భాస్కర మహాకవికి తెలుగు హుళక్కి బిరుదు తాంబూలంతో ముడిపడి వచ్చింది!!

**రాయలకాలం నాటి రెస్టారెంట్లు**

కందుకూరి రుద్రకవి 1480-1560 నాటి కవి. కృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజ కవులలో ఒకడని చెప్తారు. జనార్దనాష్టకం, నిరంకుశో పాఖ్యానం, సుగ్రీవవిజయం యక్షగానం ఈయన రచనల్లో ముఖ్యమైనవి. ఈనాటి ప్రకాశంజిల్లా, కందుకూరుకు చెందినవాడు.

‘నిరంకుశుడనే ఓ బ్రాహ్మణ యువకుడు రాత్రిపూట వేశ్యావీధుల్లో తిరుగాడుతున్న వైనాన్ని తన నిరంకుశోపాఖ్యాన కావ్యంలో ఇలా వర్ణించాడాయన: ***“మీర ఘనసార తాంబూల సారప్రవాహవహగంధ వాహప్రదోహ మోహ/వశవిశా లేక్షణా జనస్యాంతుడగుచు, రాత్రుల జరించు చుండునా బ్రాహ్మణుండు”*** అని!

నిజానికి 500 యేళ్లనాటి ఈ వర్ణన చూస్తే ఇప్పటి కుర్రాళ్లను చూసి వర్ణించాడా అనిపిస్తుంది. మనం ఏదో నాగరికులమని మన పూర్వులంతా పాత చింతకాయ పచ్చడి, వాళ్లకేమీ తెలీదని అనుకుంటూ ఉంటారు కదా… కానీ ఈ నిరంకుశుడి వేషం ఇప్పటి వాళ్లని మించిపోయింది. కర్పూరపు తాంబూలం సువాసన సన్నగాలి మొలకలతో కూడి సోకుటవలన కామినులు మోహపరవశు లౌతుండగా రాత్రిళ్లు తిరుగుతున్నాడట.

మెడలో ఒంటిపొర రుమాలు వేసుకున్నాడట. చల్లడ అంటే, సగం తొడలదాకా తొడిగిన గుడిగి (కురుచలాగు-షార్ట్ లంటూన్నాం వాటిని ఇప్పటి రోజుల్లో) తొడుక్కుని వీధుల్లో సంచారిస్తున్నాడట నిరంకుశుడు. మెడలో కాలర్ కింద ఎఱ్ఱ జేబురుమాల, షార్టులు వేసుకుని రోడ్లమీద తిరగటం ఏ అమెరికా వాణ్ణో చూసి మనవాళ్లు చెయ్యలేదు. మనవాళ్లని చూసే పోర్చుగీసులు, ఫ్రెంచివాళ్లూ ఇలాంటివి నేర్చారు. అద్దె చెల్లిస్తే పడక వసతులు, పడక సౌఖ్యాన్నిచ్చే పడతులు, భోజన హోటళ్లు, మసాజ్ సెంటర్లు ఒకటేమిటీ అన్నీ దొరికే అక్కవాడలు రాయల యుగంలో రాజధాని నగరంలో ఉండేవి.

**(సశేషం)**

కథ

# ఓదార్పు

బి.నర్సన్

శాంతి భర్త చనిపోయాడు. పిడుగులాంటి వార్త, సురేష్ ఫోన్లో చెప్పింది విన్నాక ఆఫీసులో పనేం చేయలేకపోయాడు శేఖర్. ముసురుకున్న విషాదపు చీకట్లలోంచి దారి వెతుక్కుంటూ ఇంటికి చేరుకున్నాడు. ఇంట్లో ఈ బాధను ఎవరితోనూ పంచుకోలేదు. పిల్లలు స్కూల్ నుంచి వచ్చి హోమ్ వర్క్ మీద పడ్డారు. టీ ఇచ్చిన భార్య విమల తీరిగ్గా టీవీ ముందు కూచుంది. మనసంతా గందరగోళంగా ఉంది. ఇంట్లో ఉండలేక బాల్కనీలోకి వచ్చి కిందికి చూస్తున్నాడు. వాహనాల రణగొణ శబ్దాలు కలతను మరింత పెంచుతున్నాయి. లోనకెళ్లి డ్రెస్ వేసుకొని బయటపడుతుండగా విమల చూసింది. ఎప్పుడూ చెప్పకుండా వెళ్లని మనిషికిప్పుడేమైంది అనుకుంటూ 'ఎక్కడికండీ?' అంది.

'ఇప్పుడే వస్తాను' అని పొడి పొడి మాటలంటూ గడప దాటాడు.

ఇంటికి కొద్ది దూరంలో ఉన్న మునిసిపల్ పార్కులో కూచొని 'ఎంత ఘోరం జరిగిపోయిందీ..' అనుకుంటూ తల పట్టుకున్నాడు. శేఖర్ అక్కయ్య పేరు మాలతి. ఆమె భర్త అన్న కూతురే శాంతి. వరుసకు కూతురే అయినా శాంతికి మాలతి దగ్గర అంతకన్నా ఎక్కువ చనువు. తల్లి ఎంత చేసినా శేఖర్‌కు అక్కయ్య, బావలే అసలు బలం. తండ్రి నీడలేని శేఖర్‌ను మాలతి భర్త సొంత తమ్ముడిలా చేరదీసి చదివించాడు. శేఖర్‌ను చదువుకొనే రోజుల్లో వాళ్లు అన్ని విధాలా ఆదుకోకపోతే తను ఇలా ఉద్యోగంలో ఉండడం సాధ్యపడేది కాదు. ఇంత అనుబంధమున్నా శాంతి భర్త చనిపోయాడని మాలతి శేఖర్‌కు చెప్పలేదు. చనిపోయి అప్పటికే నాలుగు రోజులైందన్నాడు సురేష్. జేబులోంచి ఫోన్ తీసి మాలతి నెంబరుకు కలిపాడు. రింగవుతున్నా అటువైపు ఫోను ఎత్తలేదు. రెండో ప్రయత్నం ఫలించింది.

'అక్కయ్యా..శాంతి భర్త చనిపోయాడా..'

'ఊ...'

'నాల్రోజులయిందట.. నాకొక్కమాట చెప్పలేదు..'

'ఏం చెప్పాలిరా.. నీవే దాని బతుకు నాశనం చేశావని శవం ముందే నిన్ను శాపనార్థాలు పెడుతూ శోకం పెట్టిందది. నీ వల్ల నలుగురిలో మా పరువు పోయింది..' అని, మరింత నిష్ఠురంగా మాట్లాడుతూనే ఫోను మధ్యలోనే కట్ చేసింది.

మళ్లీ ఫోను కలపడానికి శేఖర్‌కు మనసొప్పలేదు.

అంతా తనవల్లే అన్న మాటలు ఆయన్ని దహించి వేస్తున్నాయి. గట్టిగా అరవడమో, ఏడవడమో చేస్తేగాని ఆ మంట చల్లారదు. అరిచేందుకు, ఏడ్చేందుకు ఆయనకు తగిన స్థావరమే లేదు. విమలకు చెబితే దీనికింత బాధపడడమేమిటని అనుకుంటుంది. ఇక్కడ కూచొని అంత బాధ పడేకన్నా ఓసారి వెళ్లి కలిసి రావచ్చు కదా అని సలహా ఇవ్వొచ్చు. ఆమెకు ఈ విషయం తెలియద్దు అనుకుంటూ చీకటి పడే దాక తడుస్తున్న కళ్లను తుడుచుకుంటూ అక్కడే కూచున్నాడు.

శాంతి తనను కోరుకుంది నిజమే కాని ఆనాడు శేఖర్‌కు జీవితంపై ఉన్న భయంతో అడుగు ముందుకు పడలేదు. అలా ఆమెతో కలిసి ఏడడుగులు వేయలేకపోయాడు. తనకు శాంతి అంటే ఇష్టమో కాదో అనే ప్రశ్నకు అవకాశమే లేని రోజుల్లో ఆమె మాత్రం ఇంటర్ చదివే నాటి నుండే 'నేను శేఖర్ మామయ్యనే పెళ్లి చేసుకుంటాను' అని సిగ్గులొలకబోస్తూ తుర్రుమనేది. ఏదో తుంటరి పిల్ల అనుకునేవాళ్లు. శేఖర్ అక్క మాలతితో ఆమెకున్న అనుబంధంతో మా పెళ్లి అయితీరుతుంది అన్న భరోసా కూడా ఆ మాట వెనుక ఉండొచ్చు.

చిన్నప్పుడే తండ్రి చనిపోయినా తల్లి ఎంతో కష్టపడి శేఖర్‌ను చదివించింది. డిగ్రీ చివరి సంవత్సరంలో ఉన్న ఆయన చదువు ఎప్పుడైపోతుందా.. ఉద్యోగం సంపాదించి తల్లికి విశ్రాంతిని ఎప్పుడిస్తానా అని ఆరాటపడుతున్నాడు. తెలిసిన వారి సలహా తీసుకుంటూ కనబడ్డ ఉద్యోగానికల్లా తనవంతు ప్రయత్నం చేస్తున్నాడు. అప్పుడే ఇంకా రూపం దాల్చని ఆశల వెంట శేఖర్ పరుగుతీస్తున్న కీలక సమయంలో అక్కా బావలు తెచ్చిన పెళ్లి ప్రస్తావన తన ముందు పెద్ద పర్వతం అడ్డు నిలిచినట్లనిపించింది.

ఓ రోజు శేఖర్ అక్క, బావ ఇద్దరు ఇంటికొచ్చారు. మామూలుగానైతే మాలతి ఒంటరిగానే వస్తుంది.


భోజనాలయ్యాక తల్లీ కొడుకులను ఉద్దేశించి 'శాంతి పెళ్లి చేద్దామంటున్నాడు మా అన్నయ్య..' అన్నాడు మాలతి భర్త.


శేఖర్ తల్లి ముఖం చూశాడు. ఏమీ తెలియదన్నట్లు ఆమె ముఖం పెట్టింది.

నువ్వంటే నువ్వు మాట్లాడమని ఇద్దరి మధ్య చూపుల తోపులాట.

ఆ ఒత్తిడి తట్టుకోలేక 'చేయండి..' అన్నాడు శేఖర్.

ఆ మాటకు తలెత్తి శేఖర్ వైపు చూస్తూ 'శాంతి చిన్నప్పటినుంచి నిన్నే తన మొగుడిగా అనుకుంటోంది. అది నీకు, నాకు అందరికి తెలిసిందే.. మీకు చెప్పి పెళ్లి పనులు మొదలు పెట్టుకుందామని..' అని ఆగాడాయన ఇదీ వచ్చిన కార్యమన్నట్లు.



శేఖర్ గొంతు తడారిపోయింది.

మెల్లగా ఒక్కొక్క అక్షరం బయటపెడుతున్నట్లు 'నాకిప్పుడు పెళ్లి చేసుకోవాలని లేదు.. చదువయిపోయింది.. ముందు బతకడానికి ఓ ఉద్యోగం సంపాదించుకోవాలి' అన్నాడు.

శేఖర్ తన మాట కాదంటాడా.. ఇలా వెళ్లి ఖాయం చేసుకొని అలా వచ్చేయడమే అనుకున్న వాళ్లకు ఈ మాట మింగుడుపడలేదు.

'అట్లా గాలిమాట మాట్లాడితే ఎట్లా.. శాంతి తర్వాత అన్నయ్యకు ఇంకో ఇద్దరమ్మాయిలున్నారు.. ఆయన తొందరపడుతున్నాడు..శాంతి భారం నీదేరా' అంటూ మాట బిగించాడు ఇంటల్లుడు.

శాంతి, శేఖర్ల పెళ్లి వల్ల దగ్గరి అమ్మాయి తన పుట్టినింటికి వస్తుంది. మెట్టినింట్లో తన గౌరవం పెరుగుతుంది.. ఇది మాలతి ఆశ.

కొడుకు మాటల్లో వాస్తవముంది గాని కూతురు, అల్లుడి మనసుల్ని బాధపెట్టడం ఇష్టం లేదు ఆ తల్లికి. అన్ని తెలిసిన శేఖర్ మాట్లాడుతుంటే తానెలా కల్పించుకోవాలో తెలియడం లేదావిడకు.

ఇంత మౌనభారం మోయలేనన్నట్లు గాలి ఉక్కిరిబిక్కిరి అవుతోంది.

తానే మాట్లాడాలి అనుకున్న శేఖర్ నోరు విప్పి 'ఎంత కాలమైనా ఉద్యోగం వచ్చాకే పెళ్లి చేసుకోవాలని ఏనాడో అనుకున్నాను. అమ్మనే పోషించలేని స్థితిలో ఉన్న నేను మరో మనిషితో అమ్మకెలా మరింత భారం కావాలి.' అని కొంత కచ్చితంగా..కొంత ప్రాధేయపూర్వకంగా అన్నాడు.

'పెళ్లి చేసుకొని నీ ప్రయత్నం నువ్వు చేసుకో.. నీ మీద ఏ ఖర్చు పడకుండా మేం చూసుకుంటాం' అంది మాలతి, భర్త వైపు తన మాట ఎలా వుంది అన్నట్లు చూస్తూ.

అక్క మాట అన్నంత తేలికగా వ్యవహారముండదు. ఎన్ని సార్లని, ఎంత కాలమని వారి ముందు చేయి చాచాలి.. భార్య ముందు తనకేమైనా పరువు ఉంటుందా.. వారి హామీ వంద అబద్ధాల్లో ఒకటి కాకూడదనే గ్యారెంటీ ఏమిటి.. ఇలా సాగుతోంది శేఖర్ ఆలోచన.

ఎంత ఎదురుచూసినా శేఖర్ నుండి ఎలాంటి బదులు రాలేదు.

విసిగిపోయిన మాలతి తల్లి వైపు తిరిగి 'వాడి మాటనే నీ మాటనా.. మాట్లాడవేంది..' అంది విసుగ్గా.

కూతురు, అల్లుడిని బాధ పెట్టాలని లేదావిడకు.

'మన పిల్లనే కదరా.. నాతో పాటు ఉంటుంది..



నీకు ఉద్యోగం వచ్చేదాకా రూపాయి కూడా అడగను' అంది కొడుకుతో ఒప్పుకోరా అన్నట్లు.

తల్లిపై పడే భారం శేఖర్‌కు తెలుసు. బంధుత్వం చెడుతుందని భయంతో అంటుంది కాని.. మూడో మనిషికి ఇంట్లో చోటే లేదిప్పుడు. కొద్దిగా సడలినా జీవితం చేతికందకుండా పోతుంది.. ఇదీ శేఖర్ మనసు చెబుతున్న మాట.

'ఉద్యోగం రానీయమ్మా.. శాంతినే చేసుకుంటాను' అన్నాడు తల్లితో, అందరికి అదే మాట అన్నట్లు.

'ఏడాదో, రెండేళ్లో కచ్చితమైన టైం చెబితే మాటకర్థం ఉంటుంది కాని ఇదేం తిక్క సమాధానంరా..' అంది మాలతి. కాస్త అధికారంగా, కాస్త బేలగా ఉంది ఆమె మాట.

పొట్టి లాగులతో చుట్టూ తిరిగిన పిల్లాడు తన మాటని ఖాతరు చేయకపోవడం తల తీసేసినట్లుంది మాలతి భర్తకు. ఇంకొక్క క్షణం కూడా వారి ముందు ఉండబుద్ధి కాలేదాయనకు.

'ఈయన్ని నమ్ముకుంటే నడిగంగలో ముంచాడు. మీ తమ్ముడు కాదంటే పెళ్లి జరగదా.. ఇంకా సంబంధాలే లేవా..' అంటూ సరసర ఇంట్లోంచి బయటికి నడిచాడు. గబగబ వెనకాలే వెళ్లింది మాలతి.

శేఖర్ మాటలకు నొచ్చుకోవడమే కాకుండా పెళ్లి చేసి చూపిస్తాం అన్నట్లు నెల రోజుల్లోనే శాంతి పెళ్లి జరిపించారు. శేఖర్ ఇంటికి పోస్టులో పెళ్లి పత్రిక వచ్చినా మొహం చెల్లక పోలేకపోయారు. తన నిర్ణయం శాంతిని ఎంత క్షోభ పెట్టిందో అని అనుకున్నప్పుడల్లా శేఖర్ మనసు బరువెక్కేది. జీవితంలో తనను క్షమించదని బాధ కలిగేది.

రెండేళ్ల విశ్వ ప్రయత్నం తర్వాత శేఖర్‌కు ఓ ఆఫీసు అసిస్టెంట్ ఉద్యోగం చేతికొచ్చింది. పెళ్లి సంబంధాలు రావడంతో ఒకదాన్ని ఖాయం చేసుకున్నారు. తల్లితో కలిసి శేఖర్.. అక్కబావల దగ్గరికెళ్లి వారి కాళ్లకు దండం పెట్టి మొదటి ఆహ్వాన పత్రిక చేతిలో పెట్టాడు. అన్నీ మరిచిపోయి వాళ్లు ఇంటి పెద్దలుగా దగ్గరుండి పెళ్లి జరిపించారు.

అప్పుడప్పుడు బంధువుల ఫంక్షన్లలో శాంతి శేఖర్ కంట పడేది, కాని ఆయన వైపు చూసేది కాదు. వెంట ఓ పిల్లాడు ఉండేవాడు కాని భర్త కనబడేవాడు కాదు. కాంట్రాక్టర్ దగ్గర లెక్కలు చూసుకుంటాడట. తీరిక దొరకదని తెలిసింది. చివరకు ఆయన శేఖర్ కంటపడకుండానే కన్ను మూశాడు.

చనిపోయిన వార్త తెలిసి రెండు రోజులయింది. ఊర్లో ఉన్న తల్లికి ఫోన్ చేసి చెబితే అంతా మరిచిపోయినట్లు 'ఎవరి కర్మకు ఎవరు బాధ్యులు' అంటూ తేలిగ్గా మాట్లాడింది. శేఖర్‌కు మాత్రం జరగాల్సింది జరిగిపోయింది అనుకునేలా మనసు స్థిమితపడడం లేదు. విషాదవార్త చెప్పిన సురేష్‌కు ఫోన్ కలిపాడు.

'చెప్పరా..' అన్నాడాయన మాములు ధోరణిలో.

వెంటనే చెప్పలేక కొద్దిసేపాగి 'నాకు శాంతిని కలవాలనుంది' అన్నాడు. 'అసలు ఈ పరిస్థితిలో ఆమె నీ ముఖం చూస్తుందా..'

'ఏదో నువ్వే ఓ దారి చూడరా..'

'సరే.. సాయంత్రం ఫోన్ చేస్తా..' అని ఫోన్ పెట్టేశాడు సురేష్.

ఇంట్లో టీపాయ్ మీదున్న ఫోన్ రింగయ్యింది. తాగుతున్న టీ కప్పు పక్కన పెట్టి ఫోన్ తీసుకొని గబగబా బాల్కనీలోకి వెళ్లాడు.

'ఆయనగారి ఓదార్పు తనకక్కర లేదందిరా..' అని ఒకే వాక్యం చెప్పాడు సురేష్.

లోపలికొచ్చి సోఫాలో వెనక్కి ఒరిగి కళ్లు మూసుకున్నాడు.

ఇంట్లో ఒకరి శీతోష్ణస్థితులు ఇంకొకరికి తెలియకుండా దాయడం కష్టం. అది భార్యాభర్తల మధ్యనయితే అసాధ్యమే. భర్త వింత వాలకం విమల గమనిస్తూనే ఉంది. ఎక్కడికండీ అన్నప్పుడు ఇప్పుడే వస్తా అని విషయం చెప్పకుండా బయటికి వెళ్లినప్పుడే ఏదో జరగరానిది జరిగిందని ఆమె గ్రహించింది. ఫోను మాట్లాడాక సగంలో వదలిన టీ కప్పును మరచి సోఫాలో వాలిపోవడం ఆమెను ఆందోళనకు గురిచేస్తోంది. ఆఫీసులో ఏమైనా తప్పు జరిగిందేమో అనే వైపు పోయిందామె మనసు. 'రెండ్రోజులుగా గాబరా గాబరాగా ఉంటున్నారు.. ఏం జరిగింది..' అని అడిగింది బెడ్ రూములో.

ఏం లేదన్నట్లు తల ఊపాడు.

'లేదు..ఏదో జరిగింది..ఆఫీసులో ఏమైనా..'

'ఛీ..అలాంటిదేమి లేదు..' అని ఆమె మాటను ఆపేశాడు.

మధ్యలో విమల ఏదేదో ఊహించుకోవడంతో కొత్త సమస్యలు తెచ్చుకున్నట్లు అనిపించింది ఆయనకు.

అబద్ధాలు చెప్పేకన్నా నిజం చెప్పడమే మేలు అనుకొని శాంతి వృత్తాంతమంతా విమలకు చెప్పేశాడు.

ఇప్పుడు సమస్యలో విమల మూడో కేంద్రమైంది. తానూ ఆలోచనలో పడింది. శాంతి విషయంలో ఆయన బాధపడడంలో తప్పేమీ కనబడలేదు. అయితే అది పెరిగి పెద్దదై తన కుటుంబంపై ప్రభావం పడవచ్చనే బెంగ ఆమెలో మొదలైంది. కాలం తనను శాంతి స్థానంలో కూచోబెట్టిందని, ఆమె కష్టాలను చూస్తూ కూచోవద్దని విమలకు అనిపించింది.

శాంతిని ఊరడించాలని కోరుకుంటున్న భర్త తొందరపడి ఏం చేసినా నలుగురిలో తప్పే అవుతుంది. అటు ఆమెను మరింత ఇబ్బందుల్లోకి తోసిన వారమవుతాము. తమ ముగ్గురి అవసరమొక్కటే శాంతి జీవితం శాంతంగా సాగాలనే. దీనికి తానే ఓ దారి వెతకాలని ఆలోచిస్తున్న విమలకు తన మామయ్య సుకుమార్ గుర్తుకొచ్చాడు. నిజానికి విమల భర్తగా ఆయన్నే కోరుకుంది. అయితే ఆయన ఓ బీమా కంపెనీలో పనిచేస్తూ సంఘాలు, సమ్మెలు అంటూ అరెస్టులు, కేసుల మధ్య బతికేవాడు. సజావుగా ఉద్యోగం చేసుకుంటేనే మా అమ్మాయి నిస్తామని విమల తండ్రి కరాఖండీగా చెప్పాడు. ససేమిరా వాటిని వీడనంటూ సుకుమార్ కూడా అదే స్థాయిలో బదులిచ్చాడు. అలా విమల శేఖర్ ఇంటిదయింది.

పెళ్లీడు దాటిన సుకుమార్ ఈ మధ్య 'ఎవరినైనా చూడవే.. విడో అయినా ఫర్వాలేదు... చేసుకుంటాను' అంటూ విమలను అడుగుతున్నాడు. కాలం చల్లబడ్డాక ఒక్కో అడుగు వేయచ్చు అనుకుంది.

టిఫిన్ వడ్డిస్తూ భర్తతో 'ఎల్లుండి ఆదివారం.. శాంతి దగ్గరికి వెళ్దామా..' అంది.

'నా ఓదార్పు వద్దని అంత కచ్చితంగా చెప్పాక..' ఎలా వెళ్లేది అన్నట్లు ముఖం పెట్టాడు.

'రెండు చేతులతో కాదండీ.. నాలుగు చేతులతో ఓదార్చుదాం.. సరిపోకుంటే ఇంకో రెండు చేతులు జోడిద్దాం' అంది. 'థాంక్యూ సో మచ్.. విమలా..' అంటూ తింటున్న చేతులతో ఆమె చేతులనందుకున్నాడు. ★



రెండేళ్ల విశ్వ ప్రయత్నం తర్వాత శేఖర్‌కు ఓ ఆఫీసు అసిస్టెంట్ ఉద్యోగం చేతికొచ్చింది. పెళ్లి సంబంధాలు రావడంతో ఒకదాన్ని ఖాయం చేసుకున్నారు. తల్లితో కలిసి శేఖర్.. అక్కబావల దగ్గరికెళ్లి వారి కాళ్లకు దండం పెట్టి మొదటి ఆహ్వాన పత్రిక చేతిలో పెట్టాడు. అన్నీ మరిచిపోయి వాళ్లు ఇంటి పెద్దలుగా దగ్గరుండి పెళ్లి జరిపించారు.



దశాబ్దాల చరిత్ర కలిగిన క్రీడ బ్యాడ్మింటన్‌లో ఓ అపూర్వ, అసాధారణ విజయం నమోదయింది. ప్రపంచ బ్యాడ్మింటన్ పురుషుల టీమ్ విజేతలకు ఇచ్చే థామస్ కప్ గెలుచుకోవాలన్న భారత బంగారు కల ఎట్టకేలకు సాకారమైంది. బ్యాంకాక్ వేదికగా ముగిసిన 2022 థామస్ కప్ టోర్నీ ఫైనల్లో 14 సార్లు విన్నర్ ఇండోనేషియాను 3-0తో చిత్తు చేయడం ద్వారా భారత జట్టు బ్యాడ్మింటన్ ఎవరెస్టును అధిరోహించగలిగింది.

# భారత బ్యాడ్మింటన్ కల నిజమాయెగా!

బ్యాడ్మింటన్ సింగిల్స్ లేదా డబుల్స్ విభాగాలలో విశ్వవిజేతలుగా నిలవాలంటే వ్యక్తిగతంగా ఒకరు లేదా ఇద్దరు క్రీడాకారులు ప్రతిభావంతులైతే చాలు. అదే.. మూడు సింగిల్స్, రెండు డబుల్స్ పోటీలతో సాగే టీమ్ విభాగంలో బంగారు పతకం నెగ్గాలన్నా, విశ్వవిజేత జట్టుగా నిలవాలన్నా జట్టులోని ప్రధాన క్రీడాకారులంతా బలంగా ఉండితీరాలి. అలాంటి శక్తిమంతమైన జట్టు కోసం, థామస్ కప్ ట్రోఫీ అపురూప విజయం కోసం భారత బ్యాడ్మింటన్ సంఘం గత 73 సంవత్సరాలుగా నిరీక్షించాల్సి వచ్చింది. భారత బ్యాడ్మింటన్ అసాధారణ క్రీడాకారులు ప్రకాశ్ పడుకోన్ (1980 ఆల్-ఇంగ్లండ్ విజేత), పుల్లెల గోపీచంద్ (2000 ఆల్ ఇంగ్లండ్ విన్నర్) లాంటి దిగ్గజాలకు దక్కని గౌరవం, ఘనత తెలుగు తేజాలు కిదాంబి శ్రీకాంత్, డబుల్స్ స్పెషలిస్ట్ సాత్విక్ సాయిరాజ్, రిజర్వ్ ఆటగాళ్లు పంజాల విష్ణువర్ధన్ గౌడ్ (తెలంగాణ), గారగ కృష్ణప్రసాద్ (ఆంధ్రప్రదేశ్)కు లభించాయి.

1949 నుంచి అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య నిర్వహిస్తూ వస్తున్న థామస్ కప్ టోర్నీలో భారతజట్లు పాల్గొనటం, ఒకటి లేదా రెండు విజయాల తరువాత గ్రూపుదశ నుంచే నిష్క్రమించడం ఆనవాయితీగా వస్తోంది. పైగా థామస్ కప్ అనగానే 14 సార్లు విజేత ఇండోనేషియా, మాజీ చాంపియన్లు మలేసియా, డెన్మార్క్, చైనా జట్ల తిరుగులేని ఆధిపత్యమే గుర్తుకు వస్తుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత 2022 టోర్నీకి భారతజట్టును ప్రకటించిన సమయంలో ఏదో ఒక పతకంతో తిరిగి వస్తామన్న ఆశ, అంచనాలు కూడా లేవు. గ్రూప్ 'సి' లీగ్ పోరులో భారతజట్టు తొలి రెండు లీగ్ మ్యాచ్‌ల్లో జర్మనీ, కెనడా జట్లపై 5-0 విజయాలతో క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది. లీగ్ ఆఖరి రౌండ్ మ్యాచ్‌లో చైనీస్ తైపీ చేతిలో 2-3తో భారత్ ఓడినా గ్రూప్ 'సి' రన్నరప్‌గా సెమీస్‌లో చోటు కోసం పోటీకి దిగింది. క్వార్టర్ ఫైనల్ సమరంలో ఐదుసార్లు చాంపియన్ మలేసియాపై భారత్ 3-2తో గెలిచింది. 1979 తర్వాత తొలిసారిగా సెమీఫైనల్లోకి ప్రవేశించడం ద్వారా ఏదో ఒక పతకం ఖాయం చేసుకోగలిగింది. తొలిసారిగా ఫైనల్‌కు అర్హత సాధించింది.

బంగారు పతకం పోరులో 14సార్లు విజేత ఇండోనేసియాతో తలపడిన భారత జట్టు ప్రారంభ సింగిల్స్, డబుల్స్‌లో సంచలన విజయాలతో శుభారంభం చేసింది. తొలి సింగిల్స్‌లో యువ ఆటగాడు లక్ష్యసేన్, డబుల్స్ హోరాహోరీ సమరంలో సాత్విక్-చిరాగ్ జోడీ 18-21, 23-21, 21-19తో సంచలన విజయాలు నమోదు చేయడంతో భారత్ 2-0తో పైచేయి సాధించింది. నిర్ణయాత్మక రెండో సింగిల్స్ సమరంలో తెలుగుతేజం కిదాంబి శ్రీకాంత్ 21-15, 23-21తో ఇండోనేసియా ఆటగాడు జోనాథన్ క్రిస్టీని ఓడించడం ద్వారా తనజట్టును థామస్ కప్ విజేతగా నిలపడంతో పాటు బంగారు పతకం అందుకోడంలో ప్రధానపాత్ర వహించాడు.

1949లో ప్రారంభమైన ఈ ప్రతిష్ఠాత్మక థామస్ కప్‌లో భారత్ ఫైనల్ చేరడం, బంగారు పతకం గెలుచుకోడం ఇదే మొదటిసారి. మహిళల టీమ్ (ఉబర్ కప్) విభాగంలో భారత్ 2014, 2016 టోర్నీలలో కాంస్య పతకాలు సాధించడమే ఇప్పటి వరకూ గొప్ప విజయాలుగా ఉన్నాయి. థామస్ కప్‌ను నెగ్గడం ద్వారా ఉబర్ కప్ విజయాలను భారత పురుషుల జట్టు అధిగమించగలిగింది.

**భారత జట్టుకు ప్రధాని హ్యాట్సాఫ్!**

థామస్ కప్ టోర్నీలో స్వర్ణ విజేతగా నిలిచిన భారత జట్టుపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. జట్టు సభ్యులతో ప్రధాని మోదీ స్వయంగా ఫోన్‌లో మాట్లాడి ప్రత్యేకంగా అభినందించారు. స్వదేశానికి తిరిగి వచ్చిన వెంటనే తన నివాసానికి రావాలంటూ ఆహ్వానించారు. 'భారత బ్యాడ్మింటన్ జట్టు చరిత్ర సృష్టించింది. థామస్ కప్ గెలుపుపై దేశమంతా హర్షిస్తోంది. మన జట్టుకు అభినందనలు. భవిష్యత్తులో వారు మరిన్ని విజయాలు సాధించాలి. ఈ గెలుపు వర్ధమాన ఆటగాళ్లకు స్ఫూర్తినందిస్తుంది' అని మోదీ ట్వీట్ చేశారు.

**2 కోట్ల రూపాయల నజరానా!**

థామస్ కప్ తొలిసారిగా నెగ్గిన భారత జట్టుకు కేంద్ర క్రీడామంత్రిత్వశాఖ, భారత బ్యాడ్మింటన్ సమాఖ్య చెరో కోటి రూపాయలు నజరానాగా ప్రకటించాయి. భారత్ తరఫున ప్రాతినిథ్యం వహించిన మొత్తం 10 మంది సభ్యులు ఈ మొత్తాన్ని పంచుకోనున్నారు. భారత బ్యాడ్మింటన్ శిక్షకుడు విమల్ కుమార్ మాటల్లో చెప్పాలంటే, 1983 క్రికెట్ ప్రపంచ కప్‌లో కపిల్ దేవ్ నాయకత్వంలోని భారతజట్టు సాధించిన విజయం ఎలాంటిదో 2022 థామస్ కప్ టోర్నీలో భారత బ్యాడ్మింటన్ జట్టు సాధించిన విజయం అలాంటిదే. భారత బ్యాడ్మింటన్ చరిత్రలో ప్రకాశ్, గోపీచంద్, సైనా, సింధు సాధించిన గొప్ప గొప్ప విజయాల సరసన.. టీమ్ విభాగంలో పురుషుల జట్టు సాధించిన ప్రపంచ టైటిల్‌గా థామస్ కప్ నిలిచిపోతుంది. ★




క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

**ఆర్.ఎస్.ఎస్. తెలంగాణ ప్రాంత పూర్వ సంఘచాలక్ ప్యాటా వెంకటేశ్వరరావు సంస్మరణ సభ మే 12 సాయంత్రం 6 గంటలకు భాగ్యనగర్‌లోని కె.ఎమ్.ఐ.టి.లో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన వక్తలు ప్యాటాజీతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సంఘ కార్యం పట్ల ఆయన నిబద్ధతను కొనియాడారు. అందరూ ఆయ నను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. (ప్యాటా వెంకటేశ్వరరావు గారు మే 3న స్వర్గస్థులైనారు)**


వేదికపైన అతిథులు

# ప్యాటాజీకి మరణం లేదు!


*భాగయ్య, అఖిల భారత కార్యకారిణి సదస్యులు*



‘సిద్ధాంతం, ఆదర్శం అమరమైనవి. ఆ ఆదర్శాన్ని ఎవరైతే ప్రత్యక్షంగా ఆచరిస్తారో వారి జీవితం భావితరాలకు ప్రేరణనిస్తుంది. ఒక స్వయంసేవక్‌గా ఎలా జీవించాలో అలా జీవించి చూపించారు ప్యాటా వెంకటేశ్వరరావు. వారి శరీరానికి మరణం ఉన్నది, కాని వారికి మరణంలేదు. వారు ఆచరించిన సుగుణాల వలన వారి జీవితం మనకు ఎంతో ప్రేరణ నిస్తుంది. మరణానంతరం రోజులు గడుస్తున్న కొద్దీ కొందరిని మరచిపోతాం. కానీ ఆయన జీవితం అలాంటిది కాదు. డా. బి.ఆర్. అంబేడ్కర్ వలెనే ప్యాటాజీ కూడా పేద కుటుంబంలో జన్మించి కష్టపడి పైకి రావడమే కాదు, ఉన్నత ప్రమాణాలు సాధించారు. వీరి కుటుంబంలో అందరూ పరిశ్రమించి ఉన్నత ప్రమాణాలతో జీవించారు. ఈ పరంపర తర్వాత తరంలో కూడా కొనసాగుతూ ఉండడం విశేషం.

మేమిద్దరం సంఘంలో శాఖ కార్యకర్తలుగా సమకాలికులం. వారి కర్తృత్వశక్తి, పరిశ్రమతోపాటు సంఘం పట్ల సంపూర్ణ భక్తి, శ్రద్ధ, సమర్పణ భావం వల్ల సంఘ బాధ్యతల్లో అంచలంచెలుగా ఎదిగారు. అయితే ఇలాంటపుడు ఎక్కడో కొద్దిపాటి అహంకారం ప్రవేశించవచ్చు. కాని వీరు ఏ కోశాన అహంకారాన్ని దరిచేరనీయలేదు. ప్యాటాజీ సంగీత ప్రియులు. మధురమైన కంఠంతోబాటు హార్మోనియం, తబలా మొదలైన విద్యలన్నిటినీ స్వర్గీయ యాదవరావుజీ వలె సంఘానికి, సమాజానికి సమర్పించారు. సంగీతం ద్వారా వారు పేరు ప్రతిష్ఠలను ఎన్నడూ కోరుకోలేదు. ఇదే వారి జీవితానికి సార్థకత చేకూర్చి పెట్టింది. స్వయంసేవకుల ఇళ్లకెళ్లి సంఘ పాటలు నేర్పించారంటే దాని అర్థం పాటతోపాటు సంఘాన్ని కూడా నేర్పించారు. ఆ పని మీద ఇళ్లకు వెళ్లాలంటే ఎంత నిస్వార్థం ఉండాలి. ఓపికగా ఎన్నిసార్లు వెళ్లాలి. కాని వారు ఆచరించి చూపించారు. విద్యార్థి దశ పూర్తై ఉద్యోగంలో చేరినపుడు, ఆ తర్వాత వివాహమైనపుడు.. ఈ కాలంలో పనిలో కొంత మార్పు వస్తుంది. కానీ ఈ అన్ని దశలలో ఒకే విధంగా, నిరంతరంగా సంఘ పనిని కొనసాగించారే తప్ప ఒక దశ నుండి మరొక దశకు మారుతున్నపుడు ఎక్కడా చిన్న విరామం కోరుకోలేదు. తన అన్నయ్య మరణించినా సంఘకార్యం మానలేదు. అంతటి నిబద్ధత గల ప్యాటాజీతో కలసి పనిచేయడం మనం దరి అదృష్టం. వీరు ఆఫీసులో చాలా నిజాయితీగా పనిచేశారు. ఎక్కడా, ఏనాడు నిజాయతీ విషయంలో వెనక్కి తగ్గలేదు. సంపాదనపై ఆశపడలేదు. ఉన్నంతలో తృప్తిగా జీవించారు.

సమాజంలో ఉచ్చ, నీచ భావాలు ఇప్పటికీ ఉండటం దురదృష్టం. ప్యాటాజీకి ఇవన్నీ తెలుసు. కాని ఇవన్నీ చూసినపుడు చాలామంది ప్రతిక్రియాత్మకంగా మాట్లాడుతారు. ఒక రకమైన ఆక్రోశం ఉంటుంది. కాని వీరు ప్రతిక్రియాత్మక భావాలుగాని, ఆక్రోశంగాని లేకుండా జీవించారు. అనంతపురంలో ఒకరోజు సామాజిక సమరసత సమావేశాలు జరిగాయి. రోజంతా అందరూ బాధతో, ఆక్రోశంతో మాట్లాడిన విషయాలన్నిటినీ వీరు ప్రశాంతంగా, ఓపిగ్గా విన్నారు. ఆ రోజు సాయంత్రం ముగింపు కార్యక్రమంలో వీరు ఎంతో సంతులనంతో మాట్లాడుతూ ‘ఉదయం నుండి మీరందరూ మాట్లాడినది వాస్తవమే. అయినప్పటికీ మౌలికంగా మనందరం హిందువులం. రక్తసంబంధీకులం’ అని వారు చెప్పగానే అందరూ శ్రద్ధగా ఆలకించారు. జరిగే సంఘటనలు, భేదభావాలు చూసి మనం విచలితులం కావద్దు. హిందూ సమాజమంతా ఏకాత్మ భావంతో జీవించడం ద్వారా మనం వికాసం పొందవలసిందే. ఆ విధంగా వారు పలికిన పదాలలో పవిత్రత, ఆత్మవిశ్వాసం, వినయం, పూర్తి విశ్వాసం వ్యక్తమైంది. రాష్ట్రీయ స్వయంసేవక సంఘంలో సమరసత ఉంది. కాని సంఘంలోనే కాకుండా సమాజంలో కూడా సమరసత రావాలి. అందుకే వారు నిరంతరం ప్రయత్నం చేస్తూ వచ్చారు. డాక్టర్ టి.వి. నారాయణగారిని వీరు స్వయంగా అన్నయ్య అని పిలిచేవారు. టి.వి. నారాయణగారు గొప్ప వ్యక్తి. సంఘం పట్ల వారి అభిప్రాయాలు వారివి. అయినా ప్యాటాజీ నిరంతరం స్నేహం వలన నారాయణగారిని సంఘా నికి దగ్గర చేశారు. ఒక సంవత్సరం విజయ దశమి ఉత్సవానికి నాగపూర్‌కు వారి వెంట ప్యాటాజీ వెళ్లారు. అలాంటి పెద్దలను సంఘానికి దగ్గర చేయడంలో నిరంతర పట్టుదల, వినయం వీరిలో పుష్కలంగా ఉండేవి. భాగ్యనగర్‌లో ఆయనకు అనేక కుటుంబాలతో ఆత్మీయ సంబంధం ఉండేది. ఒక వ్యక్తి తన వ్యక్తిగత జీవితాన్ని, కుటుంబ జీవితాన్ని, ఉద్యోగ జీవితాన్ని, సంఘ జీవితాన్ని, సమాజ జీవితాన్ని సమన్వయం చేసుకొంటూ, సంతులనంతో


కార్యక్రమంలో పాల్గొన్న సభికులు




ఆనందంగా ఎలా జీవించారనేది వీరిని చూసి నేర్చుకోవాలి. కొందరు పనిచేస్తున్నప్పటికి మాటిమాటికీ బాధపడుతూ పనిచేస్తుంటారు. కాని ప్యాటాజీ అన్ని సమయాల్లో ఆనందంగా జీవించారు. వినయం, కఠోరపరిశ్రమ, అహంకార రాహిత్యం, నిజాయతీ, నిరాండబరత, ఎక్కడా ఈర్ష్య, అసూయ లేకుండా ఆయన పరిపూర్ణమైన జీవితాన్ని సాగించారు. వీరి అవసాన దశలో కుటుంబ సభ్యులు చేసిన సేవ కూడా చాలా శ్రద్ధతో కూడుకున్నది. చివరిసారిగా హాస్పిటల్ వెళ్లి పలకరించాను. వారు నన్ను చూస్తున్నారే కాని మాట్లాడలేకపోయారు. చాలామందికి ధ్యేయంపట్ల భక్తి ఉంటుంది. సంఘటన పట్ల భక్తి ఉండదు. వీరికి రెండింటి పట్ల ఒకే విధమైన భక్తి ఉంది. ఒక స్వయంసేవక్‌గా ఎలా జీవించాలనేది మనముందు ఒక పుస్తకంగా వారి జీవితం దర్శనమిస్తుంది. అలాంటి ప్రేరణను మనందరికి ఇచ్చి వెళ్లారు. సంఘం పరంపరను కూడా వారి కుటుంబంలో సభ్యులందరూ నిలబెడతారని ఆశిస్తున్నాను.

సంఘ వ్యవస్థకు భిన్నంగా వారు ఎపుడూ నడుచుకోలేదు. ఎవరైనా అలా మాట్లాడితే వెంటనే సరిచేసేవారు. అలాంటి భక్తి, శ్రద్ధ మనలో కూడా నింపాలని భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటిస్తూ ప్యాటాజీ చరణాలకు ప్రణమిల్లుతూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను.' ★



'నేను భాగ్యనగర్‌లోని ఓల్డ్‌సిటీ భాగ్ సహ కార్యవాహగా ఉన్నపుడు ప్యాటా వెంకటేశ్వరరావు తూర్పు భాగ్ కార్యవాహగా ఉన్నందున విభాగ్ సమావేశాలలో వారితో పరిచయం కలిగింది. నేను భాగ్ ప్రచారక్‌గా వారు ఉన్న భాగ్‌కు వచ్చాను. అక్కడి నుండి వారితో కలిసి పర్యటించడం, కలిసి ఆలోచించడం వలన వారితో సాన్నిహిత్యం పెరిగింది. నేను ఖండ, నగర ప్రచారక్‌గా పని చేయలేదు. నేరుగా భాగ్ ప్రచారక్ అయ్యాను. అందువల్ల ప్రచారక్ అనుభవంలేదు. ప్రచారక్ జీవనశైలి ఎలా ఉండాలి, ఎలా మాట్లాడాలి, ఎలా ప్రవర్తించాలి మొదలగు విషయాలన్నీ ప్యాటాజీ వెంట ఉండి నేర్చుకున్నాను.

ప్రచారక్‌గా రాకముందు పాతబస్తీలో భాగ్ సండే అంటే వండే, తిండె, పండె (వండుకోవడం, తినడం, విశ్రాంతి తీసుకోవడంతో గడిపేస్తారు) అంటూ సరదాగా అనే వారు. ఈ విధంగా కార్యకర్తలు అధిక సమయ మివ్వాలని ఉద్బోధ చేసేవారు. ఒకసారి ప్యాటాజీ విజయవాడలో జరిగే రెండు ప్రాంతాలకు సంబంధించిన ద్వితీయవర్షకు వెళ్లారు. ఆ ఎండలకు చాలామంది తట్టుకోలేకపోయారు. కానీ ప్యాటాజీ విరేచనాలు, జ్వరం వచ్చినా లెక్కచేయకుండా చివరి వరకు ఉన్నారు.

ఆయన మంచి గాయకులు కూడా. సంఘ కార్యక్రమాలలో పాడటమే కాదు పాడేవారిని కూడా తయారుచేసేవారు. ఒక కిశోర స్వయంసేవక్‌ను విజయదశమి ఉత్సవంలో వైయక్తిక్ గీత్ పాడించడానికి ఒప్పించి అతని ఇంటికి ఏడెనిమిదిసార్లు వెళ్లి

# ఆయన చివరి శ్వాస వరకు సంఘం గురించే ఆలోచించారు!

సహకార్యవాహగా పనిచేసినపుడు నేను విద్యార్థినే, కనుక సాయంత్రం కాలేజీ పూర్తయ్యాక నేరుగా శాఖ పనికి వెళ్లేవాడిని. అలాగే ఉదయం కూడా కాలేజీ సమయం వరకు శాఖపనిలో ఉండేవాడిని. కానీ ప్యాటాజీ ఇంటిని చక్కబెట్టుకుంటూ, ఉద్యోగం చేస్తూ ఉదయం ప్రభాత్ శాఖకెళ్లి 9.30 గంటలకు ఇంటికి వచ్చి, తయారై ఆఫీసుకెళుతూ బ్యాగ్‌లో సంఘ నిక్కర్ ఉంచుకొని, తిరిగి ఆఫీసు నుండి నేరుగా సాయంశాఖ పర్యటన ముగించుకొని, శాఖ కార్యకర్తలను కలిసి ఏ రాత్రికో ఇల్లు చేరేవారు. నేను విద్యార్థిగా ఉన్నపుడు చేసిన పనిని ప్యాటాజీ ఇన్ని పనులు చేస్తూ కూడా ఎలా సంఘకార్యం నిర్వహిస్తు న్నారని ఆశ్చర్యం వేయడమే కాదు, నాకు సంఘ పని అధికంగా చేయాలని ప్రేరణ కలిగింది. ఈ విధంగా వారు ప్రతిరోజు సంఘ కార్యంకోసం పర్యటిస్తున్నపుడు తన ఆరోగ్యం గురించి ఏనాడూ ఆలోచించేవారు కాదు. కేవలం సంఘ కార్యానికే ప్రాధాన్యం ఇచ్చేవారు. వారు కొందరికి మిత్రులు, మరికొందరికి సోదరులు, ఇంకొందరికి మార్గదర్శకులు. కాని నా విషయంలో మాత్రం ఆ మూడూ వర్తిస్తాయి.


ప్యాటాజీ చతురతతో, హాస్యంతో మాట్లాడేవారు. హాస్యమే అని బయటకు అనిపించినా అందులో గొప్ప ఉద్దేశం, మర్మం, మార్గదర్శనం, బోధ ఉండేది. వారు ప్రాసమాటలు మాట్లాడేవారు. మన సంఘ పెద్దలు చెప్పిన 'సండే ఈజ్ సంఘ దే' అనేది మనకు గుర్తుచేస్తూ ఇతరులకు మాత్రం మరి పాట నేర్పించి, పాడించారు. అంతటి ఓరిమితో పాటు ఇతరులను తనలాగా తయారుచేయాలనే తపన కూడా ఆయనకు ఉండేది. 1972లో రామాంతపూర్‌లో జరిగిన బాల శిబిరానికి వారు ముఖ్యశిక్షక్‌గా వ్యవహరించినపుడు వారిని నేను మొదటిసారిగా చూసాను. అంచెలంచెలుగా అనేక బాధ్యతలు నిర్వహించారు. భాగ్‌స్థాయిలో, విభాగ్ స్థాయిలో, ప్రాంతస్థాయిలో సుమారు 38 సంవత్సరాలు కలసి పనిచేసాం. వారు సంఘటనా శాస్త్రంలో కుశలత్వంతో స్వయంసేవకులను ఆకట్టుకొని కార్యకర్తలుగా మలిచారు. అనేక కుటుంబాలతో దగ్గరి సంబంధం కలిగి ఉండేవారు. వారు మరణించడానికి ముందుగా హాస్పిటల్‌లో కొన్ని రోజులు అడ్మిట్ అయి చికిత్స పొంది ఇంటికి వచ్చారు. అపుడు నేను వారింటికెళ్లాను. వారి పరిస్థితి చూసి కేవలం పలకరించి, ఇబ్బంది పెట్టకుండా 10 నిమిషాలలో వెళ్లిపోవాలనుకున్నాను. కాని వారు మాటల్లో దించారు. ఆ పరిస్థితిలో కూడా కుటుంబం గురించి, తన శారీరక బాధల గురించి ఒక్క మాట మాట్లాడకుండా సంఘకార్యం, కార్యకర్తల గురించే 2 గంటలు నాతో ముచ్చటించారు. నాకు కూడా సమయం తెలియలేదు. ఆ తర్వాత కొన్ని రోజులకు మరలా ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. అక్కడే తుదిశ్వాస విడిచారు. ఆ విధంగా వారు ఆఖరి క్షణం వరకు సంఘం గురించే ఆలోచించిన ధన్యజీవి.'

***శ్యాంకుమార్, అఖిల భారతీయ ధర్మజాగరణ సహ సంయోజక్***



# బాల జాగృతి

## తెలుసుకుందాం పద్మాక్షి ఆలయం - హనుమకొండ



వరంగల్ జిల్లా హనుమకొండ నగరం నడిబొడ్డున వేయి స్తంభాల గుడికి అతిదగ్గరలో పద్మాక్షి దేవాలయం కొలువుదీరింది. ఇది 12వ శతాబ్దానికి చెందిన పురాతన ఆలయం. ప్రధానదైవం పద్మాక్షి అమ్మవారు. కాకతీయ రాజుల ఇలవేల్పు, ఆరాధ్య దైవం ఆమె. 10వ శతాబ్దకాలంలో ప్రతాపరుద్రుడు వేయిస్తంభాల గుడి నిర్మాణం కంటే ముందే పద్మాక్షి గుడిని నిర్మించారని కొందరు చరిత్రకారుల వాదన. కాకతీయుల ముసునూరి రాజులు అమ్మవారిని దర్శించి పూజలు నిర్వహించిన అనంతరం యుద్ధముహూర్తాలకు శుభగడియలుగా భావించి శత్రువులపై యుద్ధం ప్రకటించి విజయం సాధించేవారట. పద్మాక్షమ్మ గుట్ట దిగువన అందమైన చెరువు కూడా ఉంది. ఇక్కడ ప్రతి ఏటా బతుకమ్మ, దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి.

## కథ ఐకమత్యమే బలం



ఒక అడవిలో సింహం, చిరుతపులి ఉండేవి. సింహం బలమైనదే కాని వయసు మళ్లిన కారణంగా వేగంగా పరుగెత్తలేకపోయేది. దాంతో వేటాడడం కష్టమయ్యేది. చిరుతపులి బలంగా ఉండేది. అయినా అది సింహాన్ని చూసి భయపడేది. సింహంతో స్నేహం చేసేది. ఎందుకంటే సింహం మృగరాజు కదా! సింహంతో ఉంటే ఆపదలు రావని చిరుతపులి ఆలోచన.

ఒకసారి చాలా రోజులపాటు వాటికి ఆహారం దొరకలేదు. రెండూ ఆకలితో నకనకలాడుతున్నాయి. ఒకరోజు అవి అడవిలో ఆకులు, అలములు మేస్తున్న జింక పిల్లను చూసాయి. 'నేను జింకపిల్లను జాగ్రత్తగా ఒడిసి పట్టేస్తాను. మీరు దూరంగా ఉండి అది పారిపోకుండా చూడండి' అని సింహంతో చెప్పింది చిరుత. సింహం అలాగేనని దూరంగానే ఉండిపోయింది. చిరుత జింకపిల్లను బలంగా ఒడిసి పట్టుకొని చంపేసింది. జింకపిల్ల మరీ చిన్నది. ఒక్కరికి మాత్రమే సరిపోయేటట్లు ఉంది. కానీ చిరుత పులి, సింహం రెండు ఆకలిగా ఉన్నాయి. అక్కడ మొదలైంది వాదన 'జింకపిల్లను నేను చంపాను కాబట్టి నేనే తింటాను' అంది చిరుత.

'నేను మృగరాజును కాబట్టి నేనే తినాలి. నువ్వు ఎలాగూ బాగా పరిగెత్తగలవు. కాబట్టి మరో జంతువును వేటాడి తిను' అని గర్జించింది సింహం. వాటి మధ్య మాటా మాటా పెరిగింది.

## పద్యం

అల్పుడెపుడుఁబల్కు నాడంబరముగాను
సజ్జనుండు బల్కు చల్లగాను
కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా?
విశ్వదాభిరామ! వినుర వేమ!

**భావం :** తక్కువ బుద్ధి గలవాడు ఎప్పుడూ గొప్పలు చెప్పుచుండును. మంచి బుద్ధి గలవాడు తగినంత మాత్రమునే మాటలాడును. కంచు మ్రోగినంత పెద్దగా బంగారం మ్రోగదు కదా! అని భావం.

## శ్లోకం

ఈర్ష్యీ ఘృణీ త్వసంతుష్టః
క్రోధనో నిత్యశంకితః।
పరభాగ్యోపజీవీ చ
షడేతే నిత్యదుఃఖితా ॥

**భావం :** నిత్య దుఃఖితులు ఆరుగురు అని మహాభారత వచనం – 1. అసూయ గలవాడు, 2. అతిగా జాలిపడేవాడు లేదా అసహ్యించుకునేవాడు, 3. సంతృప్తి లేనివాడు, 4. ముక్కోపి, 5. నిత్య శంకితుడు (అన్నింటి మీద అనుమానం ఉన్నవాడు), 6. ఇతరుల సంపాదనపై ఆధారపడి జీవించేవాడు.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| భారము | మొక్క |
| పుష్పము | సత్తువ |
| మూలిక | ఉవిద |
| యువతి | బరువు |
| శక్తి | పూవు |


జవాబులు : భారము–బరువు, పుష్పము–పూవు, మూలిక–మొక్క, యువతి – ఉవిద, శక్తి–సత్తువ.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### కోసూరి సుబ్బరాజు



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధేయవాది. ఆగస్టు 13, 1914న పశ్చిమ గోదావరి జిల్లా తణుకు తాలూకా ఖండవల్లి గ్రామంలో జన్మించారు. 16 ఏళ్ల వయసులోనే జాతీయోద్యమంలోకి అడుగుపెట్టారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుకు కూడా వెళ్లారు. శాసనోల్లంఘన ఉద్యమంలోనూ పాల్గొన్నారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో భారతీయులు ఆంగ్ల సైన్యంలో చేరవద్దంటూ ప్రచారం చేశారు. హిందీ, ఖాదీ ప్రచారాల్లోనూ చురుగ్గా ఉండేవారు.



గర్జిస్తూ పంజాలు విసురుతూ రెండూ పోట్లాడుకోసాగాయి.

పొదల చాటున ఉన్న నక్క ఈ దృశ్యాన్ని చూసింది. వెంటనే దానికో ఉపాయం తోచింది. అక్కడే దాక్కుని అవకాశం కోసం ఎదురు చూడసాగింది. సింహం, చిరుత పోట్లాడి పోట్లాడి అలసిపోయి, కదలలేక అక్కడే పడిపోయాయి. నక్క అదే మంచి అదను అనుకుని పొదచాటు నుంచి వచ్చి జింకపిల్లను లాక్కొని పోయింది. సింహం, చిరుత చూస్తూ కూడా లేవలేకపోయాయి. ఆ తర్వాత ఎప్పటికో ఓపిక తెచ్చుకుని లేచి "అనవసరంగా పోట్లాడుకుని జింకను పోగొట్టుకున్నాం. మనం కలిసి ఉండకపోతే భవిష్యత్‌లో ఇలాగే జరుగుతుంది. కొంత నష్టం జరిగినా మనం కలిసే ఉండాలి. కలహించుకుంటుంటే ఇలాగే నష్టపోతాం. కలిసి ఉంటే సుఖపడతాం. ఇంకెప్పుడూ పోట్లాడుకోకూడదు' అనుకున్నాయి. ★

## జనరల్ నాలెడ్జ్

1. శ్రీలంక నూతన ప్రధానమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టారు?
2. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌గా ఎవరు నియమితులయ్యారు?
3. ప్రపంచ రక్తదాన దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటారు?

సమాధానాలు : 1. రణిల్ విక్రమసింఘే; 2. రాజీవ్‌కుమార్; 3. జూన్ 14.

## మెదడుకు మేత

పచ్చపచ్చని తోటలో
ఎర్ర ఎర్రని
సిపాయిలు?

జవాబు : మిరపతోటలో మిరపపండ్లు


## మంచిమాట

వైఫల్యం నిరాశకు
కారణం కాకూడదు..
కొత్త ప్రేరణకు పునాది
కావాలి.



# వారఫలాలు

23-29 మే 2022




సింహంభట్ల సుబ్బారావు
6300674054




**మేషం :** అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

పరిస్థితులు అనుకూలిస్తాయి. సమాజంలో గుర్తింపు పొందుతారు. నూతన ఉద్యోగాలు దక్కవచ్చు. రాబడి అనూహ్యంగా పెరుగుతుంది. స్థిరాస్తి వివాదాలు కొలిక్కి వస్తాయి. ఇంటి నిర్మాణాల్లో అవాంతరాలు తొలగుతాయి. విద్యార్థులకు అవకాశాలు దక్కుతాయి. ఉద్యోగులకు ఆటుపోట్లు తొలగి ఊరట లభిస్తుంది. 28,29 తేదీల్లో వృథా ఖర్చులు. కుటుంబంలో ఒత్తిడులు. స్వల్ప అనారోగ్యం. దుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.



**వృషభం :** కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

వీరికి పట్టింది బంగారమే అన్నట్లుగా ఉంటుంది. నిరుద్యోగులకు శుభవర్తమానాలు. పనులు అనుకున్న సమయానికి పూర్తిచేస్తారు. ఆస్తుల విషయంలో చిక్కులు తొలగుతాయి. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులు విధుల్లో చాకచక్యంగా వ్యవహరించి ఆటంకాలు అధిగమిస్తారు. రాజకీయవేత్తలకు ముఖ్య సమాచారం రావచ్చు. 26,27 తేదీల్లో మానసిక ఆందోళన. బంధువుల నుంచి సమస్యలు. దేవీ ఖడ్గమాల పఠించండి.



**మిథునం :** మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ఆలోచనలు కార్యరూపంలో పెడతారు. ఆదాయం పెరుగుతుంది. కొన్ని సమస్యలను తెలివిగా పరిష్కరించుకుంటారు. వాహనాలు, ఆభరణాలు కొంటారు. కొన్ని వివాదాల నుండి బయటపడతారు. వ్యాపారులు ఒడుదోడుకులు అధిగమిస్తారు. ఉద్యోగులకు విధుల్లో మరింత సానుకూల పరిస్థితులు ఉంటాయి. 23, 24 తేదీల్లో దూరప్రయాణాలు. ఆరోగ్య సమస్యలు. ఆంజనేయ దండకం పఠించండి.



**కర్కాటకం:** పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

కొన్ని సమస్యలు ఎదురైనా మనోధైర్యంతో అధిగమిస్తారు. ఆర్థిక విషయాలు సంతృప్తినిస్తాయి. ఆలోచనలు కలసివస్తాయి. మీ ఆశయాలు కొన్ని నెరవేరతాయి. వ్యాపారులు విస్తరణ కార్యక్రమాలు చేపడతారు. ఉద్యోగులు గందరగోళం నుండి బయట పడతారు. క్రీడాకారులు, రచయితలకు ఆశయసిద్ధి. 24,25 తేదీల్లో కుటుంబంలో ఒత్తిడులు. మానసిక ఆందోళన. శారీరక రుగ్మతలు. శ్రీకృష్ణాష్టకం పఠించండి.



**సింహం :** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

కొన్ని కార్యక్రమాలు జాప్యం జరిగినా పూర్తి చేస్తారు. విద్యార్థులు, నిరుద్యోగులకు అనుకూల సమయం. వాహనాలు, ఆభరణాలు కొంటారు. ఉద్యోగులకు బాధ్యతలు తగ్గవచ్చు. కళాకారులకు శ్రమ ఫలిస్తుంది. వైద్యులు, పరిశోధకులు ఉత్సాహంగా అడుగులు వేస్తారు. 26,27 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. బంధువులతో తగాదాలు. అనారోగ్యం. విష్ణు సహస్రనామ పారాయణ చేయండి.



**కన్య :** ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

ధనసంపాదనలో లక్ష్యాలు సాధిస్తారు. ఆలోచనలు అమలు చేస్తారు. ఆస్తి వ్యవహారాలలో సమస్యలు తీరి లబ్ధి పొందుతారు. ఇల్లు, వాహనాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారులకు మెరుగైన లాభాలు. ఉద్యోగులకు ఒత్తిడుల నుంచి విముక్తి. రచయితలు, క్రీడాకారులు నైపుణ్యతను చాటుకుంటారు. 28,29 తేదీలలో ఆకస్మిక ప్రయాణాలు. స్నేహితులతో తగాదాలు. నృసింహ స్తోత్రాలు పఠించండి.



**తుల :** చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

ఆశించిన ఆదాయం సమకూర్చుకుని అవసరాలు తీర్చుకుంటారు. విద్యార్థుల ప్రతిభకు తగిన గౌరవం దక్కుతుంది. ఇంటి నిర్మాణయత్నాలు అనుకూలిస్తాయి. వ్యాపారులు ఉత్సాహంతో లాభాలు అందుకుంటారు. ఉద్యోగులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. కళాకారులకు ఆదరణ లభిస్తుంది. 27,28 తేదీల్లో బంధువులతో తగాదాలు. మనశ్శాంతి లోపిస్తుంది. అన్నపూర్ణాష్టకం పఠించండి.



**వృశ్చికం :** విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కొద్దిపాటి చిక్కులు, సమస్యలు ఎదురైనా క్రమేపీ అధిగమిస్తారు. ఆస్తుల విషయంలో అగ్రిమెంట్లు చేసుకుంటారు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు పరిస్థితులు అనుకూలిస్తాయి. రాజకీయవేత్తలకు ఊహించని పిలుపు అందవచ్చు. వైద్యులు, కళాకారులు సత్తా చాటుకుంటారు. 23, 24 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. కష్టమే తప్పితే ఫలితం ఉండదు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.



**ధనుస్సు :** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

మొదట్లో ఎదురయ్యే సమస్యలు క్రమేపీ తొలగుతాయి. రాబడి ఆశించినంతగా ఉంటుంది. ఇంటి నిర్మాణం, కొనుగోలుపై ప్రతిష్టంభన తొలగుతుంది. వ్యాపారులు లాభపడతారు. ఉద్యోగులకు అదనపు బాధ్యతల నుంచి విముక్తి. రచయితలు, క్రీడాకారుల అంచనాలు ఫలిస్తాయి. 26,27 తేదీల్లో వృథా ఖర్చులు. కుటుంబంలో వివాదాలు. హయగ్రీవ స్తోత్రాలు పఠించండి.



**మకరం :** ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆలోచనలు కలసిరాక ఇబ్బంది పడతారు. ఆర్థిక విషయాలు కాస్త ఊరటనిస్తాయి. ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి. వాహనాలు నడిపే వారు అప్రమత్తత పాటించాలి. వ్యాపారులకు సాదాసీదా లాభాలు. ఉద్యోగులు కొద్దిపాటి చికాకులు ఎదుర్కొంటారు. రాజకీయవేత్తలు పదవులు దూరం చేసుకుంటారు. 25,26 తేదీల్లో శుభవార్తలు. వాహనయోగం. ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. విష్ణుధ్యానం చేయండి.



**కుంభం :** ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

చిరకాల స్వప్నం ఫలిస్తుంది. నిరుద్యోగులకు ఊహించని ఉద్యోగాలు రావచ్చు. వాహనాలు, ఇళ్లు కొనుగోలు యత్నాలు కలసివస్తాయి. వ్యాపారులకు మరిన్ని పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగులకు ఒత్తిడులు తొలగుతాయి. రాజకీయవేత్తలకు శ్రమ ఫలిస్తుంది. రచయితలు, క్రీడాకారులు పేరుప్రతిష్టలు గడిస్తారు. 27, 28 తేదీల్లో బంధువులతో ఆరోగ్యభంగం. ఆదిత్య హృదయం పఠించండి.



**మీనం :** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

అనుకున్న కార్యక్రమాలు సమయానికి పూర్తి చేస్తారు. రాబడి పెరిగి అవసరాలు తీరతాయి. వాహనాలు కొనుగోలు చేస్తారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు. వ్యాపారులకు పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగులకు ఒడుదోడుకులు తొలగుతాయి. రచయితల సృజనాత్మకత వెలుగులోకి వస్తుంది. 24,25 తేదీల్లో ఆరోగ్య సమస్యలు. ఆప్తులతో కలహాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.★

నిర్వహణ : సుధామ, 9849297958

# పదరసం-367

## ఆధారాలు

**అడ్డం**

1. ఆంజనేయుడు (3)
3. అబద్ధం (2)
4. గుండె ధైర్యానికి వ్యవహారం (3)
6. ప్రారంభోత్సవాలకు కత్తిరించేది (3)
7. బొంగురు, రేఖామాత్రం (2)
8. పేరొందిన చారిత్రక పురుషుడు.... ప్రతాప్! (4)
10. తరువాత, అనంతరం (3)
12. ఆడ తాబేలు (2)
14. దుగ్ధము (2)
15. ఓ స్వభావము అల్లరి పిల్లవాడిలోనిదే! (4)
18. తండ్రి (2)
20. చిన్న పళ్లెము (3)
22. అటుగా నా కాలు (3)
24. చెట్టు (2)
27. చీమలు మధ్యలో మాయం! (2)
28. మాసము (2)
30. తిరిగిపోయిన లత (2)
32. పట్టణము (2)
34. అటుగా పక్షి రెక్కలోని భాగం (2)
36. కౌపీనము (2)
38. కంచుకము (3)
39. భారత తొలి ప్రధాని (2)
40. ఓ రాగం మోముకు శత్రువా! (3)

**నిలువు :**

1. నాగలి (3)
2. ముప్పితము తోడిది (4)
3. కొండల సందు త్రోవ (3)
4. మునసబులు కారు వేరేవారు (4)
5. సీత (3)
7. జీలకట్ట, కవచము, బాణము (2)
9. గాథా సప్తశతి రచించిన వాడు (3)
10. పెళ్లి పేరంటాలకు ఆహ్వానం (4)
11. తలక్రిందయిన కందమూలం (2)
13. కొన్ని భాషలకు ఇప్పటికీ లేనిది (2)
14. పురాతనం (2)
16. అత్త మీది కోపం దీని మీదా? (2)
17. మురికి (2)
19. కుతూహలము (2)
21. అడుగునుంచి చీకాకు (3)
23. రసన (3)
25. ఓర్పరి (2)
26. అగర్తలా రాజధానిగా గల రాష్ట్రం, ఓ రచయిత (3)
29. అడుగు నుంచి అల్లరి (2)
31. పెద్ద కెరటం (3)
33. సూర్యుడు (2)
35. ఆకుల నరము (2)
37. నెత్తురుతో బాటు వ్యవహార పదం (2)

**మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27**

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | ✠ | 3 | | ✠ | 4 | | 5 |
| | ✠ | 6 | | | ✠ | 7 | | ✠ | |
| | ✠ | | ✠ | 8 | 9 | | | ✠ | |
| ✠ | 10 | | 11 | ✠ | | ✠ | 12 | 13 | ✠ |
| 14 | | ✠ | 15 | 16 | | 17 | ✠ | 18 | 19 |
| 20 | | 21 | ✠ | | ✠ | | ✠ | ✠ | |
| ✠ | 22 | | 23 | ✠ | ✠ | ✠ | 24 | 25 | ✠ |
| 26 | ✠ | 27 | | ✠ | 28 | 29 | ✠ | 30 | 31 |
| 32 | 33 | ✠ | 34 | 35 | ✠ | 36 | 37 | ✠ | |
| 38 | | | ✠ | 39 | | ✠ | 40 | | |

**పదరసం - 367**

పేరు : ..........................................................................................

చిరునామా:..........................................................................................

..........................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ...............................................

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2022 జూన్ 06 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 363 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 శు | భ | 2 శు | క్ర | 3 వా | ర | 4 ము | ✠ | 5 సోం |
| 6 ఈ | క | ✠ | భ | ✠ | లి | ✠ | 7 రా | 8 ప | ద |
| 9 స | ము | 10 ద్ర | ము | ✠ | ✠ | 11 వై | రి | భా | ర్య |
| ఫ | ✠ | జ్యో | ✠ | 12 నై | 13 వే | ద్యం | ✠ | త్ర | ✠ |
| ✠ | 14 అ | ల్బ | మ్ | ✠ | ట | ✠ | 15 అ | ✠ | 16 మా |
| 17 మ | ✠ | ణం | ✠ | 18 వ | ✠ | 19 వై | జ్ఞా | ని | కం |
| 20 హా | యి | ✠ | 21 కు | సు | మ | వ | ని | ✠ | దం |
| వీ | ✠ | 22 కి | డి | మ | ✠ | ర్జుం | ✠ | 23 ఎ | ✠ |
| 24 రు | మా | లు | ✠ | 25 తి | 26 న | ✠ | 27 మో | ద | 28 ము |
| డు | ✠ | 29 ము | డి | ✠ | 30 డి | మ | ము | ✠ | క్కు |

**విజేతలు:** డి.సుధాకర్, ఎం.విజయలక్ష్మి, బి.ఇందుశేఖర్–హైదరాబాద్, వి.రామలింగాచారి–యాదగిరిగుట్ట, సి.హెచ్. పల్లవీమహేశ్వర్–జగిత్యాల, ఎస్.రాజు–కర్నూలు, పి.సీతామహాలక్ష్మి–తిరుపతి, టి.వి.సుబ్రహ్మణ్య శర్మ–నెల్లూరు, ఎన్.వి.ఎస్.శర్మ–కోనసీమ, జి.ఆదినారాయణ రెడ్డి–కడప, డా॥బి.ధన్వంతరి–మచిలీపట్నం, వి.ఉమా మహేశ్వరశర్మ–అనంతపురం, టి.వెంకాయమ్మ–ఒంగోలు, కె.సత్యనారాయణ–విశాఖపట్నం, ఎన్.సుభాష్ చంద్రబోస్–వైజాగ్, కె.కాంతామణి–భువనేశ్వర్.

**బహుమతి పొందిన విజేత:**

**కె.సత్యనారాయణ-విశాఖపట్నం.**

సి ని మా

అరుణ

ఈ మధ్య కాలంలో మహేశ్ బాబు రిస్క్ తీసుకోవడం బాగా తగ్గించేశాడు. అది వ్యక్తిగత జీవితంలో కావచ్చు వృత్తిపరంగా కావచ్చు. కరోనా టైమ్‌లో అయితే చాలా నెలలు షూటింగ్‌కు దూరంగా ఉండి, ఇల్లు వదిలి బయటకే రాలేదు. అలానే కథల ఎంపికలోనూ ప్రయోగాల జోలికు పోకుండా ఫక్తు కమర్షియల్ సినిమాలకే ప్రాధాన్యమిచ్చాడు. దాంతో గత మూడు నాలుగేళ్లుగా విజయపథంలో సాగిపోతున్నాడు. కానీ అన్ని సందర్భాలలోనూ మన అంచనాలు నిజం కావాలని లేదు. ఒక్కోసారి ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కరోనా రావొచ్చు, సినిమాలూ ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవచ్చు. అదే మహేశ్‌బాబు విషయంలోనూ జరిగింది. అతని అన్న రమేశ్ బాబు మరణించే సమయానికి మహేశ్ కరోనా బారిన పడ్డాడు. భారీ అంచనాలతో ఇటీవల వచ్చిన 'సర్కారు వారి పాట' సినిమా సైతం మిశ్రమ స్పందనే అందుకుంది.



# నేల విడిచి సాము: సర్కారు వారి పాట


కథ విషయానికి వస్తే మహి (మహేశ్‌బాబు) అమెరికాలో ఫైనాన్స్ కార్పొరేషన్ నిర్వహిస్తుంటాడు. ఎదుటి వారికి అవసరం మేరకు అప్పులిచ్చి, వడ్డీని సక్రమంగా వసూలు చేస్తుంటాడు. అందుకోసం ఎంతదూరమైనా వెళ్తాడు. ఓసారి కళావతి (కీర్తిసురేశ్) అనే అమ్మాయి అందానికి ఫిదా అయి రూల్స్‌ను పక్కన పెట్టి డబ్బులు అప్పుగా ఇస్తాడు. ఆ తర్వాత తాను మోసపోయాననే విషయం అర్థమౌతుంది. ఆమె తండ్రి రాజేంద్రనాథ్ (సముతిర ఖని) వైజాగ్‌లో ఎంపీ, పెద్ద పారిశ్రామిక వేత్త అని తెలుసుకుంటాడు. తన అప్పును వసులూ చేసుకోవడానికి ఇండియాకు వస్తాడు. అప్పటికే రాజేంద్రనాథ్ బ్యాంకును కొల్లగొట్టి పదివేల కోట్ల రూపాయలు లూటీ చేశాడనే విషయం బోధపడుతుంది. ఆ మొత్తాన్ని అతని ద్వారా బ్యాంక్‌కు ఎలా తిరిగి కట్టించాడన్నదే సినిమా కథ.

పారిశ్రామికవేత్తలకు బ్యాంకులు ఎర్ర తివాచీ పరిచి మరీ కోట్లరూపాయలు లోన్లుగా ఇవ్వడం ఈ దేశంలో కొత్తకాదు. కొన్ని దశాబ్దాలుగా కేంద్రంలోని ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే ఈ తతంగం సాగుతోంది. కోట్ల రూపాయలు రుణాలుగా తీసుకున్న కొంతమంది బడా పారిశ్రామికవేత్తలు దేశం విడిచి పారిపోవడం, చివరకు బ్యాంకులు ఏమీ చేయలేక చేతులెత్తేయడం, సంబంధిత అధికారులు ఆ రుణాలను మాఫీ చేయడం చూస్తూనే ఉన్నాం. ఈ విషయాన్ని కథాంశంగా ఎంచుకోవడం బాగానే ఉంది. కానీ ఆ మొత్తాన్ని రికవరీ చేసే క్రమంలో బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించకుండా సామాన్య ఖాతాదారులను హీరో రెచ్చగొట్టడం సబబుగా లేదు. సామాన్యుల విషయంలో కటువుగా వ్యవహరించే బ్యాంకులు పారిశ్రామికవేత్తల అడుగులకు మడుగులొత్తడం ఎంతవరకూ కరెక్ట్ అని ప్రశ్నిస్తూ, ప్రజలు తిరుగుబాటు చేసినట్టు చూపినా బాగుండేది. కానీ దానికి భిన్నంగా బ్యాంకులకు, వాటి పట్ల ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని; రుణాలు తీసుకోవడం, తిరిగి చెల్లించడం అనే విధానాన్ని బలహీనపర్చేలా దర్శకుడు చూపించాడు. రుణాన్ని వసూలు చేసే క్రమంలో బ్యాంకు అధికారులు కఠినంగా వ్యవహరించడం వల్ల హీరో తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకుంటారు. బ్యాంకులతో, వాటి అధికారులతో ఇంతటి చేదు అనుభవం ఉన్న హీరో పెరిగి పెద్దయిన తర్వాత ఓ ఫైనాన్స్ కంపెనీని ఏర్పాటు చేయడం, అందరికీ రుణాలు ఇవ్వడం, తిరిగి చెల్లించని వారిని చావగొట్టి చెవులు మూసి రికవరీ చేయడం అనేది పూర్తి కాంట్రాస్ట్‌గా ఉంది. దాంతో హీరో క్యారెక్టరైజేషన్ పలచబడిపోయింది. అమాయకమైన బ్యాంకు అధికారులను ఇరికించి, పారిశ్రామికవేత్తలు కోట్ల రూపాయలు రుణాలు తీసుకుని పబ్బం గడుపుతున్నారని చూపడం కూడా సమంజసంగా అనిపించదు. ఎందుకంటే ఈ దేశం వదిలి వెళ్లిపోయిన వారిలో బ్యాంక్ అధికారులుగా పనిచేసి, కమీషన్ల కోసం కోట్ల రూపాయల రుణాలను ఇచ్చిన వారూ ఉన్నారు. ఇదంతా ఒక ఎత్తు అయితే... లోన్ ఎందుకు కట్టలేదు అని హీరో సదరు పారిశ్రామికవేత్తను అడిగితే, 'నాకు అసలు బ్యాంక్ వారు నోటీసే ఇవ్వలేదు' అని అతను చెప్పడం, ఆ నోటీసు ఇప్పించడం కోసం సదరు హీరో పెద్ద యుద్ధమే చేయడం మరీ హాస్యాస్పదం. మహేశ్ బాబుకు ఉన్న ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకుని సీన్స్ రాసుకున్నారు తప్పితే, మొత్తం కథగా చూసుకుంటే బోలెడన్ని లూప్‌హోల్స్ ఉన్న విషయాన్ని పట్టించుకోలేదు. తన తల్లిదండ్రుల చావుకు కారణమైన బ్యాంక్ అధికారిణిని హీరో సేవ్ చేయడం, నడిరోడ్డు మీద పార్లమెంట్ సభ్యుడిని లోన్ కట్టమని హీరో డిమాండ్ చేయడం, తన మీద కాలువేసి పడుకోమంటూ హీరోయిన్ గోల చేయడం.. చిత్రంగా అనిపిస్తాయి.

నటీనటుల విషయానికి వస్తే మహేశ్ బాబు తన పాత్రలో చక్కగా ఒదిగిపోయాడు. పాటల్లో డాన్స్ బాగా చేశాడు. హీరో, హీరోయిన్ల మధ్య సాగే సరదా సంభాషణ, వెన్నెల కిశోర్ పంచ్ డైలాగ్స్ బాగున్నాయి. మహేశ్ ఓ అడుగు కిందకు దిగి ఈ లవ్ సీన్స్ చేశాడనిపించింది. అతని ఫ్యాన్స్ ఈ విషయంలో హ్యాపీ. కానీ ద్వితీయార్థంలో లోన్ రికవరి, దాని కోసం కిడ్నాపులు, హీరో చేసే వీరోచిత పోరాటాలు, హీరోయిన్ వెకిలి చేష్టలు... ఇవి ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెట్టాయి. దాంతో మూవీ గ్రాఫ్ దారుణంగా పడిపోయింది. నటీనటులంతా బాగానే చేశారు. తమన్ సమకూర్చిన స్వరాల్లో టైటిల్‌సాంగ్‌తో పాటు 'కళావతి, మమ మహేశ్' పాటలు బాగున్నాయి. సాంకేతిక నిపుణులు చక్కని సహకారమే అందించారు. మైత్రి మూవీ మేకర్స్, 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి మహేశ్‌బాబు ఈ చిత్ర నిర్మాణ భాగస్వామిగా వ్యవహరించాడు. దాంతో నిర్మాణ విలువలు బాగున్నాయి. దర్శకుడు పరశురామ్ ప్రథమార్థంతో పాటు ద్వితీయార్థం మీద కూడా ఇంకా స్వతంత దృష్టి పెట్టి, నేల విడిచి సాము చేయకుండా ఉండి ఉంటే.. సినిమా మరోస్థాయిలో ఉండేది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.200/-




వెల : ₹.200/-




వెల : ₹.390/-




వెల : ₹.300/-




వెల : ₹.200/-





వెల : ₹.250/-





వెల : ₹.200/-





వెల : ₹.200/-





వెల : ₹.250/-





వెల : ₹.250/-





వెల : ₹.599/-





వెల : ₹.349/-




వెల : ₹.695/-




వెల : ₹. 799/-




వెల : ₹.50/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329


సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 63035 41244

From:
JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1,
Lingampally, Kachiguda,
Hyderabad-500027
web : jagritiweekly.com

Publishing on Every Thursday
Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023
RNI Regd. No. 3270/57.
Volume : 74 Issue : 30

MAHAVEER
GROUP OF INSTITUTIONS
( AN ISO 9001-2008 CERTIFIED INSTITUTION)






Counseling Code : MHVR
MAHAVEER
INSTITUTE OF SCIENCE & TECHNOLOGY
(Approved by AICTE, Affiliated to JNTUH, Hyderabad.)
Email: mist.admissions@gmail.com | website : mist.ac.in
Estd : 2001
Courses Offered :

| | | |
|---|---|---|
| B.Tech | ECE \| EEE \| CSE \| IT \| MECH. \| CIVIL \| AERO | PG |
| M.Tech | DE & CS \| VLSI \| PE & ES \| CSE \| SE \| AMS | MBA |

Counseling Code : MHVR
MAHAVEER
Institute of Science & Technology Polytechnic (2nd Shift)
(Approved by AICTE, Affiliated to SBTET Hyderabad.)
Email: mist.admissions@gmail.com | website : mist.ac.in
Estd : 2009
Courses Offered :
Polytechnic: DECE | DEEE | DCME | DME | DCE

Counseling Code : AARM
AAR MAHAVEER
ENGINEERING COLLEGE
(Approved by AICTE, Affiliated to JNTUH, Hyderabad.)
Email: aarm.admissions@gmail.com | website : aarm.ac.in
Estd : 2010
Courses Offered :
B.Tech: ECE | EEE | CSE | MECH.

MAHAVEER DEGREE COLLEGE
For Arts, Commerce & Science
(Approved by Telangana Govt. - Affiliated to Osmania University)
Email: mdc.admissions@gmail.com | website : mahaveerdegreecollege.com
Estd : 2014
Courses Offered :
B.Com: Computers & General | B.Sc: MSCs

Sponsored by MAHAVEER EDUCATIONAL SOCIETY

FOR NRI / MANAGEMENT SEATS
Ph: 040-29880079, 29880086, 29880089, 29880081, 29880087
Cell : 9542001907, 9849944411
Vyasapuri, Bandlaguda, Post : Keshavgiri, Hyderabad - 500 005.